
సురవరం సుధాకరరెడ్డి
వ్యాసాలు - లేఖలు
రూ॥200/- పేజీలు:290
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



రాజ్యాంగ విలువల కోసం ప్రతిపక్షం పోరాటం 06

'మఖానా' శ్రమ దోచుకుంటున్న దళారులు 05

ప్రజాస్వామ్యం, కుల వ్యవస్థ కలిసి ఉండలేవు



సంపుటి 28, సంచిక: 67 | మంగళవారం | 26-08-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


# ప్రపంచ స్థాయికి ఉస్మానియా వర్సిటీ

- 'ఆక్స్‌ఫర్డ్' తరహా ప్రమాణాలను పెంచాలి
- రూ.వెయ్యి కోట్లు ఖర్చుపెట్టడానికైనా ప్రభుత్వం సిద్ధమే
- ఇంజనీర్లు, విద్యాశాఖ విభాగాలకు చెందిన ప్రతినిధులతో కమిటీ వేసి అంచనాలను రూపొందించండి
- డిసెంబర్‌లో మళ్లీ విశ్వవిద్యాలయానికి వస్తా
- అక్కడే నిధులు మంజూరు చేస్తా : సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- సాయుధరైతాంగ పోరాటంలో ఎర్రజెండా మోసిన ఎంతో మందికి ఒయు అండగా నిలిచిందని వ్యాఖ్య
- ఇరవై ఏళ్ల తర్వాత ఒయులో ఒక ముఖ్యమంత్రి ప్రసంగం
- బిఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ఉస్మానియా వర్సిటీకి బతుకుండదని ఆవేదన
- రూ.90 కోట్లతో నిర్మించిన వసతి గృహ భవనాల ప్రారంభం
- వాటికి దుందుభి, బీమా వసతి భవనాలుగా నామకరణం
- డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూములకు శంకుస్థాపన

దేశానికి అతిపెద్ద సంపద యువతే. అలాంటి యువత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒయు చదువులకే కాకుండా పరిశోధనలకు వేదిక కావాలి. గంజాయి, డ్రగ్స్ నియంత్రించేందుకు ఈగల్ సంస్థను ఏర్పాటు చేస్తే కూడా వ్యతిరేకిస్తున్నారు. ఇంతకు గంజాయి, డ్రగ్స్ విక్రేతలతో లాలూచీ ఏమిటీ?. డ్రగ్స్ తీసుకుంటే పట్టుకోవద్దా?. గంజాయి, డ్రగ్స్‌ను అందరూ తీసుకోవచ్చనే రాజ్యాంగం ఏమైనా ఉంటే చూపించాలి
– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'ఆక్స్‌ఫర్డ్' లాంటి ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల తరహా ప్రమాణాలను పెంచాలని, అందుకు అవసరమైతే వెయ్యి కోట్ల రూపాయలైనా ఖర్చు పెట్టడానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎవరో లక్ష కోట్లతో కట్టింది కూలిందని,గంగలో పోయిందని,'మీ కోసం వెయ్యి కోట్లు ఖర్చుపెట్టడానికి తమకు ఏమైనా దారిద్ర్యమా? అని అన్నారు. ఇంజనీర్లు, విద్యాశాఖ విభాగాలకు చెందిన ప్రతినిధులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఒయులో కావాల్సిన అన్ని అవసరాలకు తగిన అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని, వాటిని పూర్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. డిసెంబర్‌లో ఒయులోని ఆర్ట్స్ కళాశాల వద్ద సభను నిర్వహించి, ఆ సభ వేదికపై నుంచే ఒయుకు అవసరమైన నిధులను, ఇతర అనుమతులను అప్పటికప్పుడే మంజూరు చేస్తామని సిఎం హామీనిచ్చారు. మరో ఆరునెలల్లోనే మరో 40వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని, రెండున్నరేళ్ల తమ పాలనలో లక్ష ఉద్యోగాలను కల్పించాలనే లక్ష్యంతో తాము ముందుకెళ్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని రూ.90 కోట్లతో నిర్మించిన వసతి గృహ తరువాయి 2లో

కమ్యూనిస్టులకు రాజకీయ అధికారం దక్కితేనే

# సోషలిస్టు ఇండియా




సిపిఐ ఎపి రాష్ట్ర మహాసభలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**ఒంగోలు:** గ్రామస్థాయిలో కమ్యూనిస్టు పార్టీని విస్తరించి బలోపేతం చేస్తే రానున్న రోజుల్లో రాజకీయ అధి కారం సిపిఐదేనని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. ఒంగోలులో జరుగుతున్న సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 28వ మహాసభల సంద ర్భంగా రెండో రోజు ప్రతినిధుల సభను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ దేశంలో మతతత్వశక్తుల ప్ర మేయం అధికమైపోతుందని దాన్ని అడ్డుకునే శక్తి కమ్యూనిస్టు పార్టీలకే ఉందన్నారు. సోషలిస్ట్ ఇండి యాగా అవతరించాలంటే, రాజకీయ అధికారం కమ్యూనిస్టు పార్టీలకు దక్కాలని, అందుకు ప్రజా పోరాటాలు విస్తృతం చేసి క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ట పరచాలని ప్రతినిధులకు నొక్కి చెప్పారు. ఎపిలో సమర్థవంతమైన నాయకత్వం ఉందని, ఐ క్యంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని ఈ మహాసభలు వేదికగా ముందుకు వెళ్లాలని కోరారు.ట్రంప్ డైరెక్ష న్‌లో భారత్ నడవడం ఏమిటని, ఇజ్రాయిల్ దాడిని భారత్ సమర్థించడం దుర్మార్గమన్నారు. దేశంలో మతతత్వ శక్తుల దాడులు పెరిగి పోయాయని, ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను బిజెపి అమ లు చేస్తునదని, రాష్ట్రంలో చంద్రబాబు బిజెపికి మద్దతు తెలుపు తున్నారని మండిపడ్డారు. పార్ల మెంటరీ ప్రజాస్వా మ్యంలో చీకటి రోజులు వస్తు న్నాయన్నారు. వీట న్నింటినీ ఎదుర్కోవాలంటే సిపిఐ క్షేత్ర స్థాయిలో బలోపేతం కావాలని, ప్రతి ఎన్నికల్లో పోటీ చేయా లని పిలుపునిచ్చారు. మహాసభలో వేదికపై సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, ఎపి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జల్లివిల్సన్, అక్కినేని వనజ ముప్పాళ తదితరులు ఆసీనులయ్యారు.

## ప్రశ్నించే తత్వం కమ్యూనిస్టు లక్షణం

సిపిఐ ఎపి మహాసభలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

వందేళ్లు సజీవంగా ఉన్న పార్టీ కమ్యూనిస్టు పార్టీయేన ని, ప్రజల కోసం పుట్టిన సిద్ధాంతంతో ఘోష, గొంతుకతో ఉన్నాం కాబట్టే వందేళ్లుగా సిపిఐ ఎన్నో చారిత్రక పోరాటాలు నిర్వహించిందని, ప్రశ్నించే తత్వం ఉన్నంతకాలం కమ్యూనిజం సజీవంగానే ఉంటుందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చెప్పారుకమ్యూనిజం కాలం చెల్లిన సిద్ధాంతమని ప్రచారం చేస్తున్నారని, దీనిని తిప్పికొట్టే బాధ్యత ప్రతీ కమ్యూనిస్టుపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సిద్ధాంతంపై అవగా



హన, మనపట్ల మనకు విశ్వాసం, నమ్మకం పెంచుకోవాలని హితవు పలికారు. నిత్య అధ్యయనం ద్వారా అలుపెరగని పోరాటం చేస్తేనే ప్రజలలో పార్టీకి స్థిరమైన బలం పెరుగుతుందన్నారు. మరణం తర్వాత కమ్యూనిస్టు పార్టీ నేతలకు విశే ష ఆదరణ లభిస్తుందన్నారు. ఇటీవల సీతారాం ఏచూరి, సురవరం సుధాకరరెడ్డి అంతిమయాత్రలకు ప్రజాదరణ దీనికి అద్దం పడుతుందన్నారు. సురవరం సుధాకరరెడ్డికి వేలాదిమంది కమ్యూనిస్టు కార్యకర్తలు, నేతలు ఘన నివాళులు అర్పించారని కొనియాడారు.

## బిసి రిజర్వేషన్‌లపై ఢిల్లీలో సంప్రదింపులు



- అభిషేక్ మను సింఘ్వీతో చర్చించిన సిఎం, డిప్యూటీ సిఎం
- జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- ఖర్గేను కలిసిన ముఖ్యమంత్రి

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల కల్పనపై తెలంగాణ రాజ్యసభ ఎంపి, సుప్రీం కోర్టు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీతో ఢిల్లీలోముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కలు సంప్రదింపులు జరిపారు. ఇదే అంశంపై వేసిన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి పొన్నం ప్రభాకర్,సీతక్క ,శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నేతలు ఈరవత్రి అనిల్ , వినయ్ కుమార్‌లు ఢిల్లీలో సోమవారం భేటీ అయ్యారు. అంతకుముందు న్యూఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.సి.వేణుగోపాల్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రాజకీయ పరిణామాలు, తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం.

## రాష్ట్ర వాటా యూరియా కోసం ఎంతవరకైనా పోరాడుతాం

- యూరియా దిగుబడి చేసుకోవడంలో ఘోరంగా విఫలమైన కేంద్రం
- రైతులకు బహిరంగ లేఖ రాసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం / హైదరాబాద్

ఇతర దేశాల నుండి యూరియాను దిగుమతి చేసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కేంద్రం కేటాయింపులు, సరఫరాలు, స్వదేశీ యూరియా, దిగుమతి యూరియా వివరాలు, ప్రస్తుత పరిస్థితులపై తెలంగాణ రైతాంగానికి మంత్రి తుమ్మల బహిరంగ లేఖ రాశారు. లేఖలోని సారాంశం ఈ విధంగా ఉన్నాయి. రాష్ట్రానికి కేటాయింపుల ప్రకారం రావాల్సిన యూరియాను వెంటనే తెప్పించడానికి కేంద్రంతో ఎంత వరకైనా పోరాడుతామన్నారు.

ఇప్పటికే పాత నిల్వలతో కలుపుకొని 7.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందన్నారు. ఇటీవల యూరియా కొరతపై ప్రభుత్వాన్ని నిందిస్తూ తరువాయి 2లో




## యువతపట్ల సర్కార్‌కు చింతలేదు

- దొంగ ఓట్లతో అధికారంలోకి రావడమే వారి పని
- కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపాటు
- ఎస్‌ఎస్‌సి అభ్యర్థిపై లాఠీచార్జి అమానుషమని విమర్శ

**న్యూఢిల్లీ :** రాంలీలా మైదానంలో నిరసన తెలుపుతున్న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) అభ్యర్థులపై లాఠీచార్జ్ చేయడంపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. కేంద్ర ప్రభుత్వాన్ని తూర్పారబట్టింది. ఓట్లను దొంగిలించడం ద్వారా అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వానికి యువత భవిష్యత్తు గురించి ఆందోళన లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. పరీక్షను మెరుగ్గా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాంలీలా మైదానంలో ఎస్ఎస్‌సి విద్యార్థులు, శిక్షకులు నిరసన తెలిపారు. అయితే, ప్రదర్శనకారులపై లాఠీఛార్జ్ చేశారనే ప్రతిపక్ష పార్టీల వాదనలను పోలీసులు తోసిపుచ్చారు. ఈ అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దేశ యువత భవిష్యత్తును దొంగిలించడం మోదీ ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఎస్ఎస్‌సి పరీక్షల్లో రిగ్గింగ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై మోదీ ప్రభుత్వ కీలుబొమ్మ పోలీసులు జరిపిన క్రూరమైన లాఠీచార్జ్ తీవ్రంగా ఖండించదగినదన్నారు. గత 11 సంవత్సరాలుగా బిజెపి యువత నియామక పరీక్షల నుండి తరువాయి 12లో

## వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు

వర్ధన్నపేట జనహిత పాదయాత్రలో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



12

## అమిత్ షా వ్యాఖ్యలపై రిటైర్డ్ జడ్జీల ఆగ్రహం



సల్వా జుడుం తీర్పుపై కేంద్ర హోంమంత్రి అబద్ధాలు చెప్పడం దురదృష్టకరమని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** సల్వా జుడుం తీర్పుకు సంబంధించి ప్రతిపక్ష ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డిపై హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేయడం 'దురదృష్టకరం' అని పదవీ విరమ ణ చేసిన న్యాయమూర్తుల బృందం అభివర్ణించింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును ఒక ఉన్నత రాజకీయ అధికారి పక్షపాతపూరితంగా తప్పుగా అర్థం చేసుకోవడం న్యాయమూర్తులపై చిరాకు కలిగించే ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు కురియన్ జోసెఫ్, మదన్ బి.లోకూర్, జె.చలమేశ్వర్ వంటి 18 మంది రిటైర్డ్ న్యాయమూర్తుల బృందం పేర్కొం ది. న్యాయమూర్తుల ప్రకటనను ఉటంకిస్తూ, కాంగ్రెస్ హోంమంత్రిని విమర్శించింది. భారతదేశంలో ఇంకా ఆయనను విమర్శించే ధైర్యం ఉన్న వ్యక్తులు ఉన్నారని పేర్కొంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన సుదర్శన్‌రెడ్డి నక్సలిజానికి మద్దతు ఇస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. సల్వా జుడుం తీర్పు తరువాయి 12లో

## కొండాపూర్‌లో రేవ్ పార్టీ

- ఏడుగురు అరెస్ట్, డ్రగ్స్ స్వాధీనం
- నిందితులు రాజమండ్రి, బెంగళూరు వాసులు
- వివరాలు వెల్లడించిన మాదాపూర్ జోన్ డిసిపి వినీత్

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి




రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లోని రాజేశ్వరి సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రహస్యంగా రేవ్ పార్టీ నిర్వహిస్తున్నారన్న పక్క సమాచారంతో ఈగల్ తెలంగాణ, సైబర్ పోలీసులు, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇద్దరు డ్రగ్స్ ఫ్లడర్ల తో పాటు ఒక ట్రాన్స్‌ఫోర్టర్, నలుగురు మత్తు మందు తీసుకుంటున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు మాదాపూర్ జోన్ డిసిపి వినీత్ తెలిపారు. రేవ్ పార్టీకి గంజాయి, డ్రగ్స్‌ను గోవా, రాజమండ్రి, బెంగూళూరు నుండి తీసుకొచ్చి సరాఫరా చేస్తున్నారని నిందితులంగా డ్రగ్స్‌కు అలవాటు పడిన పాత వారేనని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో రాహుల్, నీలిమా,తేజ, విక్రమ్, చందన్, పురుషోత్తం రెడ్డి, భార్గవ్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి 20 గ్రాములు కోకైయిన్, 08 గ్రాముల ఎక్టాసిఫిల్స్, 3 గ్రాముల ఎంఎండిఎ మత్తు పదార్థలతో పాటు కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్ట్ తరువాయి 2లో

## అనుమతుల్లేని కేబుళ్లను తొలగించండి

ప్రభుత్వానికి హైకోర్టు మరోసారి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



విద్యుత్తు స్తంభాలకు అనుమతి లేకుండా ఉన్న కేబుళ్లను వెంటనే తొలగించాలని ప్రభుత్వానికి హైకోర్టు సోమవారం ఆదేశించింది. అనుమతులు ఉన్న వాటిని గుర్తించి, అవి ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటే చట్ట ప్రకారం నోటీసు లు జారీ చేసి చర్యలు తీసుకోవాలంది. వాటిపై చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. అంతేగాకుండా అనుమతులున్న కేబుల్ ఏజెన్సీలు అనధికారిక కేబుళ్లను తొలగించడానికి విద్యుత్తు సిబ్బందికి సహకరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమ కేబుళ్లను తొలగించడానికి, ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా ఉంటేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, టీజీఎస్పీడీసీఎల్ లకు గత విచారణలో ఆదేశించిన మేరకు సోమవారం అఫిడవిట్లను దాఖలు చేశాయి. విద్యుత్ తరువాయి 2లో

## గాజా ఆసుపత్రిపై ఇజ్రాయెల్ దాడి ఐదుగురు జర్నలిస్టులు మృతి

15 రోజులు గడవకముందే జర్నలిస్టులపై రెండోసారి హత్యాకాండ

**గాజా:** దక్షిణగాజాలోని గాజా నస్సెర్ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ సైనిక దళం (ఐడిఎఫ్) మరోసారి దాడులు చేసింది. దాడుల్లో అంతర్జాతీయ మీడియా తరపున పనిచేసే ఐదుగురు జర్నలిస్టులు మరణించారు. రాయిటర్స్,అసోసియేటెడ్ ప్రెస్, అల్‌జజీరా తరపున పనిచేస్తున్న జర్నలిస్టులు, కెమేరామన్‌లు ఈ దాడుల్లో మరణించారు. 15 రోజులు గడవకముందే జర్నలిస్టులపై ఐడిఎఫ్ మరోసారి హత్యాకాండకు పాల్పడింది. సోమవారం తెల్లవారుజామున రెండుసార్లు జరిపిన దాడుల్లో జర్నలిస్టులు, సహాయ సిబ్బంది సహా మొత్తం 20 మంది మరణించారు. సెంట్రల్ గాజాలో ఆహార పంపిణీ కేంద్రం వద్దకు వెళుతున్న మరో ఆరుగురు సహాయబృందం కూడా ఐడిఎఫ్




కాల్పులో మరణించినట్లు అల్ అవ్దా ఆసుపత్రివర్గాలు తెలిపాయి. కాంట్రాక్టు పద్ధతిలో తమకోసం పనిచేస్తున్న ఫొటో జర్నలిస్టు హస్సెమ్ అల్ మస్త్రీ హత్యకు గురైనట్లు రాయిటర్స్ ప్రకటించింది. రాయిటర్స్‌కు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## బంగ్లాదేశ్ షార్ట్ ఫిలింకు అంతర్జాతీయ గుర్తింపు




**ఢాకా:** బంగ్లాదేశ్ లో నిర్మించిన ''హ్యాపీ బర్త్ డే'' అనే బ్లాక్ కామెడీ షార్ట్ ఫిలిమ్‌కు అంతర్జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఇటీవలికాలంలో బంగ్లాదేశ్ చిత్రపరిశ్రమ క్రమంగా అంతర్జాతీయ వేదికలపై చోటు సంపాదించేందుకు కృషి చేస్తోంది. ఇందులోభాగంగా రుస్లాన్ తారెఖ్ నిర్మించిన 19 నిమిషాలు నిడివిగల షార్ట్‌ఫిలిమ్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సామాన్య ప్రజల సమస్యలు, ఆవేదనలను మేళవించి ఈ డార్క్ కామిడీ ఫిలిమ్ రూపొందించారు. కుటుంబానికే అంకితమైన ఒక సామాన్య మనిషి దీర్ఘకాలంగా అణగదొక్కి ఉంచుకున్న కోరికలను నెరవేర్చేకునేందుకు చేసిన ప్రయత్నమే హ్యాపీ బర్త్ డే షార్ట్ ఫిలిమ్. ఇప్పటికే దీనికి ఏథెన్స్‌లోని ఇంటర్నేషనల్ మంత్లీ ఆర్ట్ ఫిలిమ్ ఫెస్టివల్‌లో గుర్తింపు లభించగా, టర్కీలో జరిగే అనటోలియా ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివల్‌కు కూడా అధికారికంగా ఎంపికైంది.

# కోక్స్‌బజార్ రోహింగ్యాలను ఇక పోషించలేం

### చేతులెత్తేసిన బంగ్లానేత యూనుస్




**కాక్స్‌బజార్:** లక్షలాదిగా బంగ్లాదేశ్‌కు తరలివచ్చి శరణార్థులుగా తలదాచుకున్న రోహింగ్యాలు తలకుమించిన భారంగా మారారని, ఇక వారిని పోషించలేమని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనుస్ స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో మొత్తం 15 లక్షలమంది రోహింగ్యా శరణార్థులు కోక్స్‌బజార్‌లో తలదాచుకుంటున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద శరణార్థశిబిర కేంద్రంగా ఐక్యరాజ్య సమితి దీనిని గుర్తించింది.

ఈ సమస్య పరిష్కారానికి సహకారం అందించాలని ప్రపంచ దేశాలకు మహ్మద్ యూనుస్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద శరణార్థ శిబిరంగా పేరుగాంచిన ఆగ్నేయ బంగ్లాదేశ్ కోక్స్ బజార్‌లో నిర్వహించిన రెండు రోజుల సదస్సులో మహ్మద్ యూనుస్ ప్రసంగించారు. రోహింగ్యాల సమస్యపై సెప్టెంబరులో ఐక్యరాజ్యసమితి ఒక అంతర్జాతీయస్థాయి సదస్సు నిర్వహించబోతోంది. దీనికి ముందుగా మహ్మద్ యూనుస్ ఆది, సోమ వారాలలో ఈ సదస్సు నిర్వహించి ఈ శిబిరాన్ని పోషించడంలో ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను వివరించారు. 2017 నుండీ మయన్మార్‌లో జుంటా సైనికులు చేస్తున్న దారుణమైన హింస, వేలాదిమంది రోహింగ్యాల హత్యలు పేట్రేగడంతో అభద్రతాభావంతో లక్షలాదిమంది రోహింగ్యా ప్రజలు బంగ్లాదేశ్‌లోకి వలస వెళ్ళారు. వీరందరికీ అతిపెద్ద శరణార్థ కేంద్రాన్ని బంగ్లాదేశ్ ఏర్పాటు చేసింది. ఈ శరణార్థులను ఇక తాము పోషించలేమని, వారిని పోషించడానికి తగినన్ని నిధులు తమ దగ్గర లేవని, ప్రపంచదేశాలు ఈ సంక్షోభం నుండి తమను గట్టెక్కించాలని యూనుస్ విజ్ఞప్తి చేశారు. మయన్మార్‌లో సంక్షోభ పరిస్థితుల కారణంగా ఇప్పటికీ అనేకమంది రోహింగ్యాలు తమ దేశంలోకి చొరబడి వస్తూనే ఉన్నారని చెప్పారు. దాదాపు 24 కి.మీ ప్రాంతాన్ని రోహిం గ్యా శరణార్థులకోసం కేటాయించి వారికి శిబిరాలను బంగ్లాదేశ్ నిర్మించి ఆశ్రయం కల్పించిందని ఆయన చెప్పారు. ఈ కోక్స్ బజార్‌లో అనధికారికంగా 15 లక్షలమందికి పైగా తలదాచుకుంటున్నారు.

# గాజాలో 6.40 లక్షలమందికి ఆకలి ముప్పు



**న్యూయార్క్ :** వచ్చే నెలాఖరునాటికి గాజాలో ఆకలి విధ్వంసం మొదలవుతుందని తాజా నివేదిక వెల్లడించింది. గాజాలో కరువు ఏర్పడిందని ఐక్యరాజ్య సమితి మద్దతుగల ఒక ప్రపంచ సేవాసంస్థ మూడురోజుల క్రితం ప్రకటించింది. గాజాలో 98 శాతం పంట భూమి వ్యవసాయినికి పనికిరాకుండా పోయింది.సెప్టెంబరు చివరినాటికి 6.40 లక్షలమంది ప్రజలు (30 శాతం గాజా ప్రజలు) ఆహార అభద్రతతో అత్యంత వినాశకరమైన ఆకలిబాధల బారిన పడతారని హెచ్చరించింది. ప్రతి 10,000 మంది ప్రజలకు గాను ఇద్దరు పౌరులు ప్రతిరోజూ ఆకలితో మరణిస్తున్నారని తెలిపింది. దాదాపు ఐదు లక్షలమంది ప్రజలు అకలి అంచున బతుకుతున్నారని, సరైన ఆహారం లేక రెండు రోజులకు ఒకసారి ఒక పూట భోజనం చేస్తున్నారని పేర్కొంది. ఐతే ఈ ప్రకటనను ఇజ్రాయెల్ సునాయాసంగా తోసిపుచ్చింది. ఇవన్నీ కట్టుకథలని కొట్టిపారేసింది. అంతర్జాతీయ గణాంకాల ప్రకారం గాజాలో ఇప్పటికే 273 మంది ఆకలితో మరణించారు. వీరిలో 119 మంది పిల్లలు ఉన్నారు. మరో 2000 మంది ఆహార కేంద్రాలవద్ద ఆహారంకోసం ఎదురుచూస్తున్న సమయంలో ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల్లో మరణించారు. అదేవిధంగా ప్రతి నెలా సగటున 540 మంది పిల్లలు మరణిస్తున్నారని యూనిసెఫ్ అధికారికంగా ప్రకటించింది.

**గాజా శివార్లలో ఇళ్ళు ధ్వంసం :** గాజా సిటీ శివారు ప్రాంతాలలో ఇజ్రాయెల్ సైన్యంఇళ్ళు ధ్వంసం చేస్తోంది. మిలిటరీ ప్రాంతాన్ని గాజాలో విస్తరిస్తామని ప్రతిజ్ఞచేసిన ఇజ్రాయెల్ అందుకు అనుగుణంగా పలు నిర్మాణాలను కూల్చివేస్తోంది. జబాలియాలో అనేక భవంతులను ట్యాంకులు, బుల్‌డోజర్లు కూలదోస్తున్నాయి. జైటౌన్, షెజైల్‌లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, ఆహారాన్ని గగనతలమార్గంలో విడిచిపెట్టేందుకు ఇజ్రాయెల్ అనుమతించడంతో పలు దేశాలు ఎయిర్ డ్రాప్స్ చేస్తున్నాయి. ఐతే ఈ ఎయిర్ డ్రాప్స్ వల్ల చాలా ప్రమాదం ఉందని, ఐక్యరాజ్యసమితి సహాయ సంస్థల ద్వారా ఈ ఆహారం, ఇతర మానవతా సహాయాన్ని గాజాకు పంపాలని ఐక్య రాజ్యసమితి మొదటినుండీ చెబుతున్నది.

ఎయిర్ డ్రాప్స్ వల్ల శరణార్థులు తాత్కాలికంగా నిర్మించుకున్న శిబిరాలు ధ్వంసం అవుతున్నాయి. అందులో నివశిస్తున్నవారు ఎయిర్ డ్రాప్స్ సామాగ్రి వల్ల గాయాలపాలవుతున్నారు. దీంతో పాలస్తీనియన్లు ఎయిర్ డ్రాప్స్ ఆపాలని, రహదారిమార్గంలో సహాయం పంపాలని కోరుతున్నారు.

## జెనీవాలో నేడు ఇరాన్–ఇయు అణు చర్చలు



**జెనీవా:**ఇరాన్–యూరోపియన్ యూనియన్ దేశాలమధ్య మంగళవారం జెనీవాలో అణు చర్చలు జరుగుతాయి. 2015లో చేసుకున్న ఒప్పందంపై కొత్తగా మరోవిడత విదేశాంగశాఖ సహాయమంత్రులస్థాయిలో ఈ అణుచర్చలు జరుగుతాయని ఇరాన్ మీడియా సోమవారం ప్రకటించింది. జూన్ రెండోవారంలో ఇరాన్–అమెరికా మధ్య అణు చర్చలు ప్రారంభం కావాల్సి ఉండగా, ఇరాన్‌పై ఆకస్మికంగా ఇజ్రాయెల్ దాడిచేయడంతో 12 రోజులపాటు యుద్ధం కొనసాగింది. ఆ తర్వాత ఇరాన్ కీలక అణుస్థావరాలపై అమెరికా దాడులు చేసింది. తర్వాత జులై 25న ఒక విడత చర్చలు జరిగాయి. ఇప్పుడు రెండో విడత చర్చలు మంగళవారం జరుగుతాయి. తమదేశంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేసినాగానీ అంతర్జాతీయ అణు పర్యవేక్షణాసంస్థ ఐఎఇఎ ఈ దాడులను ఖండించలేకపోయిందని ఇరాన్ విమర్శించింది. ఇక తాము ఐఎఇఎకు సహకరించేదిలేదని కూడా స్పష్టం చేసిన తర్వాత ఎట్టకేలకు మళ్ళీ చర్చలు మొదలవుతున్నాయి.

## హిజ్బుల్లా ఆయుధాలు వదిలేస్తే లెబనాన్ నుండి వైదొలగుతాం : ఇజ్రాయెల్



**జెరూసలెం:**హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ గనుక ఆయుధాలు వదిలిపెడితే తమ సైనిక బలగాలు లెబనాన్ నుండి వైదొలగుతాయని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించారు. ఈ ఏడాది చివరినాటికి హిజ్బుల్లా ఉగ్రవాదులను నిరాయుధులను చేయాలని గట్టి నిర్ణయం తీసుకున్న లెబనాన్ మంత్రివర్గానికి నెతన్యాహూ అభినందనలు తెలియజేశారు. ఈ విధంగా హిజ్బుల్లా గనుక ఆయుధాలు వదిలేస్తే తమ సైన్యాలు దక్షిణ లెబనాన్ ప్రాంతాన్ని దశలవారీగా విడిచి వెళ్ళిపోతాయన్నారు. అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం జరగడంతో హిజ్బుల్లా–ఇజ్రాయెల్ మధ్య గడచిన నవంబరునెలలో యుద్ధం ముగిసింది. ఐతే లెబనాన్‌లోని ఐదు పర్వతాలను తమ నియంత్రణలో ఉంచుకున్న ఇజ్రాయెల్ తమ దేశం వదిలివెళితేగానీ తాము ఆయుధాలు వదిలిపెట్టేదిలేదని హిజ్బు ల్లా కూడా మొండిపట్టుదలతో ఉంది. వారు దేశం వదిలివెళితేగానీ తాము ఆయుధాలు విడిచిపెట్టే విషయం గురిం చి చర్చలు జరిపేదిలేదని హిజ్బుల్లా ఉగ్రవాద నాయకత్వం స్పష్టం చేసింది. హిజ్బుల్లాపై రోజువారీ దాడులను ఆపేయాలని కూడా ఆ సంస్థ డిమాండ్ చేసింది. గాజాలో హమాస్ ఉగ్రవాద సంస్థ ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబరు ఏడో తేదీన దాడులు ప్రారంభించినప్పుడే హిజ్బుల్లా కూడా ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించింది. ఈ యుద్ధం 14 నెలలపాటు కొనసాగింది. యుద్ధం విరమించిన తర్వాత కూడా హిజ్బుల్లా తిరిగి తిరుగుబాటు సైన్యా న్ని తయారు చేస్తోందని ఇజ్రాయెల్ విమర్శిస్తున్నది. ఈ యుద్ధంవల్ల ఉత్తర ఇజ్రాయెల్‌లో 60,000 మంది నిరాశ్రయులయ్యారు.

## వియత్నాంను గడగడలాడిస్తున్న కజికి తుఫాను



**హనోయ్:** శక్తిమంతమైన 'కజికి' తుఫాను వియత్నాం తీరప్రాంతాలను గడగడలాడించింది. గడచిన 30 సంవత్సరాలలో ఇంతపెద్ద తుఫాను వియత్నాంను తాకలేదు. తుఫాను కారణంగా 15 లక్షలమంది ప్రజలకు విద్యుత్ సదుపాయం స్తంభించిపోయింది. వియత్నాం ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా ఆదివారంనాడే పల్లపు ప్రాంతాల నుండి వేరేచోటకు తరలివెళ్ళిపోవాలని 5,86,000 మంది ప్రజలకు హెచ్చరించింది. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. గంటకు 133 కి.మీ వేగంతో గాలులతో కోస్తా ప్రాంతాలలో బీభత్సం సృష్టించింది. సోమవారం సాయంత్రానికి తుఫాను బీభత్సం కొనసాగుతుండగా, అనంతరం వరద ప్రమాదం కూడా ప్రజలకు పొంచి ఉంది. దీంతో వేలాదిమంది సైనికులను వియత్నాం ప్రభుత్వం సిద్ధంగా ఉంచింది. సహాయకార్యక్రమాల నిమిత్తం తర్వాత వీరిని రంగంలోకి దించుతారు. వివిధ క్రీడా స్టేడియంలు, ప్రభుత్వ భవనాలను నిరాశ్రయులకు కేటాయించి ప్రభుత్వ అధికారులు వారికి సదుపాయాలు సమకూరుస్తున్నారు. వియత్నాం ఉపప్రధాన మంత్రి టాన్ హోంగ్ హా సహాయ కేంద్రాలను సందర్శించి ప్రజలకు ధైర్యం చెప్పారు. గత ఏడాది సెప్టెంబరులో కూడా ఇదే స్థాయిలో ఒక తుఫాను వియత్నాం, లావోస్, థాయ్‌లాండ్, మయన్మార్‌లను గడగడలాడించింది. ఆనాడు 500 మంది మరణించారు.

## కొండాపూర్‌లో రేవ్ పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

అయిన వారందరు రాజమండ్రి, బెంగుళూరు, కొండాపూర్ ప్రాంతాలకు చెందిన వారని తెలిపారు. వీకెండ్ వచ్చిందంటే యువత రేవ్ పార్టీలని, డ్రగ్స్ పార్టీలకు బానిసలవుతున్నారని, డ్రగ్స్ నుండి యువత ఏంత దూరం ఉంటే అంత మంచిదని లేకుంటే వారి జీవితం వారే నాశనం చేసుకున్న వారౌతున్నారని నగర శివారులలో రేవ్ పార్టీలు నిత్యకృత్యమంగా మారి యువతను పెడదోవ పట్టిస్తున్నాయని ఎక్కడ రేవ్ పార్టీలు జరిగినా, డ్రగ్స్ అమ్మకం గురించి వివరాలు తెలిసినా పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని మాదాపూర్ జోన్ డిసిపి వినీత్ తెలిపారు.

## ఎంతవరకెనా పోరాడుతాం

(మొదటి పేజీ తరువాయి)

సాగుతున్న రైతుల ఆందోళనలు,చెప్పులు పెట్టీ క్యూ లైన్ లు ఉండటంపై ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శల్లో వాస్తవాలు ఏమిటి? యూరియా కొరతకు కారణాలు ఏమిటి? వాస్తవాలు దాచి పెట్టే పెద్దలు ఎవ్వరు? రైతుల ముసుగులో ప్రేరేపిత ఉద్యమాలు చేసే పార్టీలు ఏవీ?వ్యవసాయ శాఖ మంత్రిగా తెలంగాణ రైతన్నలకు వాస్తవాలు తెలియజేయాలని ఈ బహిరంగ లేఖ రాశానన్నారు.

**వాస్తవాలు ఇలా...** తెలంగాణ లో యూరియా కొరతకు రెండు ప్రధాన కారణాలు.మొదటిది మన రాష్ట్రానికి దిగుమతి ద్వారా కేటాయించిన యూరియా ప్రపంచ వ్యాప్తంగా జియో పాలిటిక్స్ నేపథ్యంలో సాగుతున్న రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధాల వల్ల రెడ్ సీ లో నౌకాయనం నిలిచిపోయి రాష్ట్రానికి రాలేదు. ఆగస్టు వరకు మన రాష్ట్రానికి దిగుమతి ద్వారా 3.94ఎల్ఎంటిల యూరియాను కేంద్రం కేటాయించింది. ఇందు లో సిఐఎల్, ఐపిఎల్, కెఆర్ఐబిహెచ్, ఎన్ఎఫ్ఎల్ కంపెనీల ద్వారా యూరియా 3.96 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, ఇప్పటివరకు 2.10 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా జరిగింది. రెండో ప్రధాన కారణం దేశీయంగా యూరియా ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గ స్థాయిలో జరగకపోవడం. 1,69,325 మెట్రిక్ టన్నులు కేటాయించగా 1,06,852 మాత్రమే సరఫరా చేశారు. యూరియా దిగుమతులు లేకపోవడం, దేశీయంగా డిమాండ్ కు తగ్గట్టుయూరియా ఉత్పత్తి జరగకపోవడం, ఈ రెండు కారణాల వలన యూరియా కొరత మన తెలంగాణ రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా ఉంది. మన రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ కు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపులు చేశారు. ఇందులో ఆగస్టు వరకు 8.30లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించి, ఇప్పటి వరకు 5.72 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారు.ఇంకా 2.58 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అవ్వలేదు. కేటాయించిన యూరియా మనకు అందకపోవడంతో డిమాండ్ కు తగ్గట్టు నిల్వలులేక రాష్ట్రంలోఇబ్బందులు తలెత్తాయి.యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం ఉంటే ఇక్కడ మాత్రం ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు బద్నాం చేసే రాజకీయాలు చేస్తున్నాయి. రాజకీయ స్వార్థంతో బిఆర్ఎస్ చేస్తున్న యూరియా కొరత వీధి నాటకాలు,వాస్తవాలు దాచి రైతులను ఇబ్బందులు పాలుజేసిన కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంపై వాస్తవాలు కుండబద్దలు కొట్టి రైతాంగంకు చెబుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం పై మీరు పెట్టుకున్న విశ్వాసం వమ్ము కాకుండా సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో భరోసాగా ఉంటామని, రాష్ట్రానికి కేటాయింపుల ప్రకారం రావాల్సిన యూరియాను వెంటనే తెప్పించడానికి ఎంతవరకైనా పోరాడుతామని... ఓ రైతుగా వ్యవసాయ శాఖమంత్రిగా స్పష్టం చేస్తున్నామని లేఖలో తుమ్మల పేర్కొన్నారు.

## పాకిస్థాన్‌లో ఐదుగురు భద్రతా సిబ్బంది మృతి

**పెషావర్:** పాకిస్థాన్ వాయువ్యప్రాంతం ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో ఉగ్రవాదులు జరిపిన రెండు వేరు వేరు దాడుల్లో ఐదుగురు భద్రతా సిబ్బంది మరణించారు. మరో 17 మంది గాయపడ్డారు. హంగుజిల్లాలోని తోరా వారై ప్రాంలో ఎఫ్‌సి ఫోర్టులోకి రాత్రివేళ ఉగ్రవాదులు దూసుకుపోయి కాల్పులు జరిపారు. అంతకుముందు తిరాహ్ లోయలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఇద్దరు భద్రతా సిబ్బంది మరణించారు. ఇదిలా ఉండగా, పోలీసులు, భద్రతా సిబ్బంది ఉమ్మడిగా అప్పర్ దిర్ జిల్లాలో నిర్వహించిన దాడుల్లో ఐదుగురు ఉగ్రవాదులు మరణించారు.

## కేబుళ్లను తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

స్తంభాలకు చాలా చాలా కేబుళ్లు ఉంటున్నాయని, వాటిలో ఏవి చట్ట ప్రకారం ఉన్నాయో ఏవి చట్ట వ్యతిరేకంగా ఏర్పాటు చేసినవో గుర్తించేందుకు కష్టం అవుతుందని తెలిపాయి. వీటిపై చర్యలు తీసుకోడానికి చాలా సమయం పడుతుందని చెప్పాయి. ఈ వివరాలను జస్టిస్ నగేశ్ భీమపాక రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. దీనిపై తగిన ప్రతిపాదనలతో రావాలని ఆదేశించారు. తదుపరి విచారణను వాయిదా వేశారు. హైదరాబాద్ సిటీలోని రామంతాపూర్‌లో విద్యుదాఘాతంతో ఆరుగురు మరణించిన ఘటన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కేబుళ్ల కట్ చేయడాన్ని సవాలు చేస్తూ భారతి ఎయిర్ టెల్ హైకోర్టును ఆశ్రయించింది. అన్ని అనుమతులు తీసుకున్నాకే కరెంటు స్తంభాల ద్వారా కేబుళ్లు తీసుకున్నామని తెలిపింది. ఎలాంటి నోటీసు జారీ చేయకుండా నగరమంతా కేబుళ్లను కట్ చేయడం చెల్లదని తెలిపింది. ఈ వ్యవహారంపై గత విచారణలోనే హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కరెంటు వైర్లు తగిలి ఆరుగురు మరణించారని, ఆ మృతులకు ఎవరు బ్యాధ్యత వహిస్తారని ప్రశ్నించింది. తండ్రి చనిపోతే పుట్టిరోజు నాడే తొమ్మిదేళ్ల బాలుడు పాడె మోయాల్సిన దుస్థితికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీసింది. పిటిషన్‌లో ప్రతివాదిగా ఉన్న. టీజీఎస్పీడీసీఎల్ స్పందిస్తూ, రాష్ట్రంలో సుమారు 20 లక్షలకు పైగా స్తంబాలు ఉంటే 1.73 లక్షల స్తంభాలకు మాత్రమే కేబుళ్లు లాగేందుకు అనుమతులున్నాయని తెలిపింది. అయితే ప్రతి స్తంభానికీ విచ్చలవిడిగా కేబుళ్లు ఉన్నాయని చెప్పింది. పరిమితికి మించి కేబుళ్లు ఉండటంతో స్తంభాలు భారం భరించలేక వైర్లు నేలకు తగిలే ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై హైకోర్టు, కేబుళ్ల బరువుకు స్తంబాలు వాలిపోతుంటే కింది సిబ్బంది జేబులు సొమ్ముతో నిండుతున్నాయని వ్యాఖ్య చేసింది. ఇలాంటి విషయాలపై కఠినంగాఉండాలని తేల్చి చెప్పింది. ఆరు కుటుంబాలకు చెందిన వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేసింది ఆ కుటుంబాల వేదనను అర్థం చేసుకోవాలంది.ఈ నిర్లక్ష్యానికి సమష్టి బాధ్యత తీసుకోవాల్సిందేనని పేర్కొంది. అనుమతులేని కేబుళ్లతో పాటు అనుమతులుండీ వేలాడుతూ మనిషికి తగిలేలా ఉన్న కేబుళ్లను తొలగించాల్సిందేనని ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది.

# జర్నలిస్టులు,ఆసుపత్రులపై దాడులు చేయొద్దు

### ఐక్యరాజ్యసమితి హెచ్చరిక

**న్యూయార్క్ :** దక్షిణ గాజాలో జర్నలిస్టుల మరణాలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. ఖాన్‌యూనిస్‌లోని నస్సెర్ ఆసుపత్రిలో దాడి వార్తలు కవర్ చేసేందుకు వెళ్ళిన జర్నలిస్టులు ఆసుపత్రిలో విధినిర్వహణలో ఉన్నసమయంలో రెండోసారి కూడా ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేయడంతో అంతర్జాతీయ మీడియా తరపున పనిచేస్తున్న ఐదుగురు జర్నలిస్టులు సహా మొత్తం 20 మంది మరణించిన ఘటనను ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. ''జర్నలిస్టులపై దాడి చేయకూడదు, ఆసుపత్రులపై అస్సలు దాడులు చేయకూడదు, ఈ దాడులు చూసి దిగ్భ్రాంతితో మౌనంగా ఉండిపోవడం కాదు, దీనిని జవాబుదారీ వహించాలని, న్యాయం చేయాలని డిమాండ్ చేయాలి'' అని ఐక్యరాజ్యసమితి హక్కుల కార్యాలయం అధికార ప్రతినిధి రవీనా షందాసనీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి సహాయసంస్థ ప్రధానాధిపతి ఫిలిప్పే లజ్జారినీ తీవ్రంగా స్పందిస్తూ, గాజాలో జరుగుతున్న మారణహోమంప ప్రపంచం మౌనం పాటించడమే దిగ్భ్రాంతి కలిగిస్తోందని అన్నారు. గాజాలో ఆకలి చావులకు, దారుణమైన మరణాలకు గురవుతున్న పిల్లలు, మహిళలకు సంబంధించిన వాస్తవాలను ప్రపంచానికి తెలియజేసే చిట్టచివరి జర్నలిస్టుల ప్రాణాలు కూడా తీసి అందరినోళ్ళూ మూయించాలని ఇజ్రాయెల్ ప్రయత్నం చేస్తోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ ఒక ప్రకటన చేస్తూ, నిత్యం గాజాలో జరుగుతున్న మారణహోంలో ప్రజలు సమిధలవుతున్నారని, ఈరోజు దాడిలో మరో 50 మంది కూడా తీవ్రంగా గాయపడ్డారని పేర్కొంది. గాజాలో వార్తలు ప్రపంచానికి తెలియడంలేదని, చాలా పరిమితంగా అక్కడి నుండి వార్తలు వస్తున్నాయని, ఇప్పుడు ఉన్న అవకాశాన్ని కూడా లేకుండా చేస్తున్నారని విమర్శించింది. ఐతే తాము ఆసుపత్రి సమీపంలో దాడి చేశామనీ, ఎందుకు ఆసుపత్రిపై దాడి జరిగిందనే విషయం తెలియదని, దీనిపై ప్రాథమిక దర్యాప్తుకు ఆదేశించామని ఇజ్రాయెల్ ప్రభుత్వం చెబుతున్నది.

బ్రిటన్,స్పెయిన్ సహా పలు యూరప్ దేశాలు గాజా ఆసుపత్రిపై దాడి, జర్నలిస్టుల మరణాలను తీవ్రంగా ఖండించాయి. అసలు ఆసుపత్రులపైన, జర్నలిస్టులపైన దాడులు చేయకూడదని పేర్కొన్నాయి. బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లమ్మీ ఒక ప్రకటన చేస్తూ, గాజాలో తక్షణం కాల్పుల విరమణ పాటించాలనీ, జర్నలిస్టులకు, ఆసుపత్రులకు పూర్తి రక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాన్‌యూనిస్‌లో ఆసుపత్రిపై ఇజ్రాయెల్ దాడిని స్పెయిన్ విదేశాంగమంత్రి జోస్ మేన్యుయల్ అల్బెరస్ తీవ్రంగా వ్యతిరేకించారు. గాజాలో తక్షణం కాల్పుల విరమణ సాధించాలన్నారు. ''ఈరోజున ఆసుపత్రిపై మరోసారి దాడులు చేశారు, జర్నలిస్టులను హత్యచేశారు, మరోవైపు గాజాలో ఆకలి చావులు సంభవిస్తున్నాయి, వారికి సరైన ఆహారం లేకుండా ఉద్దేశపూర్వకంగా మాడ్చి చంపుతున్నారు, కరువు పరిస్థితులు గాజాలో నెలకున్నాయి, పిల్లలు ఆకలితో మరణిస్తున్నారు, ఇవన్నీ అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనకిందకే వస్తాయి, అంతర్జాతీయ చ్టాలను ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోంది'' అని ఆల్బెరస్ ఎక్స్ వేదికగా విమర్శించారు.

ఖాన్‌యూనిస్‌లోని నస్సెర్ ఆసుపత్రిపై సోమవారం మొదటిసారి ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడిలో రాయిటర్స్ వార్తాసంస్థకు చెందిన కెమేరామెన్ హుస్సమ్ అల్–మస్రి మరణించారు. అసోసియేటెడ్ ప్రెస్ తరపున పనిచేస్తున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టు మరియం దగ్గా (33) మరణించారు. అల్ జజీరా, మిడిల్ ఈస్ట్ ఐ తరపున జర్నలిస్టుగా పనిచేస్తున్న మహ్మద్ సలమా , అల్ జజీరా ఫొటోగ్రాఫర్ మొయిజ్ అబూ తహా మరణించారు. మిడిల్ ఈస్ట్ ఐ తరపున పనిచేస్తున్న అహ్మద్ అబు అజిజ్ కూడా ఈ దాడిలో మరణించారు. ఇంతకుముందు 15 రోజుల క్రితం అల్‌సైఫా ఆసుపత్రి సమీపంలో జరిపిన దాడిలో ఆరుగురు జర్నలిస్టులను ఇజ్రాయెల్ సైన్యం హతమార్చింది.


## ఉస్మానియా యూనివర్సిటీ

(మొదటి పేజీ తరువాయి)

భవనాలను సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. వాటికి దుందుభి, భీమా వసతి భవనాలుగా నామకరణం చేశారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూములకు సిఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఒయు గొప్ప,గొప్ప నాయకులను,ఐపిఎస్‌లను,ఐఎఎస్‌లను, వైద్యులను, న్యాయవాదులను అందించిందన్నారు. తెలంగాణ సమాజానికి ఎటువంటి సమస్య వచ్చినా ఒయు వేదిక నుంచే నిరసనలు వ్యక్తమయ్యేవని, సమాజానికి అండగా నిలిచిందని, తెలంగాణ సమాజానికి సమస్య, సంక్షోభం వచ్చినప్పుడు మొదటి సారి ఉద్యమానికి పునాది పడేది ఒయు నుంచే అని అన్నారు. 1938లో సాయుధ రైతాంగ పోరాటానికి మద్దతుగా,తండాలలో మారుమూల పల్లెల్లో 'ఎర్ర జెండా' మోసిన ఎంతో మందికి ఒయు అండగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ముఖ్యభూమిక పోషించిందని సిఎం గుర్తు చేశారు. ఒయు చరిత్ర కాలగర్భంలో కలువొద్దని, ఒయును ఒక అద్భుతమైన యూనివర్సిటీగా మార్చాలని, ఒయు లేకపోతే తెలంగాణకు చరిత్రనే లేదన్నారు. తెలంగాణ చరిత్రను నిక్షిప్తం చేసే ఒయు, తెలంగాణ పదానికే ప్రత్యామ్నాయంలాంటిదని సిఎం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందుబాగాన నిలబడి తెలంగాణను సాధించిన యూనివర్సిటీని ఇలా గాలికి వదిలేయడం బాధ్యతనా ఒక సారి ఆలోచన చేయాలన్నారు.

**'ఒయు సభ'లో 'నిరసన స్వేచ్ఛ' ...**

మరోసారి ఒయులోని ఆర్ట్స్ కళాశాల వద్ద జరిగే సభ సందర్భంగా పోలీసులే ఉండొద్దని,విద్యార్థులకు నిరసన తెలియజేసే స్వేచ్ఛను కూడా ఇద్దామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఒక వేళ విద్యార్థులు తనను అడ్డుకుని ప్రశ్నిస్తే, చిత్తశుద్ధితో సమాధానం చెబుతానని, వారి అనుమానాలను నివృత్తి చేస్తానని అన్నారు. విద్యార్థులు తమ కోసం పనిచేయని వారిని వ్యతిరేకించాలని, ఒయులో పరిస్థితులను చూసి, సమస్యలను పరిష్కరించాలనే వారిని అడ్డుకుంటే అభివృద్ధిని అడ్డుకుంటున్నామా? లేదా అనేది కూడా విద్యార్థులు ఆలోచించుకోవాలని సూచించారు. 2011లో గ్రూప్ 1 పరీక్షను నిర్వహిస్తే, 2025 వరకు గ్రూప్ 1 పరీక్షలు జరగలేదని, అలాంటిది తాము గ్రూప్ 1 పరీక్ష నిర్వహిస్తే ఫలితాలు ప్రకటించకుండా తనను అడ్డుకుంటున్నారని, దీనిపైన విద్యార్థులు కూడా ఆలోచించాలన్నారు. ఆరోజు అధికారంలో ఉన్నాయన గొర్రెలు, చేపలు పెంచుకోవాలని చెబితే, అందుకు భిన్నంగా తాను ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు కావాలని చెబుతున్నానని సిఎం అన్నారు. గతంలో కళకళలాడిన ఒయు ప్రస్తుతం కళా విహీనంగా మారిందన్నారు. విద్యార్థులకు తాము నాణ్యమైన విద్యను మాత్రమే ఇవ్వగలమని,తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని, చదువు ఒక్కటే అన్నింటికీ పరిష్కారమని, చదవు వల్లనే గౌరవం దక్కుతుందని సిఎం సూచించారు.




**మళ్లీ వారు అధికారంలోకి వస్తే.. ఒయు భూములను అమ్ముకుంటారు...**


మళ్లీ వారు (బిఆర్ఎస్) అధికారంలోకి వస్తే ఉస్మానియా వర్సిటీని బతకనివ్వరని, ఒయులోని భూములను లే అవుట్లు చేసి ప్లాట్లు చేసి అమ్ముకుంటారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. పేదలు ఎవ్వరూ చదువుకోవద్దనేదే వారి కుట్ర అని అన్నారు. ఇలాంటి వారు తెలంగాణ రాష్ట్రానికి పట్టిన చెదలు లాంటివారని, ముసుగు వేసుకున్న చెదలులాంటి వారు తెలంగాణ సమాజం బాగు కోరుకోబోదన్నారు. ఒయులో కనీసం నాన్ టీచింగ్ నియామకాలను కూడా చేపట్టక క్యాన్సర్ తరహా ఒయును నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఒయును కాలగర్భంలో కలుపాలనే కుట్ర జరుగుతున్న సందర్భంలో మళ్లీ ఒయును పునర్ నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు.

**వారి ఉచ్చులో పడొద్దు..** కొంతమంది రాజకీయ పార్టీలకు అధికారం పోయిన తర్వాత కడుపుమంట, బాధ ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొడుకులను ఏమేమో చేద్దామంటే, వారు ఏటూ కాకుండా పోతున్నారని తండ్రికి ఆవేదన ఉంటుందని, ఆ ఆవేదనతో ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందన్నారు. అలాంటి వారి ఉచ్చులో విద్యార్థులు పడొద్దని సూచించారు. దొరల చేతిలో ఉండాల్సిన పెత్తనం పేదవారి చేతికి పోతే ఎలా అనే ఆవేదన కొందరిలో ఉంటుందన్నారు. హెచ్‌సియులో ఏనుగులను, సింహాలను రాష్ట్ర ప్రభుత్వం చంపుతున్నట్టు ప్రచారం చేశారని, తెలంగాణ రాష్ట్రంలో ఏనుగులు, సింహాలు లేవని, మానవరూపంలో ఫామ్‌హౌస్‌లలో మానవ మృగాలు ఉన్నాయని సిఎం ఎద్దేవా చేశారు. కోదండరాంను ఎంఎల్‌సిగా ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లి రద్దు చేయించారని సిఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. మళ్లీ 15 రోజుల్లో ఆయనను ఎంఎల్‌సిగా పంపిస్తామన్నారు. సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ ఎంతో మందిని ఉస్మానియా విశ్వవిద్యాలయం మేథావులుగా తీర్చిదిద్దిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్, ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణ, కాలేజి కమిషనరేట్ కమిషనర్ దేవసేనా,హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎస్కీ డైరక్టర్ రామేశ్వర్‌రావుకు 'కాఫీ టేబుల్ బుక్'



ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యార్థులను వ్యవస్థాపక నిర్వాహకులుగా, మార్కెటింగ్ లీడర్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే 'స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్' విద్యా సంస్థను ఏర్పాటు చేశామని ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఐఎఎస్ డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, మాజీ ఐపిఎస్ లక్ష్మీనారాయణ, ప్రముఖ నటులు మురళీ మోహన్ చేతుల మీదుగా 'కాఫీ టేబుల్ బుక్'ను రామేశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా రామేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మార్కెటింగ్, ఫైనాన్స్, పవర్, ఐటి, టెలి కమ్యూనికేషన్స్ తదితర రంగాల్లో విద్యార్థులను ఒక లీడర్‌గా, ఒక వ్యవస్థాపక నిర్వాహకులుగా, ఒక మార్గదర్శులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతోనే కోర్సులను ప్రారంభించామన్నారు.

# సమసమాజ స్థాపనకు విద్య ఒక్కటే మార్గం

### విద్య ద్వారానే ప్రపంచంతో పోటీ పడగలం : భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్: సామాజిక మార్పు, వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు, సమ సమాజ స్థాపనకు విద్య ఒక్కటే మార్గమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రాలు దాటి ప్రపంచంతో పోటీ పడాలంటే కేవలం విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఒక ప్రైవేట్ సంస్థ విద్యారంగంపై రూపొందించిన 'కాఫీ టేబుల్‌ను సోమవారం డిప్యూటీ సిఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దశాబ్ద కాలంగా నిర్లక్ష్యానికి గురైన విద్య, వైద్యంపై దృష్టి సారించామన్నారు. రాబోయే 50, వంద సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు ప్రైవేటు సంస్థలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది, ప్రైవేటు విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మాజీ ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకుని నేటి వరకు అనేకమంది ప్రధానులు, ముఖ్యమంత్రులు తీసుకువచ్చిన విద్యాసంస్థల వల్లనే భారతదేశం వేగంగా అభివృద్ధి సాధించిందన్నారు. ఐఐఐటి, ఆర్ఇసి, యుజి సి ఆధ్వర్యంలో పలు యూనివర్సిటీల ఏర్పాటు ద్వారానే తెలుగు వాళ్ళు ప్రముఖ కంపెనీలకు సిఈఓల స్థాయికి ఎదిగారని వివరించారు. వ్యక్తులు స్థాపించిన విద్యాసంస్థలు యూనివర్సిటీల స్థాయికి ఎదిగి అడ్వాన్సుడ్ టెక్నాలజీని బోధించే స్థాయికి చేరాయన్నారు. మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా సిలబస్ మారితేనే ప్రయోజనమని, ప్రభుత్వం భావించి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందన్నారు. పరిశ్రమలకు పనికొచ్చే విధంగా సిలబస్ రూపొందించామని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాల కింద ఏర్పాటు చేసిన 100 ఐటిఐలను అడ్వానస్డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని, వివిధ పరిశ్రమల అధిపతులు సూచించిన సిలబస్‌ను వాటిలో ప్రవేశపెట్టామని తెలిపారు.

## క్రీడల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం

### ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆరోగ్యవంతమైన సమాజం క్రీడల ద్వారానే సాధ్యమవుతుందని, అని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు.జాతీయ క్రీడా దినోత్సవాల సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎల్‌బిస్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయేష్ రంజన్ మాట్లాడుతూ.. ఆరోగ్యం క్రీడాకారుల విజయానికి మూలం కాబట్టి కోచ్‌లు క్రీడాకారులకు క్రమబద్ధంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిది రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా విద్యాసంస్థలు, జిల్లా కేంద్రాలలో క్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఏ.సోనీ బాలాదేవి మాట్లాడుతూ... యశోద హాస్పిటల్, ఎం.ఎన్.జే క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో ఈ క్యాంప్ నిర్వహించామని పేర్కొన్నారు. మెగా హెల్త్ క్యాంప్‌లో 24 రకాల ఆరోగ్య పరీక్షలతో నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో మొత్తం 780 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్పోర్ట్స్ అథారిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవితేజ సమన్వయం చేశారు. డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, సుజాత, అనిత, ఇంజనీర్ అశోక్ కుమార్, పి.ఆర్.ఓ కాలేరు సురేష్, యశోద హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జీవన్, ఎం.ఎన్.జే క్యాన్సర్ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో మెజారిటీ సీట్లే లక్ష్యం

### పెండింగ్ ప్రాజెక్టులపై 1న కలెక్టర్లకు వినతి
### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, చాడ వెంకటరెడ్డి




ప్రజాపక్షం/కరీంనగర్ : రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐకి బలం ఉన్న అన్నీ స్థానాల్లో అభ్యర్థులు పోటీ చేస్తారని, మెజారిటీ సీట్లలో గెలుపే లక్ష్యంగా సిపిఐ పని చేస్తుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని సిపిఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో తీసుకున్న నిర్ణయాలు, రాబోయే ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాల్ని, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం, పార్టీ వందేళ్ల ఉత్సవాలు, జాతీయ మహాసభలు, రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై పార్టీ వైఖరి తదితర అంశాలను మీడియాకు వివరాంచారు. రాబోయే మున్సిపల్, జడ్పిటీసీ, ఎంపిటిసి, సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు జరిగే ఎన్నికల్లో పార్టీ బలం ఉన్న ప్రతి చోట తమ అభ్యర్థులు పోటీలో ఉంటారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నప్పటికీ స్థానిక సంస్థల్లో ఆ పార్టీ వైఖరిని బట్టి పొత్తు ఆధారపడి ఉంటుందన్నారు. పొత్తుల పేరుతో కాలయాపన చేసేది లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 26 నాడు పార్టీ వందేళ్ల ఉత్సవాల ముగింపు వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో జరుగుతాయని తెలిపారు. ఈ వేడుకలకు జాతీయ, అంతరాతీయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. అందులో అంతర్జాతీయ పరిస్థితులు, కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న ఆటుపోట్లకు సంబంధించిన చర్చలు జరుగతాయన్నారు. వందేళ్ల ఉత్సవాలు రాష్ట్రంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో వందలాది మందితో భారీ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పార్టీ జాతీయ మహాసభలు సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు పంజాబ్ రాజధాని చండీగడ్‌లో జరుగనున్నాయని తెలిపారు.

**పెండింగ్ ప్రాజెక్టులపై...**

రాష్ట్రంలోని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర మహాసభల్లో తీర్మాణం చేసినట్లు వెంకటరెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లాలో ఎస్ఆర్ఎస్పీ వరద కాలువ 1994లో శంకుస్థాపన చేసినా పాలకుల నిర్లక్ష్యంతో మొదలు కాలేదని, 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మొదలు పెట్టినప్పటికి పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపు చేయక, గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా ప్రాజెక్టు పూర్తి కాలేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తామని చెబుతున్నప్పటికి నిధులు లేవంటుందని, ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడం మూలంగా నిర్మాణ వ్యయం పెరుగుతందన్నారు. మొదలు పెట్టినప్పుడు నిర్మాణ వ్యయం రూ.959 కోట్లు కాగా ప్రాజెక్టు ప్రస్తుత వ్యయం 15 నుంచి 20 వేల కోట్ల అంచనాలకు పెరిగిందన్నారు. ప్రభుత్వం వరద కాలువపై దృష్టి పెట్టి త్వరగా పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు తెలంగాణ సాయుద పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతులు యూరియా కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులకు కావల్సిన యూరియాను అందించాల్సి ఉందని, కేంద్రంతో సంప్రదింపులు జరిపి సమస్యను తొందరగా పరిష్కరించాలని కోరారు. కేంద్రంపై ఒత్తిడి పెంచాలని అవసరమైతే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి,పిట్టల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులుపైడిపల్లి రాజు, బండ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించండి

### గౌతమి, సుల్తాన్ ఉల్ ఉలూమ్ కళాశాలలకు హెచ్‌ఆర్‌సి సమన్లు




సుల్తాన్ -ఉల్- ఉలూమ్ ఫార్మసీ కాలేజీ

ప్రజాపక్షం/హైదరాబాద్: ఫీజు కట్టలేదని విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడాన్ని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సి) తప్పుపట్టింది. నమోదైన ఇలాంటి రెండు కేసులలో విద్యార్థులకు అనుకూలంగా హెచ్‌ఆర్‌సి తీర్పు చెప్పింది. తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సి) చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన, విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను అన్యాయంగా నిలుపుదల చేసిన రెండు కేసులలో కీలక ఆదేశాలు జారీ చేసింది.

**గౌతమీ డిగ్రీ కళాశాల..**

బాలనగర్‌లోని గౌతమీ డిగ్రీ కళాశాల యాజమాన్యం ఒక బిబిఎ పట్టభద్రుడి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టిసి)ను ప్రభుత్వ స్కాలర్‌షిప్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందనే సాకుతో నిలిపివేశారు. బాధిత విద్యార్థి ఫిర్యాదు మేరకు గౌతమి డిగ్రీ కాలేజీ యాజమాన్యానికి హెచ్‌ఆర్‌సి పైవిధంగా తీర్పు చెబుతూ.. కళాశాల యజమాన్యానికి సమన్లు జారీ చేసింది. ఇలాంటి చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం విద్యా హక్కును ఉల్లంఘించడం అవుతుందని కమిషన్ పేర్కొంది. కాలేజీ చైర్మన్, ప్రిన్సిపాల్‌ను తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మసీ కాలేజీ ఆగస్టు 21న జారీ చేసిన ఆదేశాలను అమలు చేయలేదని 17 మంది విద్యార్థులలో 10 మంది సోమవారం కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత కాలేజీని విద్యార్థుల సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వమని కమిషన్ ఇప్పటికే ఆదేశించింది.ఈ నిర్లక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుని కమిషన్, కాలేజీ చైర్మన్ మరియు ప్రిన్సిపాల్ లను ఈ నెల 28న ఉదయం 11:00 గంటలకు కమిషన్ ముందు హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. విద్యార్థుల సర్టిఫికెట్లను అన్యాయంగా నిలిపివేయడం, వారికి విద్య మరియు ఉపాధి అవకాశాలను నిరాకరించడం అవుతుందని, ఇది మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని కమిషన్ మరోసారి స్పష్టం చేసింది. గత ఆదేశాలను గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి కేసులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# ఇద్దరు వ్యక్తుల దారుణహత్య



ప్రజాపక్షం/మాక్లూర్ : నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ధర్మోరా(ఎ) గ్రామంలో ఇద్దరు వ్యక్తులు దారుణహత్యకు గురయ్యారు. ఈ సంఘటన ఆదివారం అర్ధ రాత్రి జరిగింది. గ్రామస్తుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. జీలకర్ర ప్రసాద్‌కు కొన్ని ఏళ్లుగా ధర్మోరాకు చెందిన స్వప్న అనే మహిళతో వివాహేతర సంబంధాలున్నాయి. ప్రసాద్ ధర్మోరా గ్రామానికి చెంది న పలువురికి తరచూగా వివాదాలు పెట్టుకునేవారని గ్రామస్తుల సమాచారం. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన జీలకర్ర ప్రసాద్ పలు చోరీ కేసులలో నిందితుడు, అతని స్నేహితుడు ఆకాష్ ఆదివారం రాత్రి ధర్మోరాలో ప్రసాద్‌కు పరిచయమున్న మహిళ ఇంటికి వెళ్లారు. అయితే వీరిద్దరికి జీలకర్ర ప్రసాద్ అనే వ్యక్తితో ఆదివారం ఉదయం గ్రామంలో గొడవ జరిగింది. గొడవను మనసులో ఉంచుకుని తిరిగి గంధం గంగారాం, సాయిలు, ఇంటిపైకి జీలకర్ర ప్రసాద్ తన స్నేహితుడితో కలిసి రాత్రి దాడికి వచ్చినట్లు సాయిలు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో సాయిలు కుటుంబ సభ్యులు ఆత్మరక్షణలో భాగంగా ప్రతి దాడి చేసి కంట్లో కారం కొట్టి, దీంతో రాడ్లు కట్టెలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో జీలకర్ర ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హత్యకు గల కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. ఘటన స్థలాన్ని నార్త్ రూరల్ సిఐ శ్రీనివాస్‌తో పాటు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్‌లు పరిశీలించారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమా లేక మరేదైనా అనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీలకర్ర ప్రసాద్‌పై చోరీ కేసులతో పాటు ఇతర కేసులున్నాయి. గతంలో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపగా ఎస్కార్ట్ కళ్లు గప్పి పరారీ అయ్యాడు. ఈ కారణంగా ఇద్దరు పోలీసులు కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. నగరంలో మోస్ట్ వాంటెడ్ దొంగగా ప్రసిద్ధి చెందిన జీలకర్ర ప్రసాద్ హత్యకు గురి కావడం కలకలం రేపుతోంది.

# టూరిజం హబ్‌గా అనంతగిరి

### మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్: అనంతగిరి హిల్స్‌లో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. టూరిజం ప్రమోషన్ లో భాగంగా సోమవారం అనంతగిరి హిల్స్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అనంతగిరి హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్నందున చాలా మంది పర్యాటకులు ఇక్కడికి ట్రెక్కింగ్, దైవదర్శనంతో పాటు ప్రకృతిని ఆస్వాదించడానికి వస్తుంటారని, అందకు తగ్గట్లుగా మౌలిక వసతులను కల్పించి, దీన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అనంతగిరిలో ఉన్న హరిత హోటల్ నిర్వహణను పైలట్ ప్రాజెక్ట్‌గా వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తున్నామని, తద్వారా ప్రైవేట్ హోటల్స్‌కు ధీటుగా దీన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకొని, హరిత హోటల్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

**డిస్టిలరీని తనిఖీ చేసిన మంత్రి జూపల్లి**

మద్యం తయారు చేసే స్పిరిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిస్టిలరీస్‌ని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తనిఖీ చేశారు. హోల్డింగ్ ట్యాంక్స్, బ్లెండింగ్ యూనిట్, బాటిల్ ఫిల్లింగ్, సిసి కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం, ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టంను క్షుణ్ణంగా పరిశీలించారు. మద్యం తయారీ, ఉత్పత్తి, సరఫరా, లేబ్లింగ్, మద్యం తయారీకి చెందిన ముడి సరుకు, ఇతర సాంకేతికపరమైన తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.మద్యం తయారీ, విక్రయాల్లో ప్రభుత్వ నియమావళిని కచ్చితంగా పాటించాలని, పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కంపెనీ యాజమాన్యానికి ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా మద్యం తయారీ చేస్తున్నారా లేదా అనే విషయాలు ఆరా తీసేందుకే కంపెనీలో ఆకస్మిక తనిఖీలు చేశామని రికార్డులు కూడా పరిశీలించామని అన్నారు. డిస్టిలరీలు, బేవరేజ్‌లో లిక్కర్ తయారీకి ముడి సరుకు దగ్గర నుంచి బాటిల్ బయట వచ్చే వరకు ఆబ్కారీ శాఖ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది? మద్యాన్ని భర్తీ చేసే క్రమంలో లేబ్లింగ్ ఎలా చేస్తున్నారు? ముడి సరుకు, ఉత్పత్తి అవుతున్న మద్యం, అక్కడ నుంచి డిపోలకు సరఫరా అవుతున్న లిక్కర్ రికార్డులను పరిశీలించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వండి : కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసి ప్రజలు తమ తీర్పు ఇవ్వాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు విజ్ఞప్తి చేశారు. బిజెపి నాయకులు అలూరి విజయభారతి తదితరులు కెటిఆర్ సమక్షంలో తెలంగాణ భవన్‌లో సోమవారం బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, కేంద్రంలో అధికార బిజెపి తెలంగాణకు ద్రోహం చేయడంలో కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన భవనాలకు సిఎం రేవంత్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించేందుకు తాపత్రయ పడుతున్నారని ఆరోపించారు. గోదావరి నీళ్లను దిగువకు పంపి, ఎపి సిఎం చంద్రబాబు కడుతున్న బనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు తరలించేందుకు సిఎం రేవంత్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి ద్రోహం చేయడంలో బిజెపి, కాంగ్రెస్ ఒకటేనని కెటిఆర్ అన్నారు.

# బిఆర్‌ఎస్ దమ్ముకు దుమ్ము పట్టిందా?




ప్రజాపక్షం/హైదరాబాద్: పార్టీ మారిన పది మంది ఎంఎల్ఎలు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లే దమ్ము ఉందా అని అంటున్నారని, పదేళ్లలో 60 మంది ఎంఎల్‌ఎలు పార్టీ మారినప్పుడు బిఆర్‌ఎస్ దమ్ముకు దుమ్ము పట్టిందా? అని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఎక్కువ ఎంఎల్‌ఎ స్థానాలను గెలిచామని చెబుతున్న బిఆర్‌ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా దక్కలేదని, కంటోన్మెంట్ ఎన్నికలో మూడో స్థానం నిలిచిందని గుర్తుంచుకోవాలన్నారు. ఓబిసి లకు రిజర్వేషన్ కావాలనే ప్రయత్నాలు చేస్తున్నామని, స్థానిక సంస్థల ఎన్నికలు ఖచ్చితంగా ఎన్నికలు పెడతామని, 42 శాతం బిసి రిజర్వేషన్ ఇస్తామని ఆయన అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్ పట్ల బిజెపి, బిఆర్‌ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే బిసిలకు 42 శాతం పార్టీ పరంగా ఇస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ ప్రభుత్వం ఏం చేసిందో తెలుస్తుందన్నారు. రేవంత్‌రెడ్డికి బిజెపి ఎంపిలు మద్దతు ఇస్తే తెలంగాణ నంబర్‌వన్ అయ్యేదని, మెట్రో ఫేజ్ 2 వచ్చేదన్నారు. ఎపి సిఎం చంద్రబాబుకు ఇచ్చే ప్రాధాన్యతను బిజెపి ఎంపిలకు కేంద్రం ఇవ్వడంలేదని, తెలంగాణకు రావాల్సిన వాటాను గుజరాత్, ఎపికి కేంద్రం పంపుతుందని విమర్శించారు. హరీష్‌రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు డెంగ్యూ మరణాల సంఖ్య ఉందని, కేవలం సిఎం రేవంత్ రెడ్డి హయంలో మాత్రమే డెంగ్యూ వస్తుందని, గతంలో ఎప్పుడూ లేదన్నట్లు మాట్లాడడం విడ్డూరమన్నారు. హైదరాబాద్‌ను కెసిఆర్ కనిపెట్టినట్లు కెటిఆర్ మాట్లాడుతున్నారని, కెటిఆర్‌కు తెలియక మాట్లాడుతున్నారా అర్థం కావడంలేదన్నారు. హైదరాబాద్‌ను కెసిఆర్ కుటుంబం వాడుకుని ఆర్థికంగా ఎదిగారన్నారు.

**CHANGE OF NAME**

నేను, సాదినేని నాగసైదేశ్వరరావు (పాత పేరు), చిరునామా: 2-91-2, రెడ్లకుంట గ్రామం, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ, పిన్‌కోడ్: 508206. నేను నా పేరును సాదినేని అప్పారావు, తండ్రి నర్సయ్య (కొత్త పేరు) అని మార్చుకుంటున్నాను.

## మరో నాలుగు రోజులు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, హన్మకొండ, జగిత్యాల, జనగాం, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, మహబూబ్ నగర్, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజ్గిరి, ములుగు, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ తదితర జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. బుధవారం ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

# 15 వరకు ప్రభుత్వ' బిసి ఉద్యోగుల' లెక్కలు ఇవ్వండి

### బిసి కమిషన్




ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ శాఖలలో పని చేస్తున్న ప్రభుత్వ సిబ్బంది సమాచారాన్ని సెప్టెంబర్ 15వ తేదీ వరకు తమకు సమర్పించాలని బిసి కమిషన్ సూచించింది. వివిధ శాఖలు, డిపార్ట్‌మెంట్ల కార్యదర్శులతో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ హైదరాబాద్‌లోని హరిత ప్లాజా,మంజీర హాల్‌లో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిసి కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాలమాయ దేవి పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఈ సమావేశంలో బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తో పాటు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్త, రవాణ, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దేవాదాయ, వాణిజ్య శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ప్రణాళిక,సామాజిక సంక్షేమ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ తదితరులు హాజరయ్యారు. అయితే ఈ సమావేశంలో కొన్ని శాఖలు గైర్హాజరవ్వడం పట్ల బిసి కమిషన్ తప్పు పట్టింది. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని బిసి కులాలకు సంబంధించిన అంశాలపైన బిసి కమిషన్ విచారించి, కమిషన్ అభిప్రాయాన్ని నివేదించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని వివరించారు. ఇందులో భాగంగానే విచారణ నిమ్మితం రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలలో బిసి కులాల వారీగా ఎంతమంది ఉన్నారో తమకు సమాచారం తెలపాలని సూచించారు. ఈ విషయమై తాము అన్ని శాఖల కార్యదర్శులకు ఆరు నెలల క్రితమే ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినా ఇప్పటి వరకు సమాచారం రాలేదని నిరంజన్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రతి సంవత్సరం 31 మార్చి నాటికి ఆయా శాఖల వారిగా బిసి కమిషన్‌కు సమాచారాన్ని తెలియజేయాలని ఆయన వివిధ శాఖల కార్యదర్శులను కోరారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్: జిహెచ్ఎంసి
మెయిల్: sew.ghmc@gmail.com సెల్: 7331186858

NIT No. 22/SE/SLPZ/GHMC/2025-26 'ఇ'ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 25.08.2025

**పని పేరు:** (02 ఐటెమ్‌లు) జిహెచ్ఎంసి, ఎస్ఎల్‌పిజెడ్ సర్కిల్-22లో మీట్ మార్కెట్ నిర్మాణం & బహుళ ప్రయోజనకరమైన ఫంక్షన్ హాల్ నిర్మాణం, **అంచనా విలువ / ఇసివి:** రూ.400.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 26.08.2025న మ.1.00గం.ల నుండి 02.09.2025న మ.1.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి, సెల్: 7331186858.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 7081-PP/CL/ADVT/1/2025-26, Date: 25-08-2025

**పురపాలక సంఘ కార్యాలయము, వికారాబాద్**
వికారాబాద్ జిల్లా.

బహిరంగ వేలము ప్రకటన తేది: 25.08.2025

వికారాబాద్ పురపాలక సంఘమునకు సంబందించిన శానిటేషన్ మరియు ఇంజనీరింగ్ విభాగములకు సంబంధించిన పనికిరాని పాత ఎలక్ట్రిక్ ఆటోలు, అల్మారాలు, పైపులు, డంపర్ బిన్స్, హెచ్.ఎం.టి. ట్రాక్టర్, వాటర్ సప్లయి మరియు ఎలక్ట్రికల్ సామానులు (మెటీరియల్స్) బహిరంగ వేలము ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

తేది: 29-08-2025 నాడు ఉదయము 11:00గంటలకు బహిరంగ వేలము వేయబడును. కావున ఇట్టి బహిరంగ వేలములో పాల్గొనువారు తేది: 28-08-2025 రోజున సాయంత్రం 5:00 గంటలలోపు దరఖాస్తు చేసుకొనవలెను.

ఇట్టి బహిరంగ వేలములో పాల్గొనదలచిన వారు దరఖాస్తుతో పాటు నాన్ రిఫండబుల్ బయానా రూ.20,000/-లను మున్సిపల్ కమీషనరు, పురపాలక సంఘం, వికారాబాద్ వారి పేరున తీసిన డి.డి. జతపరచవలెను.

సం/- మున్సిపల్ కమీషనరు, పురపాలక సంఘం వికారాబాద్.

DIPR R.O. No. : 7109-PP/CL/ADVT/1/2025-26, Date: 25-08-2025



# జనరల్
STATE & REGIONAL NEWS



ప్రతిపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి జెస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని కలిసిన తెలంగాణ రాష్ట్ర మంత్రులు దుద్దుళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క తదితరులు

## రూ. 63 లక్షల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్ట్.. రెండు కార్లు స్వాధీనం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్ర ఒరిస్సా బార్డర్ నుంచి రెండు కార్లలో 122.85 కేజీల గంజాయిని తరలిస్తుండగా సంగారెడ్డి డిటిఎఫ్ టీం పట్టుకున్నారు. ఏవోబీ నుంచి గంజాయి మహారాష్ట్రకు వెళుతుందని సమాచారంతో సంగారెడ్డి కంది మండలం చేర్యాల గేటు వద్ద కాపు కాసి మహారాష్ట్రకు చెందిన వాహనాలను నిలిపి తనిఖీలు నిర్వహించారు. కార్లలో పైన చూస్తే.. ఏ రకమైనటువంటి గంజాయి కనిపించదు. కానీ కారు డిక్కీలోనూ కారు బాడీ కింద ప్రత్యేకమైనటువంటి అరలు చేయించి గంజాయిని సరఫరా చేస్తున్న విషయాన్ని డిటిఎఫ్ సిఐ దుబ్బాక శంకర్, నజీర్ పాషా సిబ్బంది కలిసి చేదించారు. ఒక కారులో 69.5 కేజీలు, మరో కారులో 53.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అబ్దుల్ వహాబ్ సయ్యద్ మహారాష్ట్రకు చెందిన వ్యక్తి తో పాటు ఉమాకాంత్ సబర్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. చాంద్ మహమ్మద్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ మెదక్ డిప్యూటీ కమిషనర్ జి. హరి కిషన్ తెలిపారు. డిటిఎఫ్ టీం సభ్యులతో పాటు సంగారెడ్డి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ కొనసాగింది. పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్నటువంటి సంగారెడ్డి డిటిఎఫ్ టీంను ఎక్సైజ్ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అభినందించారు.

## హోంగార్డులకు ఎంఎస్ఎం పథకాలు..

అందజేసిన అడిషనల్ డిజిపి మతి స్వాతి లక్రా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు చెందిన ఇద్దరు హోంగార్డ్ ల కు ప్రతిష్టాత్మక మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ (ఎంఎస్ఎం) ను ప్రదానం చేసింది. రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి ఆర్ బివిఆర్ఆర్) తెలంగాణ పోలీసు అకాడమీలో హోంగార్డ్ విధులు నిర్వహిస్తున్న జె న్నార రాజు ,తెలంగాణ రాష్ట్ర (గ్రేహౌండ్స్) లో హోంగార్డ్ పనిచేస్తున్న పి.సాగర్ సంగంలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎంఎస్ఎం పథకాలను ప్రకటించింది.ఆర్గనైజేషన్ మరియు హోంగార్డ్స్ అడిషనల్ డిజిపి మతి స్వాతి లక్రా డిజిపి కార్యాలయంలో సోమవారం నాడు వీరికి ప్రశంసా పత్రాలను అందజేశారు . ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఉద్దేశించి అడిషనల్ డిజిపి మాట్లాడుతూ.... ఈ అవార్డులు వారి అంకితభావం, క్రమశిక్షణ విశిష్ట సేవలకు లభించిన గుర్తింపుగా కొనియాడారు. అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. ఈ ప్రతిష్టాత్మకమైన సేవా పతకాలు వారిలో మరింత ఉత్సాహాన్ని పెంచుతాయని మరియు వారు మరింత సమర్థవంతంగా పని చేసేందుకు దోహద పడతాయని పేర్కొన్నారు. ఇతర పోలీసు సిబ్బంది వారి విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ పోలీసు వ్యవస్థ కు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఇలాంటి వారికి పోలీసు శాఖ తరఫున ఉన్నతాధికారుల సహాయ సహకారాలు ఉంటాయని, భవిష్యత్తులో పోలీసు సిబ్బంది మరిన్ని అవార్డులు సాధించాలని ఆశిస్తున్నానన్నారు.

## జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో.. పెరిగిన పోలింగ్ స్టేషన్లు..

నేడు అభ్యంతరాల స్వీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ సూచన మేరకు పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌పై అభ్యంతరాలు ఈ నెల 26వ తేదీ లోగా సమర్పించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రక్రియలో భాగంగా పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్ పై జిల్లా ఎన్నికల అధికారి ప్రత్యేక సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ... ఇప్పటివరకు ఉన్న 329పోలింగ్ స్టేషన్ల స్థానంలో 408 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించామని తెలిపారు. గతంలో 132 లొకేషన్లలో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం 139 లొకేషన్లలో ప్రతిపాదించామని వివరించారు. అదనంగా 79 కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ రేషనలైజేషన్ నివేదికను ఈ నెల 28వ తేదీ లోగా ఎన్నికల కమిషన్‌కు పంపించాల్సి ఉన్నందున, అభ్యంతరాలను 26వ తేదీ లోగా తప్పనిసరిగా సమర్పించాలని కమిషనర్ సూచించారు.

## 'ఎంప్లాయిూ ఆఫ్ ది మంత్'లో 11మందికి భద్రత అవార్డులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు కార్యకలాపాల భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జూలై నెలకు సంబంధించి 'ఎంప్లాయీస్ ఆఫ్ ది మంత్' కింద 11 మంది రైల్వే సిబ్బందికి ఆయన భద్రత అవార్డులను అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది తమ విధి నిర్వహణలో చురుకుదనం, అంకితభావాన్ని ప్రదర్శించినందుకుగాను ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్ అవార్డులు ఇవ్వడం జరుగుతున్నాయన్నారు.ఈ అవార్డు గ్రహీతలలో లోకో పైలట్లు, పాయింట్స్ ఉమెన్, గేట్‌మ్యాన్, ట్రైన్ మేనేజర్ వంటి వివిధ వర్గాలకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ అవార్డు గ్రహీతలను అభినందించారు. తమ విధులను అత్యంత అంకితభావంతో నిర్వర్తించడంలో విధి పట్ల వారికి ఉన్న అంకితభావానికి అభినందించారు. ఈ అవార్డులు ఇతర ఉద్యోగులను మరింత అప్రమత్తంగా ఉండటానికి మరియు రైలు కార్యకలాపాలలో సురక్షితంగా ఉండేలా నిజాయితీగా పని చేయడానికి ప్రేరేపిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో జోన్ వ్యాప్తంగా లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద అనుసరిస్తున్న భద్రతా జాగ్రత్తలను సంజయ్ కుమార్ సమీక్షించారు. ప్రమాదానికి గురి అవడానికి అవకాశం ఉన్న గుర్తించబడిన లెవెల్ క్రాసింగ్ గేట్లపై ఆయన ప్రత్యేక దృష్టి సారించాలని మరియు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, సిబ్బందికి సలహా ఇవ్వాలను ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు మరియు, నాందేడ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఏంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# 'నిషేధిత భూముల లిస్ట్ వెల్లడించండి

సబ్ రిజిస్ట్రార్లకు అందజేయాలని హైకోర్టు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్లకు నిషేధిత భూముల జాబితాలను అందజేయాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. రిజిస్ట్రేషన్ యాక్ట్ సెక్షన్ 22ఎ మేరకు నిషేధిత భూముల జాబితాను తొమ్మిది వారాల్లోగా సబ్‌రిజిస్ట్రార్లకు అందజేయాలంది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు నోటీసులు ఇవ్వాలంది. లేనిపక్షంలో తదుపరి విచారణకు సీఎస్ కోర్టుకు హాజరై స్వయంగా వివరణ ఇవ్వాలంది. విచారణను సెప్టెంబరు 3కి వాయిదా వేసింది. రిజిస్ట్రేషన్‌లకు వెళ్లితే నిషేధిత జాబితాలో ఉన్నాయని చెప్పి తిరస్కరిస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ సోమవారం విచారించారు. ఇదే తరహా పిటిషన్లు 5 వేలకుపైగా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల క్రితం ఫుల్‌బెంచ్ తీర్పు మేరకు నిషేధిత లిస్ట్ సబ్ రిజిస్ట్రార్లకు ఇవ్వాల్సివుందని, ఇప్పటి వరకు ఇవ్వలేదని తప్పుపట్టారు. తీర్పు తరువాత ఇలాంటి వివాదాలపై పరిశీలన నిర్ణయం కోసం ముగ్గురు అధికారులతో కమిటీ వేస్తూ జీవో 98 జారీ చేసినట్లు ప్రభుత్వ ప్లీడర్ చెప్పారు. నిషేధిత భూముల వివాదాలపై అందిన ఫిర్యాదులపై కమిటీ తీసుకునే ఉత్తర్వులకు ఫిర్యాదుదారు, ప్రభుత్వం కట్టుబడి ఉండాల్సిందేనని చెప్పారు. అభ్యంతరాలుంటే సివిల్ కోర్టులో తేల్చుకోవాలన్నారు. పిటిషనర్ ప్లీడర్ వాదిస్తూ, ప్రభుత్వం లిస్ట్ ఇవ్వకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆస్తుల కొనుగోలుకు అగ్రిమెంట్లు, చెల్లింపులు చేశాక రిజిస్ట్రేషన్లకు వెళ్లినప్పుడు తిరస్కరణ జరగడం జరుగుతోందన్నారు. విచారణ వచ్చే నెల 3కి వాయిదా పడింది.

### పాస్‌పుస్తకాలు ఎలా ఇచ్చారు?

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నెం.194, 195లో భూములు నిషేధిత జాబితాలో ఉండగా ప్రైవేట్ వ్యక్తులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఎలా ఇచ్చారని అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. ఆ సర్వే నెంబర్లలోని 50 ఎకరాల భూదాన్ భూములను అబ్దుల్ జావీద్, అర్షియా సుల్తానా, అబ్దుల్ లతీఫ్ ఇతరులని పేర్కొంటూ పాస్‌బుక్‌లను నాటి తహసిల్దార్ సుబ్రమణ్యం జారీ చేశారంటూ మల్లేష్ అనే వ్యక్తి పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారించి ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణను వాయిదా వేశారు. సర్వే నెం.194లో భూములను పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లు కొనుగోలు చేయడంతో ఈ వివాదం హైకోర్టుకు చేరింది.

## నెంబర్ కేటాయించండి


**ప్రజాపక్షం/హైదరాబాద్:** ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించాలన్న గత ఉత్తర్వులను ప్రభు త్వం అమలు చేయడం లేదంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను నెంబర్ కేటాయించాలని రిజిస్ట్రీకి డివిజన్‌బెంచ్ ఆదేశించింది. గతంలో హైకో ర్టు, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రి జర్వేషన్లు కల్పించాలని తీర్పు చెప్పింది. ఈ తీ ర్పును ప్రభుత్వం అమలు చేయలేదని హైదరాబా దీ వెజయంతీ వసంత మొగిలి కోర్టుధిక్కరణ పిటిషన్ వేస్తే దీనికి నెంబర్ కేటాయింపునకు రిజిస్ట్రీ నిరాకరించింది. ఈ వ్యవహారంపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ విచారించి నెంబర్ కేటాయించాలని ఆదేశించింది.

## ఎంబిబిఎస్‌లో క్రీడల కోటా అమలు ఉందా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెడికల్ అడ్మిషన్‌ల లో క్రీడల రిజర్వేషన్ కోటా అమలు చేస్తున్నదీ లేనిదీ చెప్పాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. క్రీడల కోటా కింద 0.5 శాతం రిజర్వేషన్ అమ లు చేయడం లేదంటూ అర్జున్ వేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ విచారించింది. జీవో 114 అమల్లో ఉందో లేదో తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను సెప్టెంబరు 4వ తేదీకి వాయిదా వేసింది.

# ఎక్సైజ్ కేసుతో పలు రాష్ట్రాల్లోని ముఠాల గుట్టు రట్టు

కేసు ఛేదించిన ఎక్సైజ్ సిబ్బందికి రూ.50వేల నగదు రికార్డు,ప్రశంస పత్రాలు.



**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఎక్సైజ్ శాఖ పాల్వంచలో పట్టుకున్న గంజాయి, తుపాకులను పట్టుకున్న కేసు మంచి పేరుతెచ్చి పెట్టిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అన్నారు. ఈ కేసును చేధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సిబ్బందికి రూ.50 వేల క్యాష్ రివార్డుతోపాటు డైరెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను డైరెక్టర్ చేతుల మీదుగా సోమవారం ఎక్సైజ్ భవన్‌లోని డైరెక్టర్ చాంబర్‌లో అందించి అభినందించారు.కేసును ఎలా పట్టుకున్నారు? ఎలా వెపన్స్‌ను స్వాధీనం చేసుకున్నారని అనే విషయాన్ని అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ డైరెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషన్, జాయింట్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి, రివార్డు గ్రహితలు పాల్గొన్నారు. పాల్వంచలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ రమేష్ టీమ్ కలిసి పాల్వంచలో పట్టుకున్న 106 కేజీల గంజాయి, ఒక పిస్తోల్, 5 రివాల్వర్లు, 40 బుల్లెట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇలా నిత్యం ఖమ్మం పరివాహక ప్రాంతంలో జరిగే ప్రక్రియ. అయితే.. తెలంగాణ ఏర్పడిన నుంచి గంజాయితో పాటు వెపన్లు పట్టుబడడం కొత్త ఒరవడి ఐయితే.. ఈ కేసు విచారణలో బహిర్గితమైన సమాచారం చూస్తే అందరికి ఒళ్లు జలదారించే స్థాయికి చేరుకుంది. దావూద్ ఇబ్రహం ముఠాలకు వ్యతిరేకంగా ముంబాయిలో రవి పూజారి గ్యాంగ్‌ల మధ్య నిత్యం వైరం కొనసాగుతుంది. రవి పూజారి ప్రస్తుతం ఎన్ఐఏ బెంగూళూర్‌లో జైల్లో వేశారు. రవి పూజారి గ్యాంగ్‌కు చెందిన బిలాల్, నౌమాన్, దాబాయ్‌లో ఉంటున్న నిస్సాన్‌లు ఉన్నారు. వీరంతా వెపన్లు సమకూర్చుకునే పనిలో ఉన్నారు. వెపన్లు, గంజాయి కోసం తమిళనాడు నుంచి బిలాల్, శ్యాంసుందర్ లు కలిసి ఒక కారులోను, గంజాయి, వెపన్లు తరలించడానికి ఒక హైచర్ వాహనాన్ని తీసుకొని ఆగస్టు 16న చెన్నై నుంచి బయలుదేరారు. గంజాయిని తీసుక వెళ్లడానికి తీసుక వచ్చిన వాహనాన్ని ఒరిస్సాలోని నవరంగ్‌పూర్‌లో వదిలి వేసి కారులో ఇండోర్‌కు వెళ్లి దుబాయి నుంచి నిస్సాన్ పంపించిన డబ్బులతో 5 రివాల్వర్, ఒక పిస్తోల్‌ను కొనుగోలు చేసుకొని తిరుగు ప్రయాణంలో గంజాయిని కొనుగోలు చేసిన నవరంగపూర్‌కు కారులో వచ్చారు. కారులోని వెపన్లు, కొనుగోలు చేసి, గంజాయిని హైచర్ వాహనంలో నింపి కారులో బిలాల్, శ్యాంసుందార్‌లు వస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్ టీం చెన్నైయికి చెందిన కారు కావడంతో వాహనాన్ని నిలిపి తనిఖీలు చేశారు. కారులో ఏమి లభించక పోవడంతో ఇద్దరిని ఇంటరాగేషన్ చేయడంతో అసలు విషయం వెల్లడించారు. ఐదు గంటల పాటు సమాచారం కోసం ప్రయత్నాలు చేస్తే తప్పా .. దావూద్ ఇబ్రహంకు ప్రత్యర్థి గ్యాంగ్ అని సమాచారం వెలుగులోకి రాలేదు.

### ఆయుధాలు లభించడంతో పోలీసుల రంగ ప్రవేశం..

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు గంజాయి, వెపన్లు లభించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. మూడు జిల్లాలో పోలీసులతో పాటు నేర పరిశోధాన పోలీస్ బృందాలు నిందితులను విచారించారు. ఈ విచారణలో ఇదే గ్యాంగ్ ఇప్పటికే రెండు మార్లు వెపన్లను, గంజాయి తరలించారని, మూడోసారి పట్టుబ డడం జరిగిందని విచారణలో వెల్లడయ్యింది.ఇలాంటి కేసును చేధించిన ఎక్సైజ్ టీమ్‌లో అసిస్టెంట్ కమిషనర్ జి .గణేష్. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్, ఎస్సై శ్రీహరిరావు, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.ఏ ఖరీమ్, జి .బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, హరీష్, వెంకటేశ్వర్లు, వీరబాబు, విజయ్ కుమార్, ఉపేందర్, హన్మంతరావులు ఉన్నారు. వీరందరు క్యాష్ రివార్డులతో పాటు ప్రశంస పత్రాలను డైరెక్టర్ షాన్వాస్ కాసిం చేతుల మీదుగా అందు కున్నారు.

## వేధింపులకు గురి చేస్తున్న తహసీల్దార్....

**ప్రజాపక్షం/పెద్దేముల్ :** తమకు న్యాయం చేయాలంటూ తహసిల్దార్ కార్యాలయం వద్దకు వెళ్ళి దళితులను పోలీసులతో బయటకు నెట్టివేసిన వైనం సోమవారం మండల కేంద్రమైన పెద్దేముల్ లో చోటు చేసుకుంది. పెద్దేముల్ మండల పరిధి తింసాన్ పల్లి గ్రామానికి చెందిన దళిత నిరుపేదలకు ప్రభుత్వ భూమి సర్వేనంబర్69లో ఇళ్ళ నిర్మాణం కోసం భూమిని కేటాయించింది. అట్టి భూమి సమీపంలోని వ్యక్తులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుంటున్నారని, అట్టి భూమిని వెంటనే సర్వే చేసి తమకు న్యాయం చేయాలంటూ గత మూడు మాసాలుగా తహసిల్దార్ కార్యాలయం చుంటు తిరిగుతున్నా తహసిల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సర్వే చేయమని పలు మార్లు అడిగిన తమను వేధిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయమై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశాము, కలెక్టర్ ఆదేశాల మేరకు తహసిల్దార్ గ్రామ పంచాయతి కార్యదర్శితో విచారణ చేయించడం ఎంత వరకు సమంజసమని వారు వాపోయారు. భూమి అక్రమ విషయమై రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాల్సి ఉండగా పంచాయతి కార్యదర్శితో విచారణ కోరడం ఎమటిని వారు ఆరోపించారు.ఇట్టి విషయమై ప్రశ్నించడానికి తహసిల్దార్ కార్యాలయంకు పోతే కార్యాలయం నుండి బయకు నెట్టివేయడం ఎమిటని బాధితులు బాలప్ప, గుడిసె శాంతప్ప, ఖాదర్‌లు ప్రశ్నిస్తున్నారు. తమ విధులకు ఆటంకం కల్గించడం ద్వారానే వారిని పోలీసులతో బయటకు పంపినట్లు తహసిల్దార్ వివరించారు.

ఎటిసి కేంద్రం ఏర్పాటుతో విద్యార్థులకు

## ఉజ్వల భవిష్యత్తు

తాండూరు ఎంఇఒ వెంకటయ్యగౌడ్

**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరులో నూతన ఏర్పాటవుతున్న ఎటిసి కేంద్రం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని తాండూరు ఎంఇఒ వెంకటయ్యగౌడ్ అన్నారు. సోమవారం తాండూరుహైదరాబాద్ రోడ్డు మార్గంలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎటిసి కేంద్రాన్ని ఎంఈఒ వెంకయ్యగౌడ్‌తో పాటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ప్రైవేటు విద్య సంస్థల ఉపాధ్యాయులతో కలసి సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఐటిఐలను, ఎటిసికేంద్రాలుగా మార్చి ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నూతన కోర్సులను రూపొందించడం సంతోషదాయకమన్నారు. తాండూరు నియోజకవర్గంలో ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి కృషితో ఎటిసి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని, ఇందులో ఆరు కోర్సులకు గాను 172 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి కల్గిన విద్యార్థులు 28లోపు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని, ఇది విద్యార్థులకు సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఇంకెంతకాలం అన్యాయం

బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత తెండి

ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్షలో పలువురు నేతలు



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధత చేయకుండా ఇంకెంతకాలం అన్యాయం చేస్తారని పలువురు బిసి నేతలు ప్రశ్నించారు. బిసిల జనాభా ప్రకారమే వాటా అడుగుతున్నారని, అది వారి హక్కు అని, భిక్ష కాదన్నారు. 76 ఏండ్లుగా సిఎం, మంత్రి పదవులు అగ్రవర్ణాలే అనుభవిస్తున్నారని, 60శాతం ఉన్న బిసిలకు సర్పంచ్ పదవులు కూడా ఇవ్వరా? అంటూ నిలదీశారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జాతీయ బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షతన సంఘం జాతీయ అధ్యక్షులు , ఎంపి ఆర్.కృష్ణయ్యతో సహ పలువురు బిసి నేతలు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల రాజేందర్, మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌తోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది బిసి నేతలు తరలివచ్చి, సంఘీభావం ప్రకటించారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు అంటూ హామీలిచ్చి, ఇప్పుడు పార్టీపరంగా ఇస్తామని అంటున్నారని, ఇది బిసిలను మోసం చేయడమేనన్నారు. దీనివల్ల అగ్రకులాలు ఇండిపెండెంట్‌గా నిలిచి, డబ్బులు పోసి గెలుస్తారని, అదే రిజర్వేషన్లు కేటాయిస్తే ఏ పార్టీలోనైనా బిసినే విజయం సాధిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో మరో బిల్లు పెట్టి జిఒ తీసి బిసిలకు రిజర్వేషన్లు తేవాలని డిమాండ్ చేశారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ఉమ్మడి ఎపి కాంగ్రెస్ పాలనలో ఒక్క బిసి కూడా సిఎం కాలేదన్నారు. బిఆర్ఎస్ కుటుంబ పార్టీ అని, ఆ పార్టీలో బిసిలకు ప్రాతినిధ్యం కల్పించని విమర్శించారు. వకుళాభరణం మాట్లాడుతూ ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్ష మరో స్వాతంత్ర్య పోరాటంగా సిఎం గమనించి, రిజర్వేషన్ల చట్టబద్ధతకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బిసి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, నేతలు, జిల్లపల్లి అంజి, అనంతయ్య, మోదీ రాందేవ్ పలు బిసి సంఘాల నేతలు పాల్గొన్నారు.

## క్రిప్టో కరెన్సీ రికవర్ చేసిన టిజిసిఎస్‌బి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో అరుదైన విజయం సాధించింది. ఒక విదేశీ పౌరుడి వాలెట్ నుండి అంతర్జాతీయ క్రిప్టో ఎక్స్ఛేంజ్ ద్వా రా భారతీయ బాధితుడికి నిధులు తిరిగి రావడం చాలా అరుదైన విషయం. ఈ కేసులో నిందితుడి వాలెట్ నుండి రూ.2.38 కోట్ల విలువైన క్రిప్టో ఆ స్తులను రికవర్ చేసింది. కేసు వివరాలను టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ సోమవారం మీడియాకు వెల్లడించారు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఒక సాఫ్ట్వేర్ కంపెనీలో అసోసియేట్ మేనేజర్ గా పనిచేస్తున్నాడు. జూన్ 12న అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతను రెండు సంవత్సరాల క్రితం భారత మేట్రిమోనిలో ఖాతా సృష్టించుకున్నాడు. జనవరి 18న నందితా రెడ్డి అనే పేరుతో ఒక ప్రొఫైల్ రిక్వెస్ట్ వచ్చింది. వాట్సాప్ నంబర్ ద్వారా పరిచయం పెంచుకుంది. తరువాత ఆమె తనను క్రిప్టో కరెన్సీ నిపుణురాలిగా చెప్పి, అతన్ని పెట్టుబడులు పెట్టమని ప్రేరేపించింది.ఇందులో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పింది. మొదట చిన్న మొత్తాలు విత్డ్రా చేసుకునేలా చేసి నమ్మకం కలిగించింది. తర్వాత పెద్ద మొత్తాలను పె ట్టమని ఒత్తిడి చేసింది. ఏప్రిల్ 2025లో అతను రూ.40,30,000 పెట్టుబడి పెట్టాడు. మొత్తం సుమారు 2 కోట్లు లాభం చూపించినా, విత్ డ్రా చేయడానికి 5% ట్యాక్స్, 10% కరెన్సీ ఎక్స్ఛేంజ్ ఫీ, ప్రీడిపాజిట్ ఫండ ఛానెల్ ఫీ, ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఫీ వంటి పేర్లతో మోసం చేశారు. చివరికి అకౌంట్ మనీ లాండరింగ్ కారణంగా బ్లాక్ అయ్యిందని చెప్పి రూ. 6 లక్షలు కూడా వసూలు చేశారు. అతను మొత్తం రూ. రూ. 87,58,356 నష్టపోయాడు.

### విచారణలో పురోగతి


టిజిసిఎస్‌బి క్రిప్టో సైబర్ ఇన్వెస్టిగేటర్ సహాయంతో నిధుల మళ్లింపులను విశ్లేషించింది. దానిలో ఈ మొత్తాన్ని చైనా దేశస్థుడైన జియాంగ్ చువాన్హువాన్ అనే వ్యక్తి వాలెట్ కి ట్రాన్స్ఫర్ చేసినట్టు బయటపడింది. వెంటనే ఆ ఎక్స్ఛేంజ్ కి నోటీసు ఇచ్చి వాలెట్ను ఫ్రీజ్ చేయించారు. తరువాత కోర్టు ఆదేశం తీసుకొని మొత్తం డబ్బును రికవరీ చేశారు. కోర్టు అనుమతి తర్వాత ఈ క్రిప్టో బాధితుడి వాలెటికి ట్రాన్స్ఫర్ చేస్తామని శిఖాగోయల్ వెల్లడించారు.

# భారత్–ఫిజి మధ్య ఏడు ఒప్పందాలు

**న్యూఢిల్లీ:** భారత్–ఫిజీ దేశాల ప్రధానమంత్రులు సోమవారం ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఫిజి ప్రధానమంత్రి సిటివెని లిగమమడ రెబుక మూడు రోజులు భారత్ పర్యటన సందర్భంగా ఆదివారం న్యూఢిల్లీకి చేరుకున్నారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సోమవారం సంభాషణలు జరిపారు. ఏడు ఒప్పందాలపై ఇద్దరూ సంతకాలు చేశారు. ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించుకోవాలని నిర్ణయించారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడిని రెండు దేశాల నాయకులు ఖండించారు. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని ఉద్ఘాటించారు. శాంతి,స్థిరత్వం, ప్రగతి, ద్వైపాక్షిక రక్షణ సహకారాలపై వారిద్దరూ ఉమ్మడి ప్రకటన చేశారు. ఐక్యరాజ్యసమితిలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన తక్షణ అవసరాన్ని ఉద్ఘాటించారు. సమకాలీన భౌగోళిక, రాజకీయ వాస్తవితకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యత్వాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని సంయుక్త ప్రకటనలో మోదీ–రెబక పేర్కొన్నారు. భద్రతా మండలిలో భారతదేశ శాశ్వత సభ్యత్వానికి ఫిజీ నేత పూర్తి మద్దతు ప్రకటించారు. సమకాలీన ప్రపంచ సవాళ్లను పరిష్కరించేందుకు అవసరమైన సమర్థవంతమైన చర్యలు తీసుకోవడానికి పేద దేశాలమధ్య సహకారం పటిష్టవంతం కావాలని కూడా సంయుక్త ప్రకటనలో నాయకులు ఉద్ఘాటించారు. దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రం ఓషియానాలో భాగమైన మెలనేసియా ప్రాంత ద్వీప దేశంగా ఉన్న ఫిజీ, భారత్‌లు వేరు వేరు సముద్ర ప్రాంతాలలో ఉన్నప్పటికీ కూడా రెండు దేశాల ఆశయాలు, వైఖరులు ఒకటేననీ, రెండుదేశాలూ ఆలోచనలపరంగా ఒకేపడవలో ప్రయాణిస్తున్న సహచరులనీ సమావేశానంతరం నరేంద్రమోదీ చెప్పారు. ఉగ్రవాదం ప్రపంచమానవాళికి అతిపెద్ద సవాలుగా మారిందని రెండు దేశాలూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయన్నారు. సముద్రతల భద్రత, వాణిజ్యం, ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాలలో సంబంధాలను రాబోయేకాలంలో పటిష్టం చేసుకోవాలని రెబుక–నరేంద్రమోదీ చర్చల్లో నిర్ణయించారు. గడచిన కొద్ది సంవత్సరాలుగా రెండు దేశాలూ రక్షణ, భద్రతా విభాగాలలో సహకారాన్ని పటిష్టం చేసుకుని విస్తృతం చేసుకోవాలని ఆశిస్తున్నాయి. ఫసిఫిక్ ప్రాంతంలో తన పట్టు బిగించి అన్ని దేశాలతో సంబంధాలు పెంచుకోవాలని చైనా అవిశ్రాంతంగా కృషి చేస్తున్న తరుణంలో భారత్–ఫిజీ దేశాలమధ్య ఈ ఒప్పందాలు జరిగాయి. 'మా రెండు దేశాలూ రక్షణ,భద్రతా రంగాలలో సహకారాన్ని పటిష్టం చేసుకోవాలని నిర్ణయించాయి, ఇందుకు సంబంధించి ఒక కార్యాచరణ ప్రణాళికను కూడా సిద్ధం చేశం, భారతదేశం ఈ విషయంలో శిక్షణ, సంబంధిత పరికరాలను సమకూరుస్తుంది, ఫిజీ ద్వీపదేశ సముద్రతల భద్రతను పటిష్టం చేసేందుకు ఈ శిక్షణ, పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయి'' అని నరేంద్రమోదీ తన పత్రికా ప్రకటనలో తెలియజేశారు. భద్రత, డేటా సంరక్షణలో కూడా రెండు దేశాలూ తమ అనుభవాలను పంచుకుని మరింత మెరుగైన విధానాలు అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. మన రెండు దేశాల సంబంధాలు పరస్పర విశ్వాసంపైనే ఆధారపడి ఉన్నాయని చర్చల సందర్భంగా ఫిజీ ప్రధానమంత్రికి నరేంద్ర మోదీ తెలియజేశారు. స్వేచ్ఛాయుతమైన, సమ్మిళిత, భద్రతతో కూడిన ప్రగతిశీల ఇండో–పసిఫిక్‌కు రెండు దేశాలు మద్దతు ఇస్తున్నాయన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల దార్శనిక దృక్పథాన్ని మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అదేవిధంగా ఫిజీ ప్రధానమంత్రి రెబుక ఒక ప్రకటన చేస్తూ, రెండు దేశాలు శాంతి, స్థిరత్వం,అభివృద్ధిలను ప్రోత్సహించేందుకే కట్టుబడ్డాయన్నారు.ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదన్నారు.ఉగ్రవాదంపై పోరాటంలో రెండు దేశాలు పరస్పర సహకారం,మద్దతు ఇచ్చిపుచ్చుకుంటాయన్నారు. సముద్రతల భద్రతను పటిష్టం చేసుకోవడంలో భాగంగా ఈ ఏడాదిలోనే భారత నావికాదళం నౌకను ఫిజీకి పంపాలని చర్చల్లో నిర్ణయించారు. ఫిజీ సైనిక దళాలకు రెండు మిలిటరీ అంబులెన్స్‌లను భారతదేశం బహుమతిగా ఇవ్వాలని కూడా మోదీ నిర్ణయించారు. ఫసిఫిక్ రీజియన్ అవసరాలు తీర్చేందుకు వీలుగా ఒక 100 పడకల ఆసుపత్రిని కూడా సువాలో నిర్మిస్తామని కూడా మోదీ ప్రకటించారు. అదేవిధంగా 12 వ్యవసాయ రంగ డ్రోన్లను, రెండు సంచార వ్యవసాయ భూముల పరీక్షా సంచార లేబొరేటరీలను కూడా ఫిజీకి సమకూర్చాలని నిర్ణయించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఫిజీదేశం భారత్‌కు ఎంతో ముఖ్యమైన భాగస్వామ్యదేశమని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి (సౌత్) నీనా మల్హోత్రా ఈ సందర్భంగా పాత్రికేయులకు చెప్పారు.

రక్షణబంధం పటిష్టతకు కార్యాచరణ ప్రణాళిక

ఉగ్రవాదాన్ని ఉపేక్షించేదిలేదు : మోదీ,రెబక ఉద్ఘాటన



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బాంబే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు
## సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి

**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలీలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించేందుకు కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈసిఫార్సు ఆమోదం పొందితే జస్టిస్ జాయ్ మాల్య బాగ్చి పదవీ విరమణ అనంతరం 2031 అక్టోబర్‌లో జస్టిస్ పంచోలీ భారత ప్రధానన్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, జెకె.మహేశ్వరి, బివి.నాగరత్నలతో కూడిన కొలీజియం సమావేశమై ఈనిర్ణయం తీసుకుంది. ఈనియామకాలతో 34మంది న్యాయమూర్తులతో సుప్రీంకోర్టులో ఖాళీలు ఉండవు. 1964 ఏప్రిల్ 13న జన్మించిన జస్టిస్ అరాధే గత ఏడాదివరకు తెలంగాణ హైకోర్టు ప్రధానన్యాయమూర్తిగా ఉండి బాంబే హైకోర్టుకు బదిలీ అ య్యారు. అహ్మదాబాద్‌లో 1968 మే 28న జన్మించిన జస్టిస్ పంచోలీ అక్టోబర్1, 2014న గుజరాత్ హైకోర్టుఅదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. త

# 'మఖానా' శ్రమ దోచుకుంటున్న దళారులు

### బహుజన కార్మికులకు న్యాయం చేస్తా
### రాహుల్ ప్రతిజ్ఞ



**కతిహార్:** బీహార్‌లో రాత్రింబగళ్ళు ఎండా వానల్లో కష్టపడి 'మఖానా' (ప్రొటీన్ అధికంగా ఉండే పోషకాహార తామర గింజలు) పంట సాగు చేస్తున్న ఉత్పత్తిదారులకు, కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా తాను పోరాటం చేస్తానని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ప్రతిజ్ఞ చేశారు. 'ఓటు చోరీ' చేసే ప్రభుత్వం వీరి శ్రమను గౌరవించడంలేదు, వారికి తగిన శ్రమఫలితాన్ని ఇవ్వడంలేదు, వారిక్షేమం పట్టించుకోవడంలేదు, న్యాయం చేయడంలేదని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టింగ్ చేశారు. ఇటీవల ఉత్తర బీహార్ కతిహార్ జిల్లాలో 'ఓటర్ అధికార్ యాత్ర' సందర్భంగా మఖానా పెంపకందార్లతో జరిపిన సమావేశం వీడియోను సోమవారం రాహుల్‌గాంధీ తన యూ ట్యూబ్ ఛానల్‌లో షేర్ చేశారు. ప్రపంచ మఖానా ఉత్పత్తిలో 90 శాతం పంట సాగు బీహార్ రాష్ట్రంలోనే జరుగుతోందని, మఖానాను ఉత్పత్తిలో 99 శాతం మంది బహుజనులే ఉన్నారని, ఈ ఉత్పత్తిదారులు, కార్మికుల కష్టాన్ని ఒకేఒక్కశాతంగా ఉన్న మధ్యదళారులు దోచుకుంటున్నారని, ఈ అన్యాయాన్ని ఎండగడతామని రాహుల్‌గాంధీ ఆ వీడియోలో ఉత్పత్తిదారులకు చెప్పారు. మఖానా లేదా ఫూల్ మఖానా అనేది అత్యధికంగా ప్రొటీన్ లభ్యమయ్యే పోషకాహార విలువలు గల పంటసాగు అనీ, ఇంత ఖరీదైన, విలువైన పంటసాగు ఫలాన్ని దళారులు దోచుకుంటున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. మఖానాను ఆయన సూపర్ ఫుడ్‌గా అభివర్ణిస్తూ, సమాజంలో ఒక వర్గానికి ఇదెంతో గొప్ప ఆహారమని, కానీ ఈ పంట సాగు ఉత్పత్తిదారులకు మాత్రం ఆ ఫలితాలు లభించడంలేదన్నారు. ఉత్పత్తిదారులు, కార్మికులు రాత్రింబవళ్ళు కష్టపడి నాగానీ ఈ పంటసాగులో ఒకశాతం లాభం కూడా వారికి రావడంలేదన్నారు. మఖానా సాగు రైతులను ఇటీవల నేను కలిశాను, వారితో మాట్లాడాను, వారి కష్టాలు తెలుసుకుని వారికి భరోసా ఇచ్చాను అని ఎక్స్‌లో రాహుల్‌గాంధీ పోస్టింగ్ పెట్టారు. పెద్దపెద్ద నగరాలలో కిలో తామర గింజలు రూ.1000ల నుండి రూ.2000ల వరకూ అమ్ముడుపోతున్నాయని, కానీ వీటిని పండించే కార్మికులకు ఆ శ్రమ ఫలితం దక్కడంలేదన్నారు. ఈ మొత్తం పరిశ్రమకు పునాదిగా ఉన్న కార్మికులకు నామ మాత్రపు ధర లభిస్తోందన్నారు. ''ఈ రైతులు, కార్మికులు అందరూ ఎవరు? వీరంతా పూర్తిగా వెనుకబడిన తరగతులకు చెందినవారు, దళితులు, బహుజనులు. ఈ పంటసాగులో 99 శాతం కాయకష్టం ఈ బహుజనులదే, కానీ ఈ ఆర్థిక ప్రయోజనాలు మాత్రం ఒక శాతం మధ్యదళారులకే దక్కుతున్నాయి, ఓట్‌చోరీ ప్రభుత్వం వారి శ్రమను గౌరవించడంలేదు'' అని విమర్శించారు. బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కూడా మఖానా రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటున్న దృశ్యాలు వీడియోలో షేర్ చేశారు. పంటసాగు సమయంలో ఎదురయ్యే సమస్యలను ఆయన రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు చెప్పే సమస్యలను ఆయన శ్రద్ధగా ఆలకించిన దృశ్యాలను చూపించారు. ఈ సందర్భంగా అనేకమంది నాయకులు కూడా ఆయన వెంట ఉన్నారు. ఇండిపెండెంట్ ఎంపి రాజేశ్ రంజాన్ అలియాస్ పప్పూ యాదవ్ కూడా ఉన్నారు.

### అన్ని పంటలకు ఎంఎస్‌పి డిమాండ్
# దేశ వ్యాప్త రైతులది
### కేవలం హర్యానా, పంజాబ్ రైతులదే కాదు : జగ్జిత్ సింగ్ దల్లెవాల్



**న్యూఢిల్లీ :** అన్ని పంటలకు కనీస మద్దతు ధరపై చట్టపరమైన హామీ దేశవ్యాప్తంగా ఉన్న రైతుల డిమాండ్ అని సంయుక్త్ కిసాన్ మోర్చా నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ అన్నారు. కేవలం హర్యానా, పంజాబ్ రైతులకు మాత్రమే కాదని స్పష్టం చేశారు. జంతర్ మంతర్‌లో జరుగుతున్న 'కిసాన్ మహాపంచాయత్'లో సోమవారం ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల రైతులు హాజరయ్యారు. అన్ని పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన హామీ, వ్యవసాయం, పాడి, కోళ్ల పరిశ్రమ, మత్స్య రంగాలను అమెరికాతో ప్రతిపాదిత ఒప్పందం నుండి దూరంగా ఉంచడం, 2020–21 ఆందోళన సమయంలో రైతులపై నమోదైన పోలీసు కేసులను ఉపసంహరించుకోవడం వంటి మూడు కీలక అంశాలపై మహాపంచాయత్ దృష్టి సారిస్తోంది. కాగా, నేటి మహాపంచాయత్‌లో దేశవ్యాప్తంగా ఉన్న రైతులు తమ డిమాండ్లను ముందుకు తీసుకురావడానికి ఇక్కడకు వచ్చేలా ప్రయత్నించామని దల్లేవాల్ చెప్పారు. ఎంఎస్‌పి కోసం డిమాండ్ పంజాబ్, హర్యానా రైతులది మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా ఉన్న రైతులది కూడా అని తాము ప్రభుత్వానికి చెప్పాలనుకుంటున్నామన్నారు. మహాపంచాయతీలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రైతులు, మద్దతుదారులను ఎస్‌కెఎం కోరింది. సమావేశం శాంతియుతుంగా జరుగుతుందని వారికి హామీ ఇచ్చింది. ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఉద్యమం జరిగిన దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత ఈ సమావేశం జరిగింది. దీనివల్ల మూడు వ్యవసాయ చట్టాలు రద్దు చేయబడ్డాయి. శాంతిభద్రతలు కాపాడుకునేందుకు దాదాపు 1,200 మంది సిబ్బందిని ఆ ప్రదేశంలో మోహరించినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

### ప్రధాని మోదీ డిగ్రీ వివరాలను బైటపెట్టాలన్న సిఐసి ఉత్తర్వులను
# త్రోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు




**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన డిగ్రీ వివరాలను బైటపెట్టాలని కేంద్ర సమాచార కమిషన్ (సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్–సిఐసి) ఇచ్చిన ఉత్తర్వులను ఢిల్లీ హైకోర్టు సోమవారం త్రోసిపుచ్చింది. దానిని వ్యక్తిగత సమాచారంగా పేర్కొంటూ, అందులో ఎలాంటి 'అంతర్లీన ప్రజా ప్రయోజనం' లేదని తీర్పునిచ్చింది. సిఐసి ఉత్తర్వులను సవాలు చేస్తూ ఢిల్లీ యూనివర్సిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సచిన్ దత్తా ఫిబ్రవరి 27న తీర్పును రిజర్వ్ చేశారు. తాజాగా దానిపై తీర్పును వెలువరించారు. 'ప్రజలకు ఆసక్తి కలిగించే విషయం' అనేది 'ప్రజా ప్రయోజనం' ఉన్న విషయానికి పూర్తిగా భిన్నమైనదని న్యాయమూర్తి అన్నారు. నీరజ్ అనే వ్యక్తి దాఖలు చేసిన ఆర్‌టిఐ దరఖాస్తును మేరకు సిఐసి 2016 డిసెంబర్ 21న 1978లో బిఏ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరి రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించింది. అదే సంవత్సరంలో ప్రధానమంత్రి మోదీ కూడా బిఎలో ఉత్తీర్ణత సాధించారు. అయితే, హైకోర్టు 2017 జనవరి 23 సిఐసి ఉత్తర్వులపై స్టే విధించింది. సోమవారం వెలువడిన తీర్పులో ఆర్‌టిఐ దరఖాస్తులో కోరిన సమాచారంలో ఎలాంటి అంతర్లీన ప్రజా ప్రయోజనం లేదని హైకోర్టు పేర్కొంది. అలాగే, విద్యా అర్హతలు ఏదేని ప్రభుత్వ పదవిని నిర్వహించడానికి లేదా అధికారిక బాధ్యతలు నిర్వర్తించడానికి చట్టబద్ధమైన అవసరం కాదని తీర్పు చెప్పింది.'కోరిన సమాచారం ప్రజాబాహుళ్యంలో ఉన్న వ్యక్తికి సంబంధించినది కాబట్టి, ప్రభుత్వ విధులకు సంబంధం లేని వ్యక్తిగత సమాచారంపై గోప్యతా హక్కులు రద్దు కావు' అని ఉత్తర్వులో పేర్కొన్నారు.ఆర్‌టిఐ చట్టం ప్రభుత్వ పనితీరులో పారదర్శకతను ప్రోత్సహించడానికి రూపొందించబడింది తప్ప 'సంచలనం కోసం వనరుగా' ఉపయోగించడానికి కాదని పేర్కొన్నారు. సిఐసి ఉత్తర్వును పక్కన పెట్టాలని,అయినప్పటికీ, విశ్వవిద్యాలయం తమ రికార్డులను కోర్టుకు చూపించడానికి అభ్యంతరం లేదని ఢిల్లీ యూనివర్సిటీ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు.ఆర్‌టిఐ దరఖాస్తుదారుల తరపు న్యాయవాదులు బహుళ ప్రజా ప్రయోజనం కోసం ప్రధానమంత్రి విద్యా సమాచారాన్ని వెల్లడించడానికి ఆర్‌టిఐ చట్టం వీలు కల్పిస్తుందని వారు వాదించారు.

### ప్రధాని వివరాలపై రహస్యం ఎందుకు?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్యాచిలర్ డిగ్రీకి సంబంధించిన సిఐసి ఇచ్చిన ఉత్తర్వును ఢిల్లీ హైకోర్టు రద్దు చేయడంతో, అందరి విద్యా వివరాలు బహిరంగంగా ఉన్నప్పుడు ప్రధానమంత్రి విద్యా వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచడం అర్థం చేసుకోలేని విషయమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు.

# మరణశిక్షను సవాలు చేయవచ్చు
### సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద మరణశిక్షను సవాలు చేయవచ్చునని సుప్రీంకోర్టు పేర్కొంది. మరణశిక్షకు గురైన ఒక నేరస్థుడు దాఖలు చేసిన పిటిషన్‌పై తిరిగి విచారణ చేపట్టేందుకు అంగీకరించిన సందర్భంగా ధర్మాసనం సోమవారం ఈ విషయం చెప్పింది. నాలుగు సంవత్సరాలు వయసుగల ఒక బాలికపై 2008 ఏప్రిల్‌లో అత్యాచారం, హత్యచేసిన కేసులో నాగపూర్‌కు చెందిన వసంత్ సంపత్ దుపారేకు మరణశిక్ష పడింది. ఆ బాలికకు చాక్లెట్లు ఎరవేసి వశపరచుకున్నాడు. ఆమెపై అత్యాచారం చేసి ఆమె ముఖాన్ని గుర్తుతెలియకుండా చేయడంకోసం తలను రాళ్ళకేసికొట్టి చంపాడు.ఈ కేసులో అతడికి మరణశిక్ష పడింది. ఈ కేసును సుప్రీంకోర్టు పునఃవిచారణకు తీసుకుంది.

న్యాయస్థానం విధించిన మరణశిక్ష తీర్పులపై విచారణ తిరిగి ప్రారంభించేందుకు రాజ్యాంగంలో ఉన్న 32వ అధికరణ అధికారాలు ఇస్తుందని, ఐతే కార్యవిధాన అమలు రక్షణ చర్యల ఉల్లంఘన జరిగిందనే ప్రాతిపదికపై మరణశిక్ష తీర్పులపై విచారణ పునఃప్రారంభాన్ని కోరవచ్చునని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో కార్యవిధాన అమలు చర్యల ఉల్లంఘన జరిగిందని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా 2022 నాటి మనోజ్ వెర్సస్ మధ్యప్రదేశ్ న్యాయస్థానం తీర్పును సుప్రీం ధర్మాసనం ప్రస్థావించింది. ఈ కేసులో సుప్రీంకోర్టు ఆనాడు దిగువ కోర్టులకు అనేక మార్గదర్శకాలు జారీ చేసింది. మరణశిక్ష విధించేముందుగా నేరస్థుడి మానసికస్థితిని, అతడి మనోపరినామక్రమాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని ఆ నివేదికల ప్రకారం తర్వాత మరణశిక్ష విధించాలని ఆ మార్గదర్శకాలలో సుప్రీంకోర్టు మూడేళ్ళక్రితం పేర్కొంది. మనోజ్–మధ్యప్రదేశ్ న్యాయస్థానం తీర్పుపై సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోకుండా సరైన ధృవీకరణలు చేసుకోకుండా మరణశిక్ష విధించారంటూ సదరు నేరస్థుడు గనుక తీర్పును ఖండించి, వ్యతిరేకించినట్లయితే విధాన కార్యాచరణ అమలులో ఉల్లంఘనలు జరిగాయనే ప్రాతిపదికపై రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద మరణశిక్ష తీర్పుపై తిరిగి విచారణ ప్రారంభించవచ్చునని ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 14, 21వ అధికరణ ప్రకారం దేశంలోని ప్రతి వ్యక్తికీ సమానమైన హక్కులు, అందరినీ సమానంగా చూడాల్సిన హక్కులు ఉన్నాయని, ఈ ప్రాథమిక హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నందువల్ల దీనికి అనుగుణంగా మరణశిక్షకు గురైన నేరస్థుడు లేవనెత్తిన విధానపరమైన కార్యాచరణ లోపాల ఉల్లంఘనలను తిరిగి పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. బాలికను హత్యచేసిన కేసులో నాగపూర్‌కు చెందిన వసంత్ సంపత్ దుపారేకు కిందికోర్టు విధించిన మరణశిక్షను 2014లో సుప్రీంకోర్టు సమర్థించి ధృవీకరించింది. మరణశిక్ష తీర్పును పునఃపరిశీలించాలంటూ నేరస్థుడు ఆనాడే మరోసారి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా 2017 మే 3వ తేదీన సుప్రీకోర్టు తిరస్కరించింది. ఆ తర్వాత నేరస్థుడు మహారాష్ట్ర గవర్నర్‌కు క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేశాడు. ఆ క్షమాభిక్ష పిటిషన్‌ను కూడా 2022, 2023లలో తిరస్కరణకు గురైంది.

### ప్రజాస్వామ్యం, కుల వ్యవస్థ
# కలిసి ఉండలేవు
### మీరా కుమార్



**న్యూఢిల్లీ :** ప్రజాస్వామ్యం, కుల వ్యవస్థ కలిసి ఉండలేవని సోమవారం ఢిల్లీ అసెంబ్లీలో జరిగిన అఖిల భారత స్పీకర్ల సమావేశంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అన్నారు. ఈ సదస్సులో రెండవ రోజు ఆమె కీలక ప్రసంగం చేశారు. లోక్‌సభకు తొలి మహిళా స్పీకర్ అయిన కుమార్ మాట్లాడుతూ 'సమానత్వం, అసమానత కలిసి ఉండలేవు. సమానత్వ ప్రజాస్వామ్యపుడు బాహ్య రూపంతో అసమానత వృద్ధి చెందే అవకాశం ఉంది' అని ఆమె అన్నారు. ప్రజాస్వామ్యం మరియు కుల వ్యవస్థ కలిసి ఉండలేవని కుమార్ అన్నారు. 'అమర్‌బెల్' (పరాన్నజీవి లత) అది పెరిగే చెట్టును ఎండబెట్టి, తద్వారా తనను తాను నిలబెట్టుకున్నట్లే, కుల వ్యవస్థ సమాజానికి అదే చేస్తుందన్నారు. సమానత్వాన్ని స్థాపించడం ప్రజాస్వామ్య 'ఆత్మ' అని, అది లేకుంటే చివరికి నిర్జీవంగా మారుతుందని ఆమె నొక్కి చెప్పారు. బ్రిటిష్ పాలనలో కేంద్ర శాసనసభకు ఎన్నికైన తొలి భారతీయురాలు విఠల్‌భాయ్ పటేల్ చేసిన కృషిని కుమార్ గర్తు చేశారు. లోక్‌సభ సమావేశాలకు అధ్యక్షత వహించినప్పుడు పోరాటాలు, అనుభవం తనకు స్ఫూర్తినిచ్చాయని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ మొదటిసారి నిర్వహించిన ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్, కేంద్ర శాసనసభకు తొలి భారతీయ స్పీకర్‌గా పటేల్ ఎన్నికైన శతాబ్ది ఉత్సవాలను గుర్తుచేసుకుంది. ఆదివారం రెండు రోజుల సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేక స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేశారు.

### కేరళలో కాంగ్రెస్ నుంచి
# ఎమ్మెల్యే రాహుల్ సస్పెన్షన్




**కన్నూర్ :** కాంగ్రెస్ నాయకుడు, పాలక్కాడ ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కూటథిల్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసినట్లు కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ తెలిపారు. అయితే మమ్‌కూటథిల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనే రాజకీయ ప్రత్యర్థుల డిమాండ్‌ను జోసెఫ్ తిరస్కరించారు. అధికారిక ఫిర్యాదు లేదా కేసు నమోదు అయ్యే వరకు వేచి ఉండకుండా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా తన పార్టీ పదవిని వదులుకోవడం ద్వారా శాసనసభ్యుడు ఒక 'నమూనా'గా నిలిచారని జోసెఫ్ అన్నారు. ఇరిట్టిలోని తన ఇంట్లో ఏర్పాటు చేసిన జోసెఫ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్ మమ్‌కూటథిల్‌ను ఎంత కాలం సస్పెండ్ చేశారనేది స్పష్టంగా చెప్పలేదు. ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా పరిగణించిందని జోసెఫ్ అన్నారు. కేరళలోని కాంగ్రెస్ నాయకత్వం ఈ విషయంలో ప్రతిపక్ష నాయకుడు వి డి సతీషన్, మాజీ కెపిసిసి చీఫ్‌లు, రాష్ట్రంలోని ఎఐసిసి వర్కింగ్ కమిటీ సభ్యులు సహా వివిధ నాయకులతో వరుస సంప్రదింపులు జరిపి, ఈ విషయంలో ఏకగ్రీవ నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. ఈ విషయంలో పార్టీకి ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, చట్టపరమైన ఫిర్యాదు కూడా రాలేదన్నారు. ఎక్కడా కేసు నమోదు కాలేదని జోసెఫ్ వెల్లడించారు. అయితే రాజకీయ ప్రత్యర్థులు మమ్‌కూటథిల్‌ను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌లో ఎటువంటి సమర్థన లేదా తర్కం లేదని స్పష్టం చేశారు. వారికి అలాంటి డిమాండ్‌ను లేవనెత్తే నైతిక హక్కు లేదని, కేరళ రాజకీయాల్లో అలాంటి ప్రాధాన్యత లేదని కెపిసిసి చీఫ్ చెప్పారు. మలయాళ నటి రిని ఆన్ జార్జ్ ఒక ప్రసిద్ధ రాజకీయ పార్టీకి చెందిన ఒక యువ నాయకుడు అనుచితంగా ప్రవర్తించాడని ఆరోపణలు చేసిన విదితమే.

# ఎల్‌ఓసి వెంట డ్రోన్ల సంచారం
### భారత్ భద్రతా దళాలు అప్రమత్తం



**న్యూఢిల్లీ :** నియంత్రణ రేఖ వెంట (ఎల్‌ఓసి) పాక్ డ్రోన్లు కలకం సృష్టించాయి. గగనతలంలో పాక్ డ్రోన్లను గుర్తించిన భారత్ భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఆదివారం రాత్రి సరిహద్దు అవతలి నుంచి ఆరు డ్రోన్లు ఎగురుతూ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఐదు నిమిషాల్లో అవి తిరిగి పాక్ భూభాగంలోకి వెళ్లాయన్నారు. నిఘా కోసం దాయాది దేశం వీటిని ప్రయోగించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. డ్రోన్లు ఆయుధాలు, మాదకద్రవ్యాలను జారవిడిచి ఉంటాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని.. డ్రోన్ల కదలికను గుర్తించిన అన్ని ప్రాంతాల్లో సోమవారం సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గత కొన్నేళ్లుగా జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లు పలు ఆయుధాలు, మాదకద్రవ్యాలను జారవిడుస్తుండడం పెద్ద సమస్యగా మారిందని అధికారులు పేర్కొన్నారు. పహల్గామ్‌దాడి అనంతరం భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదులు చొరబడకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ చేసే డ్రోన్ దాడులను తిప్పికొట్టేందుకు పటిష్ఠమైన చర్యల్లో భాగంగా బిఎస్‌ఎఫ్ అధికారులు సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్ స్క్వాడ్రన్‌ను ఏర్పాటు చేశారు. సరిహద్దు వెంబడి నిఘా ఉంచడంతో పాటు, శత్రు సేనల కదలికల్ని గమనించడం, దాడుల్లో పాల్గొనడం వంటి కార్యకలాపాల్లో వీటిని వినియోగించనున్నారు.

# కామెడీ పేరుతో ఎగతాళి చేస్తారా?
### మీ షోలోనే వారికి క్షమాపణలు
### చెప్పాలి : సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ :** దివ్యాంగులు, అరుదైన జన్యువ్యాధులతో బాధపడుతున్నవారిని ఎగతాళి చేస్తూ స్టాండప్ కామెడీ చేస్తున్న ఐదుగురు సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లుయెన్సర్లు క్షమాపణ చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. స్టాండప్ కామెడీ పేరుతో దివ్యాంగులను లక్ష్యంగా చేసుకోవడం తగదని ఆగ్రహం వ్యక్తం చేసింది. సమయ్ రైనా సహా ఐదుగురు కమెడియన్లు తమ పాడ్‌కాస్ట్ లేదా కామెడీ షోలో క్షమాపణ చెప్పాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. సమయ్ రైనా, విపున్ గోయల్ తదితర కమెడియన్లు దివ్యాంగుల మనసు బాధించేలా జోకులు వేశారని ఎస్‌ఎంఎ క్యూర్ ఫౌండేషన్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. ఇండియాస్ గాట్ లాటెంట్ షోలో యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్లతో పాటు ఈ పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా రైనా దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌ను సుప్రీం తప్పుబట్టింది. రైనా తనను తాను అమాయకుడిగా చిత్రీకరించుకొని తర్వాత క్షమాపణలు చెప్పారని విమర్శించింది. సోనాలి థక్కర్ బేషరతుగా తన షోలో చేసిన క్షమాపణ ఇప్పటికే ప్రసారమైందున ఆమె తప్ప మిగిలిన ఐదుగురు తమ షో లేదా పాడ్‌కాస్ట్‌లో క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఈ ఒక్క కేసుకే పరిమితం కాకుండా భవిష్యత్తు సవాళ్లను దృష్టిలోఉంచుకొని సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి ఎగతాళిని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. 'మేం బేషరతుగా క్షమాపణలు చెప్పాం. గత ఆదేశాలకు అనుగుణంగా ప్రతివాదులంతా హాజరయ్యారు' అని రైనా తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ రోజు దివ్యాంగులు, తర్వాత మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇలా అందరినీ ఎగతాళి చేస్తూ పోతే ఇదంతా ఎక్కడ ఆగుతుందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి వ్యవహారశైలిపై జరిమానా విధించే అంశాన్ని తదుపరివిచారణలో పరిశీలిస్తామని తెలిపింది. అలాగే వారి యూట్యూబ్ ఛానళ్లలో కూడా క్షమాపణలు తెలియజేయాలని ఆదేశించింది. ఇదిలా ఉండగా, 'ఇండియాస్ గాట్ లాటెంట్' షోలో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించడం వల్ల ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. అతడి వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సమయ్ రైనా షోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు.

# ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్న ట్రక్కు
### 9 మంది దుర్మరణం,
### మరో 42 మందికి గాయాలు
### యుపి బులంద్‌షహర్ జిల్లాలో ఘటన



**బులంద్‌షహర్ :** ఉత్తరప్రదేశ్‌లో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బులంద్‌షహర్ జిల్లాలో యాత్రికులతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మరణించారు. మరో 42 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. మృతులలో ఇద్దరు మైనర్లు కాగా, గాయపడి ఆసుపత్రిలో చేర్చారు. వీరిలో 12మంది 18ఏళ్లలోపు వారే ఉన్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ యాత్రికుల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆర్నియా బైపాస్ సమీపంలోని బులంద్‌షహర్– అలీగఢ్ సరిహద్దులో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ ప్రమాదం జరిగింది. క్యాంటర్ ట్రక్కు ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుండి ఢీకొట్టడంతో అది బోల్తా పడిందని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (గ్రామీణ) దినేష్ కుమార్ సింగ్ తెలిపారు. ట్రాక్టర్ ట్రాలీలో 61 మంది ప్రయాణిస్తున్నారని, వారు కాస్‌గంజ్ జిల్లాలోని రఫత్‌పూర్ గ్రామం నుండి రాజస్థాన్‌లోని జహార్‌పీర్‌కు తీర్థయాత్ర కోసం వెళ్తున్నట్లు అని ఆయన చెప్పారు. బాధితులను వెంటనే ఆసుపత్రులకు తరలించినట్లు పోలీసు అధికారి తెలిపారు. ఘటనాస్థలిలో ఎనిమిది మంది మృతి చెందగా, లేఖ్‌రాజ్ (40) అనే మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. 10మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని వారు తెలిపారు. బాధితులను చికిత్స కోసం బహుళ ఆసుపత్రులకు తరలించారు. 10 మందిని అలీఘర్ మెడికల్ కాలేజీకి, 23 మందిని బులంద్‌షహర్ జిల్లా ఆసుపత్రికి, 23 మందిని ఖుర్జాలోని కైలాష్ ఆసుపత్రికి తరలించారు. మృతుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపినట్లు పోలీసులు తెలిపారు. మృతులను ట్రాక్టర్ డ్రైవర్ ఇ.యు. బాబు (40), రాంబేటి (65), చాందిని (12), ఘనిరామ్ (40), మోక్షి (40), శివాంష్ (6), యోగేష్ (50) మరియు వినోద్ (45), వీరందరూ కాస్‌గంజ్ జిల్లా నివాసితులు. జిల్లా మేజిస్ట్రేట్ శ్రుతి, ఎస్‌ఎస్‌పి సింగ్, ఇతర సీనియర్ అధికారులతో కలిసి ముసురులోనే ఘటనా స్థలాన్ని సందర్శించి, ఆసుపత్రిలో గాయపడిన వారితో మాట్లాడారు. కాగా, ట్రక్కును స్వాధీనం చేసుకున్నామని, తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

ప్రజాపక్షం
మంగళవారం, 26 ఆగస్టు

# రేవంత్ రెడ్డి ఒయు సందర్శన!

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం దానికదే పెట్టని కోట. రాజకీయ నాయకులకు ప్రవేశ నిషిద్ధ దుర్గం. స్వయం విద్యార్థి నాయకత్వంతో క్యాంపస్ లోపల ఎన్నో ఉద్యమాలు, అలజడులు, నిరాహార దీక్షలు, ఆత్మహత్యల కృత్యాలు. అసువులను పోలీసులతో ఘర్షణ. పెద్ద ఎత్తున పోలీసు పహారాతో అది అనునిత్యం వార్తల్లో ఉండిన రణక్షేత్రం. ఉద్యమకాలంలోనే కాదు, స్వరాష్ట్ర సాధన, స్వపరిపాలన అనంతరం కూడా టిఆర్ఎస్ పరిపాలన సాగిన దాదాపు పదేళ్లకాలంలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుకు విద్యార్థుల ప్రవేశ ద్వారాలు తెరవలేదు. 2017 జులై 7న రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఒయు శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించిన సందర్భంలో ముఖ్యమంత్రి లాంఛనంగా పాల్గొన్నారు గాని స్వాగత ప్రసంగం చేయలేదు. విద్యార్థుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత కారణం. 2018 ప్రారంభంలో ఉత్సవాల ముగింపు – రాష్ట్ర ప్రభుత్వం ఉత్సాహం చూపనందున సాదాసీదాగా జరిగింది. ఆ తర్వాత మరోసారి ప్రయత్నించి విఫలమైనారు. మొత్తంమీద తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదుపరి తొలిసారి కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం తెలంగాణ విద్యా వ్యవస్థకు గుండెకాయలాంటి ఉస్మానియా యూనివర్సిటీ సందర్శించి చరిత్ర సృష్టించారు. రూ.10 కోట్లతో నిర్మించిన అధునాతన డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూంను, దాదాపు రూ.90 కోట్లతో నిర్మించిన కొత్త హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు.

ముఖ్యమంత్రి సందర్శనను అడ్డుకోవడానికి బిఆర్ఎస్ విద్యార్థి సంఘం తీవ్ర ప్రయత్నం చేయగా, కాంగ్రెస్ విద్యార్థి సంఘం అంతే పట్టుదలతో విజయవంతం చేసేందుకు పోటీ పడింది. శాంతి–భద్రతలకు బాధ్యత వహించే పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. బిఆర్ఎస్ విద్యార్థి నాయకులను ముందుగానే నిర్బంధంలోకి తీసుకొని రేవంత్ రెడ్డి కార్యక్రమం నిరాటంకంగా జరిగేందుకు తోడ్పడింది. తమ ముఖ్యమంత్రి కెసిఆర్ తొమ్మిదేళ్లపాటు ప్రవేశానికి నోచుకోని ఈ ప్రతిష్టాత్మక ప్రదేశంలో తమ ప్రత్యర్థికి సాదర స్వాగతం లభించటం బిఆర్ఎస్‌కు కన్నుకుట్టే వ్యవహారమే. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అక్కసు వెళ్లగక్కారు. 'విద్యార్థులను ముందే అరెస్టు చేశారు. అడుగడుక్కీ పోలీసులను పెట్టారు. ముళ్ల కంచెలు వేశారు. తాళ్లు పట్టుకుని రక్షణ ఇచ్చారు. ఆయన కొత్తగా ఏమి చేయటానికి పోయారు? కెసిఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిర్మించిన భవనాలకు ప్రారంభోత్సవం చేశారు' అంటూ ఇదీ ఒక సందర్భమా అన్నట్లు ఎద్దేవా చేశారు. ఈ ముఖ్యమంత్రి ఏమి చేశారనే దానికన్నా తమ ముఖ్యమంత్రిని విద్యార్థులు ఎందుకు రానివ్వలేదో హరీశ్‌రావు పునరాలోచన చేసుకుంటే మేలు. గత ప్రభుత్వం మంజూరు చేసిన భవనాల నిర్మాణం పూర్తయితే, మళ్లీ ఎప్పుడో ప్రజలు కరుణించి ఆ గత నాయకుణ్ణి మళ్లీ ముఖ్యమంత్రిని చేసేదాకా అవి ప్రారంభోత్సవానికి నోచుకోకూడదా హరీశ్‌రావుగారు. అవి కెసిఆర్ లేక హరీశ్‌రావు సొంత ఆస్తికాదు. ప్రజాధనంతో నిర్మించింది. ప్రభుత్వం నిరంతరాయ ప్రక్రియ అని తెలియదా? ఉద్యోగ భర్తీపై అదే అక్కసు! కెసిఆర్ నోటిఫికేషన్లు ఇస్తే (ఎనిమిదేళ్లకుపైగా నిద్రపోయి – ఎన్నికల ముందు ఇచ్చింది వాస్తవం కాదా?) రేవంత్‌రెడ్డి ఆ కాగితాలు పంచిపెట్టారు అంటారు హరీశ్‌రావు. చిత్రంగా లేదూ!

ఉస్మానియా యూనివర్సిటీలో ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీటుగా సమాధానమిచ్చారు. 'నేను మీ వాణ్ణి – మీ మధ్యలో నుంచి వచ్చాను. అరవై ఏళ్లగా రాజకీయాల్లో ఉన్నాను. మీరు గెలిపిస్తే ముఖ్యమంత్రి అయ్యాను... విద్యార్థులారా, రాజకీయ నాయకులు చెప్పిన మాటలు వినకుండా, యూనివర్సిటీలో మీకు ఏమి కావాలో ఆలోచించండి, కాగితం మీద పెట్టండి. డిసెంబర్‌లో నేను మళ్లీ వస్తా. ఒక్క పోలీసు ఉండడు, నేను మీ మధ్యకు నడుచుకుంటూ వస్తా. ఆర్ట్స్ కాలేజీ వద్ద మీటింగ్ పెడదాం. మీ సమస్యలు, కావలసిన సౌకర్యాల గూర్చి చర్చించుదాం. సాధ్యమైన వాటిపై అక్కడే జీఓలిస్తా. ఒయు అభివృద్ధికి రూ.1000కోట్లయినా ఖర్చుపెడతాం. విద్యకు నేను అధిక ప్రాధాన్యం ఇస్తున్నా. నా చిత్తశుద్ధిని నమ్మండి' అన్నారు. 'మా బిఆర్ఎస్ ప్రత్యర్థులు ప్రతిదాన్నీ వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్నారు–వాళ్లను పట్టించుకోవద్దు. అధ్యాపక, విద్యార్థులతో కూడిన సభికులు హర్షధ్వానాలు చేశారు. ఈ మాటలు నెరవేర్చటంపైనే ఒయులో సుహృద్భావం నెలకొనటం ఆధారపడి ఉంటుంది.

# రాజ్యాంగ విలువలకోసం ప్రతిపక్షం పోరాటం

భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధంకడ్ రాజీనామాతో అనూహ్యంగా ఏర్పడిన ఖాళీ భర్తీ చేయటానికి నూతన ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. పాలక ఎన్‌డిఎ అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్, ప్రతిపక్ష ఇండియా కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బాలకృష్ణ సుదర్శన్‌రెడ్డి నామినేషన్‌లు దాఖలు చేయటంతో పోటీకి రంగం సిద్ధమైంది. పార్లమెంటు ఉభయ సభల సభ్యులే ఎలక్టోరల్ కాలేజీ గనుక అధికార పార్టీ అభ్యర్థి తప్పక గెలిచే అవకాశాలుండగా ప్రతిపక్షాల పోటీ ఎందుకు అనే ప్రశ్న సహజం. ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9న జరుగుతుంది.

ఎన్‌డిఎ అభ్యర్థిని బలపరచాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమి ఆ విజ్ఞప్తిని తిరస్కరించి తమ సొంత అభ్యర్థిని నిర్ణయించింది. ఇది లాంఛనప్రాయమైన పోటీ అని వారికి తెలుసు. దేశ రాజ్యాంగ విలువలను కాపాడవలసిన అవసరాన్ని ప్రజల దృష్టికి తేవటానికి ప్రతిపక్ష అభ్యర్థి పోటీ చేస్తున్నారు. ఎన్‌డిఎ అభ్యర్థి రాధాకృష్ణన్ ఆర్‌ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వ్యక్తి.

భారత రాజ్యాంగం నిర్దేశించిన సోషలిస్టు, సెక్యులర్, ఫెడరల్, ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకంగా హిందూ రాష్ట్ర (దేశం) స్థాపన ను కోరుకుంటున్న సంస్థ ఆర్‌ఎస్ఎస్. దాని రాజకీయ అంగం బిజెపి. అందువల్ల ఇండియా కూటమికి పోటీ చేయటం మినహా మార్గం లేదు. అందువల్ల దీన్ని 'భావజాల పోరాటం' అన్నారు. వారి సంయుక్త ప్రకటన ఇలా తెలిపిందిః ''శ్రీ సుదర్శన్‌రెడ్డిగారిని తమ ఉమ్మడి అభ్యర్థిగా ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. మన దేశ స్వాతంత్ర్యోద్యమం తీర్చిదిద్దిన విలువలను, మన దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యంలో వేళ్లూనికొని ఉన్న విలువలను ఆయన గాఢంగా ప్రతిబింబిస్తున్నారు. ఈ విలువలన్నీ ఈనాడు దాడికి గురవుతున్నాయి. అందువల్ల ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని మా సమష్టి సముదాయం నిర్ణయించింది''.

ప్రధానమంత్రి ఆగస్టు 19న ఎన్‌డిఎ అభ్యర్థి రాధాకృష్ణన్‌ను బలపరచాలని విజ్ఞప్తి చేస్తూ ఉపరాష్ట్ర పదవికి ఆయన ఎంతో తగిన వ్యక్తి అన్నారు. ఆయన జీవితం వివాదరహితం, ఎంతో నమ్రతతో మెలిగే వ్యక్తి అన్నారు. వివిధ పార్టీలతో మాట్లాడి తోడ్పాటు సమీకరించే పనిని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు అప్పగించారు. ఆయన సంభాషణలు ఫలితమివ్వలేదు. రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన వ్యక్తి అయినందున డిఎంకె తోడ్పాటు లభిస్తుందని బిజెపి ఆశించింది. రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌తో మాట్లాడినా సానుకూల స్పందన రాలేదు.

ఎన్‌డిఎ అభ్యర్థికి డిఎంకె తోడ్పాటు రాబట్టేందుకు బిజెపి రాష్ట్ర శాఖ, ఎఐఎడిఎంకె ''తమిళ కార్డు' ఉపయోగించినా ఆ ఒత్తిడి పనిచేయలేదు. తమకు ''భావజాలం'' అన్నిటికన్నా మిన్న అయినందున ఆయన్ను బలపరిచే ఉద్దేశం తమ పార్టీకి లేదని డిఎంకె స్పష్టం చేసింది. ''మేము భావజాలానికే ప్రాధాన్యత ఇస్తాం. రాధాకృష్ణన్ తమిళుడన్న కారణాన ఆయన్ను బలపరచలేము. ఆయన భావజాలాలేమిటో చూడాలి కదా!'' అన్నారు డిఎంకె అధికార ప్రతినిధి టికెఎస్ ఇళంగోవన్.

ఎన్‌డిఎ కూటమిలోని పార్టీలన్నీ అవే అభిప్రాయాలు వ్యక్తం చేశాయి. ఉపరాష్ట్రపతి ఎన్నిక వారి దృష్టిలో మామూలు ఎన్నిక కాదు. ఇదొక 'సైద్ధాంతిక పోరాటం. ప్రతీకప్రాయంగానైనా పోరాడాలి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించటం ద్వారా ఆర్‌ఎస్ఎస్–బిజెపి హిందూత్వ భావజాలానికి వ్యతిరేకంగా రాజ్యాంగ విలువలను అభిలషించే దేశ ప్రజల్లో గొప్ప ఆశను రగిల్చారు. రాజ్యాంగ విలువల కోసం పోరాడుతున్న ఇండియా కూటమి అభ్యర్థి ఓడిపోవచ్చుగాక, కాని ఈ పోటీ దేశమంతటా చెప్పుకోదగ్గ రాజకీయ ప్రభావం కలుగజేస్తుంది.

> ### ఎలక్టోరల్ కాలేజి
> లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు మొత్తం – 782
> ఎన్‌డిఎ సభ్యులు – 394
> ఇండియా కూటమి సభ్యులు – 323
> (ఇంతకాలం ఎన్‌డిఎతో ప్రయాణించిన వైసిపి, బిజెడి తమ రాష్ట్రాల్లో అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో ఉన్నాయి. తమ ఓటింగ్‌పై ఇంకనూ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది)

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి, స్థూలంగా తెలుగు ప్రజలకు చెందుతారు. అయితే ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న తెలుగు దేశం పార్టీ రాధాకృష్ణన్‌ను బలపరుస్తోంది. ప్రతిపక్ష వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి కూడా ఆయన్నే బలపరచటంలో ఆయన రాజకీయ అవసరాలేమిటో! కాగా తెలంగాణకు చెందిన ప్రతిపక్ష పార్టీ బిఆర్‌ఎస్‌కు కలలో కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూతంలా కనిపిస్తున్నందున, ఆయన ఎంపిక చేసిన సుదర్శన్‌రెడ్డికి ఓటు చేయటమెలా అనే సందిగ్ధంలో ఉంది. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నందున, రాష్ట్రానికి 2లక్షల టన్నులు యూరియా ఇచ్చిన లేదా తెచ్చిన పార్టీ అభ్యర్థికి ఓటు చేస్తామంటూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అర్థరహితమైన ప్రకటన చేశారు. యూరియా ఇవ్వగలిగింది కేంద్ర ప్రభుత్వం కాబట్టి బిజెపి అభ్యర్థికే తమ ఓటు అని సంకేతప్రాయంగా చెప్పినట్లయింది. ఆయన పార్టీ ఓట్లను ఎవరు అడిగారు అని బిజెపి నేత, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్‌కు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేదు. రాజ్యసభలో మిగిలిన ముగ్గురులో ఒకరు అప్పుడే కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను కలిశారు. బహుశా పార్టీ ఓటింగ్‌కు గైరుహాజరు కావచ్చు. ఏమి జరుగుతుందో చూదాం !

ప్రధాని నరేంద్రమోదీ రాజ్యాంగ పదవులకు సైతం తనకు విధేయులనే ఎంపిక చేయటంలో దిట్ట. దేశం చాలాసార్లు చూసింది. భారత ఎన్నికల కమిషనర్‌ల ఎంపిక తాజా ఉదాహరణ. మాజీ ఉపాధ్యక్షుడు జగ్‌దీప్ ధంకర్‌ను అమర్యాదకరంగా సాగనంపారు. అనారోగ్యం కారణంగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ధంకర్ ఇప్పుడు ఎక్కడున్నారో కూడా వార్తలు లేవు. ఈ నేపథ్యంలో ఆర్‌ఎస్ఎస్ మూలాలున్న రాధాకృష్ణన్ తెరమీదకు తెచ్చారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిబింబించే భావజాల పోరాటం, రానున్నకాలంలో దేశవ్యాప్తంగా జరిగే భావజాల పోరాటానికి ఆరంభ సంకేతం.



ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి చంద్రగిరి పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957 అక్టోబర్ 20న తిరుప్పూర్‌లో జన్మించారు. కోయంబత్తూరు చిదంబరం కళాశాలలో బిబిఎ డిగ్రీ పూర్తి చేశారు. తమ 17వ ఏట నుంచే ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తగా పని చేశారు. 1974లో బిజెపి రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైనారు. 1998లో, తిరిగి 1999లో కోయంబత్తూరు నుంచి బిజెపి అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికైనారు. ఆ తదుపరి 2004, 2014, 2019 ఎన్నికల్లో ఓటమిపాలైనారు. 2004–07 మధ్య బిజెపి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారు.

పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 93 రోజులపాటు 19వేల కిలోమీటర్ల రథ యాత్ర నిర్వహించారు. 2016–2020 మధ్య కేంద్ర కాయిర్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు చైర్మన్‌గా నామినేట్ అయినారు. 2022–23 మధ్య ఝార్ఖండ్ గవర్నర్‌గా, 2024 జులై 27 నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేస్తూ తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. రాధాకృష్ణన్ క్రీడాకారుడు, సౌమ్యుడుగా పేరుంది.



జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఇండియా కూటమి బలపరుస్తున్న అభ్యర్థిగా ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్నారు. ఆయన 1946 జులై 8న ప్రస్తుత రంగారెడ్డి జిల్లా (తెలంగాణ) ఆకుల మైలారంలో వ్యవసాయదారు కుటుంబంలో జన్మించారు. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం చేసిన ఆయన 1971 లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బాచ్‌లర్ ఆఫ్ లా డిగ్రీ పొందారు. అదే సంవత్సరం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ కౌన్సిల్‌లో నమోదైనారు. 1988–90 మధ్య హైకోర్టులో గవర్నర్ ప్లీడర్‌గా పనిచేశారు. 1990లో కేంద్ర ప్రభుత్వానికి అడిషనల్ స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేశారు. 1995 మే 2న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పర్మినెంట్ జడ్జీగా నియామకం పొందారు. 2005లో గువాహతీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు.

2007 జనవరి 12న సుప్రీంకోర్టు జడ్జీగా నియమితులై 2011 జులై 8న రిటైర్ అయినారు. అంతకుముందు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. జస్టిస్ రెడ్డి 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా నియమించబడ్డారు. అయితే వ్యక్తిగత కారణాలతో సెప్టెంబర్‌లోనే రాజీనామా చేశారు.

# చిన్నారులపై సోషల్ మీడియా విధ్వంసాన్ని ఆపేదెలా?

నేటి ఆధునికయుగంలో సామాజిక మాధ్యమాలు, ఒటిటి వెబ్ సిరీస్ వినియోగం విపరీతంగా పెరుగుతుంది. ఇవీ పిల్లల మనస్తత్వంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. హింసాత్మక ఘటనలకు దారి తీస్తున్నాయి. ఇటీవల కూకట్‌పల్లిలో జరిగిన బాలిక హత్యకేసులో మైనర్ బాలుడు క్రైమ్ వెబ్ సిరీస్ తో ప్రేరణ పొందినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేయడం ఆన్‌లైన్ వేదికలలో తెలుసుకొన్నాడు. చోరీని బాలిక చూడడంతో ఆమెను కిరాతకంగా చంపాడు. బెంగళూరులో ఓ బాలుడు (14) వెబ్ సిరీస్ చూసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరీస్‌లోని ఓ క్యారెక్టర్ బొమ్మను కూడా తన గదిలో గీశాడు. కొందరు యువకులు ఒక బైక్‌పై ఎనిమిది మంది ఎక్కి నడపడం వంటి సాహసాలకు ఒడిగడుతున్నారు. పిల్లల్లో ఇలాంటి విపరీత ప్రవర్తనకు స్మార్ట్ ఫోన్ వినియోగం, ఓటిటి వెబ్ సిరీస్‌లు ప్రధాన కారణమని పలు అధ్యయనాలు చెప్తున్నాయి. చిన్నారులు ఎదుగుతున్న దశలో సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్‌లకు బానిసవడం వలన వారిలో విపరీత ప్రవర్తన, దూకుడు స్వభావం పెచ్చురిల్లుతుంది. పగ, శత్రుత్వం, దాడుల కు పుసిగొలుపుతున్నాయి. తద్వారా నేరాల బారిన పడుతున్నారు. కొన్నిసార్లు ఇవి శాంతిభద్రత సమస్యలుగా మారుతున్నాయి. సామాజిక మాధ్యమాలు తరచూ వీక్షించడం వలన పిల్లల్లో ఓపిక, సహనం, ఆలోచన శక్తి నశిస్తుంది. విద్య విషయాలలో వెనకబడుతున్నారు. విలువలు పతనమవుతున్నాయి. పిల్లలు పెద్దలపట్ల గౌరవం, మర్యాద లేకుండా ప్రవర్తిస్తున్నారు.

ప్రస్తుతం వాట్సప్, ఫేస్‌బుక్, ఎక్స్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి ఆన్‌లైన్ వేదికలు సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ సంబంధిత విషయాల తెలుసుకోవడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో అణచివేతకు గురైన వర్గాల గొంతును వినిపిస్తున్నాయి. సామాజిక చైతన్యానికి ఊపిరిలూదుతున్నాయి. వీటిద్వారానే కొన్నిసార్లు ప్రభు త్వం, అధికారుల స్పందన కూడా ఉంటుంది. ఒకప్పుడు పెద్దలకే పరిమితమైన ఈ ఆన్లైన్ వేదికలు ఇప్పుడు పిల్లల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆటపాటలతో సాగే బాల్యం మొబైల్ స్క్రీన్ లో ఇరుక్కుపోయింది. వీటినుంచి పిల్లల్ని కట్టడి చేయడం తల్లిదండ్రులకు తలనొప్పిగా మారింది. సామాజిక మాధ్యమాలను నియంత్రించకపోతే భవిష్యత్తు భావి, పౌర సమాజం అంధకారమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు దేశాలు సామాజిక మాధ్యమాల నుంచి పిల్లలను దూరంగా చేయాలని ఆలోచిస్తున్నాయి. తల్లిదండ్రుల కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తున్నారు. గత ఏడాది ఆస్ట్రేలియా ప్రభుత్వం తమ దేశంలో 16 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించడంపై నిషేధం విధించింది. ఇప్పుడు ఫ్రాన్స్ కూడా అదే బాటలో నడిచే ప్రయత్నం చేస్తుంది. ఇటీవల తూర్పు ఫ్రాన్స్‌లోని నోజెంట్ పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థి దాడి ఘటన తర్వాత 15 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియా ను నిషేధించే యోచనలో ప్రభుత్వం ఉందని ఫ్రాన్స్ ప్రధాని పేర్కొన్నారు. ఈ విషయంలో ఇయు నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని లేదా తామే అమలు చేస్తామన్న ప్రకటించాడు. ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకున్న రెండో దేశంగా ఫ్రాన్స్ నిలిచే అవకాశం ఉంది. చిన్నారులు, యువతపై సామాజిక మాధ్యమాల దుష్ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఫ్రాన్స్ ప్రభుత్వం నిర్ణయంపై చర్చ జరుగుతుంది. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా సామాజిక మాధ్యమాల నియంత్రణపై ప్రపంచ దేశాలు ఆలోచిస్తున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా బాల జనాభా గల భారతదేశంలో బాలల్ని సామాజిక మాధ్యమాల వ్యసనం నుంచి దూరం చేయాలి. ప్రభుత్వపరంగా చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలి. 2023లో కర్ణాట క హైకోర్టు పాఠశాల పిల్లలు సామాజిక మాధ్యమాలకు అధికంగా వ్యసనం కావడం పట్ల ఆందోళనల వ్యక్తం చేసింది. ఈ మేరకు కోర్టు వీటిని వినియోగించడానికి 21 సంవత్సరాల వయోపరిమితిని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023 పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంలో కొన్ని షరతులను విధించింది. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు ఆన్లైన్ డేటాను నిర్వహించడానికి కంపెనీలు తల్లిదండ్రు ల సమ్మతి తీసుకోవాలని చెప్పింది. బాలల లక్ష్యంగా ఉండే ప్రకటనలపై పరిమితులు విధించింది. పిల్లల్లో నేర ప్రవృత్తి పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలను డిజిటల్ పరికరాలకు దూరం చేయడం ముఖ్యమైన అంశం. అప్పుడప్పుడు విద్యా అవసరాలకు వినియోగిస్తున్నప్పు డు ఏం చూస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలి. వారిలో విపరీత పోకడలను సరిదిద్దాలి. ఇంట్లో కుటుంబ సభ్యులు వారానికి ఒకసారి ఫోన్ హాలిడే పెట్టుకోవాలి. ఇటీవల ఛత్తీస్‌గఢ్ లోని రాజ్నంద్ గావ్ జిల్లా గహీరాబేడీ గ్రామ పంచాయతీలో పిల్లలు ఫోన్ గేములు ఆడితే తల్లిదండ్రులకు రూ.3,000 జరిమానా విధిస్తామని ఆంక్షలు పెట్టారు. దీంతో ఆ గ్రామంలో చాలావరకు మార్పు కనిపించింది. ఇలాంటి కట్టడి ప్రతి గ్రామంలో రావాలి. ఆన్లైన్ మనీ గేమ్ తో యువత ఆర్థికంగా నష్టపోతుంది. ఈ క్రమంలో ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన ఆన్లైన్ గేమ్ నియంత్రణ బిల్లు2025 ను ఆమోదించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు కుటుంబ బంధుత్వాలు, విలువల గురించి బోధించాలి. పిల్లలతో కలిసి ఆడుకోనివ్వాలి. భారత్‌లో సామాజిక మాధ్యమాలు బావ ప్రకటన స్వేచ్ఛలో భాగం. కానీ స్వేచ్ఛ పేరుతో మీతీమీరడం తగదు. కావున పిల్లలు, యువత బాధ్యతయుత వినియోగమే పరిష్కారం.

సంపతి రమేష్ మహారాజ్

# అపర కుబేరుల ప్రపంచంలో ఆకలికేకలు

మొత్తం ప్రపంచ సంపద 471 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నదని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. ఇందులో సుమారు 16 ట్రిలియన్ డాలర్ల సంపద సుమారు మూడువేల మంది కుబేరుల మధ్య కేంద్రీకృతం కావడం ఆలోచించదగ్గ విషయం.

కుబేరుల సంఖ్య పెరుగుతున్నా, ప్రపంచంలో పేదరికం మాత్రం పోవడం లేదు. ఈనాటికీ ప్రపంచంలో అత్యధిక శాతం మంది అత్యల్ప ఆదాయంతో జీవిస్తూ, జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు లేక చెట్ల క్రింద, ఫుట్ పాత్ ల మీద, మురికి వాడల్లోను అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నారు. కొన్ని దేశాల ప్రజలు తినడానికి తిండిలేక, త్రాగడానికి పరిశుభ్రమైన నీరు లేక అలమటిస్తున్నారు. ఎందుకింత ఆర్థిక అంతరాలు? దీనికి పరిష్కార మేమిటి? ప్రపంచంలో పేదరికంలో ప్రజలు మగ్గి పోవడానికి అవినీతి జాడ్యమే చాలావరకు కారణమని చెప్పక తప్పదు. అక్రమార్జనతో ధనికులుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతున్నదని అనేక గణాంకాలు సూచిస్తున్నాయి.



ఆర్థిక ఎదుగుదల అంటే అక్రమ సంపాదన కాదు. ప్రభుత్వ చట్టాలకు లోబడి,పన్నులు ఎగవేయకుండా తమ కష్టార్జితంతో, ప్రతిభతో ఆర్థికంగా ఎదగడంలో ఎలాంటి తప్పు లేదు. తెలివి తేటలు కూడా ఆర్థిక ఎదుగుదలకు ఒక ఉన్నతమైన మార్గం. అవినీతిని ప్రతిభగా వర్ణించడం హాస్యాస్పదం. రాత్రికి రాత్రే కుబేరులుగా మారిపోవడం, వివిధ మార్గాల ద్వారా, పైరవీల ద్వారా ధనవంతులు కావడం ముమ్మాటికీ అవీనీతే. శ్రమకు తగిన ప్రతిఫలం అన్ని వర్గాల ప్రజలకు లభించాలి. అవినీతిని అరికడితే ఆర్థిక అసమానతలు అంతరిస్తాయి. అన్ని వర్గాల ప్రజలకు అందరితో పాటు సమాన అవకాశాలు లభించాలి. ఇతరుల ప్రతిభను అణచివేయడం, అవినీతి సంపాదనతో కోట్లకు పడగలెత్తడం అందరి కష్టం సంపదగా మారి కొందరి జేబుల్లోకి పోవడం దుర్మార్గం. ఎక్కడైతే విలువలు నశించి,స్వార్థం జడలు విప్పి నర్తిస్తుందో, ఎక్కడైతే మానవత్వ ఛాయలు మటుమాయమై, ఆర్థిక దోపిడీ జరుగుతుందో, ఎక్కడైతే ఆయాచితంగా వచ్చే సంపదకోసం అర్రులు చాస్తారో, ఎక్కడైతే శ్రమకు విలువ నశించి, ఆర్థికంగా ఎదగడానికి మార్గం సులభతరమౌతుందో, ఎక్కడైతే ఇతరులను దోచుకుని ఎదగాలనే ఆలోచన వికృత రూపం ధరించి వికటాట్ట హాసం చేస్తుందో, అక్కడ అవినీతి విశృంఖల విహారం చేస్తుంది. వందమంది సొమ్మును ఒక్కరే గుటకాయ స్వాహా చేసి, ఆకాశహర్మ్యాలనంటే భవంతుల్లో రాజభోగాలను అనుభవించాలనే దురాలోచన వలన పలురకాల అరాచకాలు జరుగుతున్నాయి. అక్రమ ధనార్జనకోసం సాగే అవినీతి క్రీడలో జరిగే మహాపరాధాలకు ఎంతో మంది బతుకు చిత్రాలు తారుమారై పోతున్నాయి.

ఎన్నో జీవితాలు ఆర్థిక లేమితో చితికి పోయి, అల్లాడి పోతున్నాయి. అవినీతిలేని చోటంటూ ఎక్కడా లేదు. నీతికి గుక్కెడు గంజి దొరకదు. గజం జాగా కరువు. అవినీతికి ఆద్యంతాలు కనిపెట్టడం కష్టతరం. పేద, ధనిక, వర్ధమాన దేశాలన్నింటిలో అన్ని ంగాల్లో అవినీతి తాండవిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అవినీతిని నిర్మూలించడానికి, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను వక్రమార్గాలతో కొల్లగొట్టకుండా పారదర్శకత, జవాబుదారీతనంతో పరిరక్షించడానికి అంతర్జాతీయ సహకారం, సాంకేతిక సహాయం కోసం ప్రయత్నించి,అభివృద్ధి దిశగా ప్రపంచాన్ని నడపాలని ఐక్యరాజ్యసమితి చాలాకాలంగా కృషి చేస్తున్నది. అవినీతి అరికట్టడంలో ప్రభుత్వాల, పౌరసమాజం పాత్ర ఎంతైనా ఉంది. విద్యావంతులు, న్యాయవాదులు, పాత్రికేయులు సమష్టి బాధ్యత వహించి అవినీతి నిర్మూలనకు పాటు పడాలని అంతర్జాతీయ సమాజం ఆకాంక్షిస్తున్నది. ప్రపంచ సంపద కేవలం కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం కావడం ప్రపంచ ప్రగతికి సూచిక కాదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ప్రపంచ సంపద పెరుగుతున్నది. పెరిగిన సంపద కొద్దిమంది భోషాణాల్లో మూలుగుతుండడం పెరుగుతున్న ఆర్థిక అంతరాలకు ప్రత్యక్ష నిదర్శనం. బిలియనీర్ల సంఖ్య పెరుగుతున్నది. అదే సందర్భంలో జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు లేక కోట్లాది మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో మగ్గి పోతున్నారు. ఆర్థిక ఎదుగుదల మంచిదే. కాని అందని ద్రాక్షపండులా, ఎవరికీ ఉపకరించక, విదేశీ బ్యాంకుల్లో మూలిగే ట్రిలియన్ల సంపద వలన ఒరిగే ప్రయోజనం శూన్యం.

# వీధుల నిండా కుక్కలు, కోతుల గుంపులే!

కుక్క అంటేనే విశ్వాసానికి పర్యాయపదం. కుక్కలు అపూర్వ ప్రేమ ను కుమ్మరిస్తాయి. యజమానితో స్నేహం చేస్తాయి. అపరిచిత వ్యక్తుల రాకను సూచిస్తాయి, హెచ్చరిస్తాయి, అనుమానితున్ని కరిచే ప్రయత్నం కూడా చేస్తాయి. సాధు జంతువుగా కుటుంబ సభ్యుని వలె ప్రవర్తిస్తాయి. యజమాని బాధను కూడా అర్థం చేసుకుంటాయి. ఇంట్లో కుక్క ఉంటే ఆ ఇల్లు సందడిగా ఉంటుంది. అయితే కుక్కలతో సమస్యలు లేకపోలేదు. ప్రపంచవ్యాప్తంగా కోట్ల కొద్ది కుక్కలు ఉన్నా యి. 2019 వివరాల ప్రకారం భారత్‌లో దాదాపు 1.5 కోట్ల వీధి కుక్క లు ఉన్నట్లు గుర్తించారు. ఒక ఢిల్లీ ప్రాంతంలోనే జనవరి జూన్ 2025 మధ్య 35,198 మంది వీధి కుక్కల కాటుకు బలికావడం కలవరానికి గురి చేస్తున్నది. ఈ గణాంకాలు దేశవ్యాప్తంగా వీధి కుక్కల బెడదను వర్ణిస్తున్నాయి. పల్లె నుంచి పట్నం వరకు ఊరు, వాడా, నగర వీధుల్లో వీధి కుక్కల స్వైరవిహారాలు చూస్తున్నాం, భయపడుతూ తప్పించుకొని తిరుగుతున్నాం. ప్రతి కుక్కకాటు వల్ల సగటున రూ.5,128/– వైద్య ఖర్చులకు వినియోగించడం జరుగుతోంది. 2004 నుంచి ప్రతి ఏట 26 ఆగస్టున విశ్వవ్యాప్తంగా అంతర్జాతీయ కుక్కల దినం (ఇంటర్నేషనల్ డాగ్ డే) పాటించటం ఆనవాయితీ. వివిధ రకాల కుక్కలను సాదుకోవడం, ఆప్యాయంగా చూడడం, వాటిప్రేమను రుచి చూడడం, వీధి కుక్కలను మచ్చిక చేసుకోవడం, షెల్టర్‌లో ఉన్న శునకాలను సాదుకోవడం, కుక్కలకు వైద్య సేవలు అందించడం, మానసిక ప్రశాంతతను పొందడం లాంటి విషయాల్లో అవగాహన కల్పించడం లాంటివి చేపట్టడం జరుగుతున్నది. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఏ జంతువును కూడా చట్టవిరుద్ధంగా నిర్బంధించడం లేదా చంపివేయడం నిషేధం అని తెలుసు కోవాలి. కుక్కల బెడదను తట్టుకోవడానికి వాటికి ర్యాబిస్ టీకాలు ఇప్పించడం, సంతానం కలుగకుండా స్టెరిలైజ్ చేయడం జరగాలి. భారతంలో వీధివీధినా వీధి కుక్కల బెడద భయపెడుతున్నది. వీధి కుక్కలతో మానవాళికి ఒక ప్రమాదం ఉన్నది. భారతీయ రోడ్ల వెంట తిరుగుతున్న 10 మిలియన్ల కుక్కలతో పిల్లల నుంచి పెద్దలకు ఇబ్బందులు, కాటు చేయడం జరుగుతున్నాయి. కుక్క కాటు సమస్యకు పరిష్కారంగా వీధి కుక్కలకు టీకాలు వేయించడం, కుక్కలను స్టెరిలైజ్ చేసి సంతానోత్పత్తిని తగ్గించడం లాంటి చర్యలు తీసుకోవాలి. దీనికి ప్రభుత్వ చొరవ అత్యవసరంగా ఉంటుంది. వివిధ సంస్థల సమన్వయం, వెటర్నరీ సిబ్బంది అంకితభావం, పౌర సమాజ చొరవ, స్వచ్ఛంద సంస్థల సహకారం, సంబంధిత విభాగాల సహాయంతో కుక్కల బెడదకు చెక్ పెట్టవచ్చు.

(26 ఆగస్టు అంతర్జాతీయ కుక్కల దినం సందర్భంగా)

## ఇ వేస్ట్ – లిథియం బ్యాటరీలు పర్యావరణానికి ప్రమాదం

ఆధునిక సమాజంలో ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రిక్ వాహనాలు అనివార్యమైనవి. ఇవి మన జీవితాలను సులభతరం చేస్తున్నప్పటికీ, వాటి వ్యర్థాలు ముఖ్యంగా ఈవేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు), లిథియం బ్యాటరీలు పర్యావరణానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి. లిథియం బ్యాటరీలు, ఇవి స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ కార్లలో విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. వాటి ఉత్పత్తి, ఉపయోగం, నిర్వహణ పర్యావరణానికి హానికరమైనవి. ఈ వేస్ట్ అంటే పాత ఎలక్ట్రానిక్ పరికరాలు, వాటి భాగాలు, ఇందులో లిథియం, అయాన్ బ్యాటరీలు ముఖ్యమైనవి. ప్రపంచవ్యాప్తంగా, ఈ వేస్ట్ పరిమాణం వేగంగా పెరుగుతోంది. ఉదాహరణకు, 2019లో 53.6 మిలియన్ టన్నుల ఈవేస్ట్ ఉత్పత్తి అయింది. ఇది 2030 నాటికి 74 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంచనా వేయబడింది. లిథియం బ్యాటరీలు ఇందులో సుమారు 5–10 శాతం ఉంటాయి. ఈ బ్యాటరీలు లిథియం, కోబాల్ట్, నికెల్, కాపర్ వంటి భారీ లోహాలను కలిగి ఉంటాయి. ఇవి లీచింగ్ ప్రక్రియ ద్వారా మట్టి మరియు నీటిలో కలుస్తాయి. ఆస్ట్రేలియాలో, లిథియం బ్యాటరీలు 98.3 శాతం ల్యాండ్ ఫిల్లింగ్‌లకు వెళ్తాయి. ఇది అగ్ని ప్రమాదాలను పెంచుతుంది. విషపూరిత వాయువులను విడుదల చేస్తుంది. విశ్లేషణాత్మకంగా చూస్తే, లిథియం బ్యాటరీల పర్యావరణ ప్రభావం మూడు దశలలో విస్తరిస్తుంది: మైనింగ్, మాన్యుఫాక్చరింగ్ మరియు డిస్పోజల్. మైనిం గ్ దశలో, లిథియం సాల్ట్ బ్రైన్‌ల నుండి డ్రిల్లింగ్ ద్వారా సేకరించబడుతుంది, ఇది భారీ నీటి వినియోగాన్ని కలిగిస్తుంది. ఒక టన్ లిథియం కోసం 2 మిలియన్ లీటర్ల నీరు అవసరం ఉంటుంది. ఇది చిలీ అలాగే అర్జెంటీనా వంటి ప్రాంతాలలో నీటి కొరతను పెంచుతుంది.కోబాల్ట్ మైనింగ్, ముఖ్యంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో, బాల కార్మికులను ఉపయోగించడం, మట్టి కాలుష్యాన్ని కలిగిస్తుంది. మాన్యుఫాక్చరింగ్ దశలో, బ్యాటరీల ఉత్పత్తి ఇంధనఇంటెన్సివ్, ఇది గ్రీన్‌హౌస్ గ్యాస్ ఎమిషన్లను పెంచుతుంది. చైనాలో, బ్యాటరీల ఉత్పత్తి 60 శాతం కోల్ ఆధారిత విద్యుత్‌పై ఆధారపడుతుంది, ఇది ఫాసిల్ ఫ్యూల్ బ్యాటరీల కంటే మూడు రెట్లు ఎక్కువ ఎనర్జీని డిమాండ చేస్తుంది. డిస్పోజల్ దశలో, ల్యాండ్‌ఫిల్లులలో బ్యాటరీలు కుళ్ళిపోయి, విషపూరిత పదార్థాలు (కోబాల్ట్, నికెల్, లెడ్ లీక్ అవుతాయి, నీటిని, మట్టిని కలుషితం చేస్తాయి. అమెరికాలో, లిథియం బ్యాటరీలు హజార్డస్ వేస్ట్‌గా వర్గీకరించబడ్డాయి. ఎందుకంటే అవి లెడ్ కోబాల్ట్, కాపర్ వంటి లోహాలను విడుదల చేస్తాయి కనుక. ఇవి రెగ్యులేటరీ లిమిట్లను మించిపోతాయి. విమర్శనాత్మకంగా చూస్తే, ప్రస్తుత వ్యవస్థలు అసమర్థమైనవి, అసమానమైనవి. రీసైక్లింగ్ రేటు తక్కువ. ప్రపంచవ్యాప్తంగా లిథియం బ్యాటరీలు కేవలం 5 శాతం మాత్రమే రీసైకిల్ అవుతాయి, మిగిలినవి ల్యాండ్‌ఫిల్లింగ్‌లకు వెళ్తాయి. పైరోమెటలర్జికల్, హైడ్రోమెటలర్జికల్ ప్రాసెస్‌లు ఉపయోగించబడుతున్నప్పటికీ, అవి ఎనర్జీఇంటెన్సివ్, సెకండరీ వేస్ట్ ఉత్పత్తి చేస్తాయి. ఈవేస్ట్, లిథియం బ్యాటరీలు పర్యావరణానికి తీవ్రమైన హాని కలిగిస్తాయి. ఇది పర్యావరణానికి హెచ్చరిక. మైనింగ్ నుండి డిస్పోజల్ వరకు ప్రభావాలు స్పష్టం. త్వరగా ఈ సమస్యలను పరిష్కరించకపోతే, సస్టైనబుల్ ఎనర్జీ టార్గెట్లు విఫలమవుతాయి.

దండెబోయిన అశోక్ యాదవ్,
9440521990.

## క్రీడా స్ఫూర్తితో రాణించాలి



ప్రజాపక్షం/చిట్యాల: ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని, ఆ స్ఫూర్తితో ఆటలు ఆడాలని జిల్లా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి చొల్లేటి యేగేంద్రనాథ్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడాపోటీలను మండల విద్యాధికారి సైదానాయక్‌తో కలిసిప్రారంభించారు. పాఠశాల స్థాయి నుండే క్రీడల్లో విద్యార్థులు రాణించాలన్నారు.వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి శ్రీధర్, పెద్ది నరేందర్, వేణుగోపాల్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, శ్రీదేవి, రమణ, జానకి, గఫార్, జోజిరాణి, శంబులింగం, జి రాము, లింగస్వామి, కల్పన పాల్గొన్నారు.

## ఎకో టూరిజంగా వైజాగ్ కాలనీ



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలోని నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్ కాలనీ వాసుల సమస్యల పరిష్కారం కొరకు సోమవారం దేవరకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎంఎల్ఏ నివాసం వద్ద ఎంఎల్ఏ బాలూనాయక్ సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఏ బాలూనాయక్ మాట్లాడుతూ వైజాగ్ కాలనీని రాష్ట్రంలోనే మొదటి ఎకో టూరిజం ప్రాంతంగా మార్చే కార్యక్రమం చేయబోతున్నామని, కాలనీ వాసులకు జీవన ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టబోతున్నామని ఎంఎల్ఏ తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మాజీ ఎంపీపీలు బిక్కు, నర్సయ్య, మాజీ వైస్ ఎంపీపీ పాపానాయక్, సిఐ బీసన్న, ఎస్‌ఐ యువజన కాంగ్రెస్ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

## గౌరవవేతనం రూ.5వేలు ఇవ్వండి



ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం మండల రేషన్ డీలర్లు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రదర్శన నిర్వహించి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు హరికృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నిక మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీలర్‌కు గౌరవ వేతనం రూ. 5వేలు మరియు 300 కమిషన్ ఇవ్వాలని, గత ఐదు నెలలుగా తమకు రావాల్సిన కమిషన్‌లు రాకపోవడంతో డీలర్ల పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని తక్షణమే పెండింగ్‌లో ఉన్న కమిషన్‌లను విడుదల చేయాలని కోరారు.అంజయ్య, నగేష్, మనోహర్, శ్రీరాములు, స్వామి, కృష్ణారెడ్డి, అశోక్, పురుషోత్తం, సువర్ణ, ఫాయిమీదా, సరస్వతి, కౌసల్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక ప్రశాంతత



ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ లెవల్ ఫెడరేషన్ గేమ్స్‌ను ఎంపిడివో దేవేందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విద్యార్థుల ఎంపిక కొరకు అండర్ 14, అండర్ 17 స్థాయిలో రెండు రోజుల పాటు గేమ్స్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రిడల్లో రాణించాలని క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం కలుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో మన్నె అగ్గిరాములు, ఎస్ఐ తేజం రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, పిఈటిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హన్యానాయక్‌కు ఎస్ఎంసి అవార్డు




ప్రజాపక్షం/ మిర్యాలగూడ: గత 15 సంవత్సరాలుగా సమాజ సేవకుడిగా మంచి గుర్తింపు పొంది అనాథలను చేరదీసి స్వచ్ఛందంగా ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ధీరావత్ హన్యానాయక్‌కు ఎస్ఎంసీ స్టార్ జాతీయ అవార్డును అందుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన సోమవారం ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఫలాన్ని ఆశించకుండా గత 15 ఏండ్లుగా విద్యా వైద్యా రంగంలో సేవలు అందించడం ద్వారా తనకు అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. తాను చేసే సామాజిక సేవలో తన కుటుంబసభ్యులు సైతం తనకు సహకరిస్తె తనను ప్రోత్సహించడం వల్లనే ఈ అవార్డు వచ్చిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తనకు అవార్డు రావడానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి విద్యార్థికి ఉద్యోగం, ఉపాధి




ప్రజాపక్షం/కోదాడ: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించటమే కోదాడ కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల లక్ష్యమని కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ అన్నారు. సోమవారం కళాశాలలో బిటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఉద్యోగం, ఉపాధి కల్పించే విధంగా విద్యను అందించడమే కళాశాల ధ్యేయమన్నారు. కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే మొట్టమొదటి మహిళ ఇంజనీరింగ్ కళాశాల అని అన్నారు. రెండు దశాబ్దాల నుండి వందలాది మంది విద్యార్థినులు ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకుని నేడు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారని వారిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యర్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. కళాశాలలో అర్హత కలిగిన అధ్యాపకులతో పాటు ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ వంటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అంతకు ముందు కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గాంధీ, వివిధ విభాగాధిపతులు రమేష్, నరేష్‌రెడ్డి, స్రవంతి, జనార్ధన్, ఎజాజ్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు సద్వినియోగం



ప్రజాపక్షం/కోదాడరూరల్: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. ఆడపిల్లలకు ప్రభుత్వం కల్పించే కళ్యాణలక్ష్మి చెక్కులను సోమవారం గణపవరం గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇర్ల సీతరామిరెడ్డి, ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ వాజీద్‌అలీ, పాలకి సురేష్, తొగర్రాయి వెంకన్న, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్ చట్టంపై అవగాహన ఉండాలి



ప్రజాపక్షం/ రామన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసు అధికారులు ర్యాగింగ్ నిరోధక చట్టం, ఫోక్సో చట్టం గురించి సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానమ్ ఆధ్వర్యంలో ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసుశాఖ వారు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రహత్‌ఖానమ్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ వంటి చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉండాలని, స్నేహభావం, సత్సంబంధాలు పెంపొందించుకోవాలని సూచించారు.

# ‘నల్లగొండ’లో వైద్యరంగం పటిష్టం

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ: ధనవంతుల మాదిరిగానే పేదవారికి అధునాతన వైద్య సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో నల్లగొండ జిల్లాలో వైద్య రంగాన్ని పటిష్టం చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో సుమారుకోటి రూపాయలతో ఏర్పాటు చేసిన లాప్రోస్కోపిక్ యూనిట్‌ను పద్మవిభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించగా, రాష్ట్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే గర్వించదగ్గ పద్మ విభూషణ్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అధునాతన వైద్య సదుపాయాలు కలిగిన లాప్రోస్కోపిక్ యూనిట్ ప్రారంభించడం సంతోషమన్నారు. ప్రధాన ఆస్పత్రిలో లాప్రోస్కోపిక్ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల చిన్న చిన్న ఆపరేషన్లను ఇక్కడే నిర్వహించే విధంగా, పేదవారికి మేలు చేసేందుకుప్రతీక్‌ఫౌండేషన్‌ద్వారాఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పద్మవిభూషణ్, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూప్రధాన ఆసుపత్రిలో అత్యాధునిక, ఉన్నత స్థాయి ప్రమాణాలు కలిగిన లాప్రోస్కోపిక్ యూనిట్ ఏర్పాటు చేయడం పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని అభినందించారు. తన తండ్రి ఆశయం మేరకు పేద ప్రజలకు సేవలు అందించడమే కాకుండా, వైద్య విద్యార్థులకు శిక్షణ, పరిశోధన వంటి వాటిలో తాను కృషి చేస్తున్నానని, అందులో భాగంగానే ఏఐజి ఆసుపత్రిని స్థాపించడం జరిగిందని తెలిపారు. ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, రెవెన్యూ అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, గ్యాస్ ఎంట్రాలజిస్టు డాక్టర్ జివిరావు,ప్రముఖ సామాజిక కార్యకర్త, చారిటీ నిర్వాహకులు ఎస్‌పి రెడ్డి,ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ మాతృనాయక్,వైద్య కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్, ఆర్‌డిఓ వై అశోక్ రెడ్డి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాధాకృష్ణ, డిప్యూటీ డిఎంహెచ్వోలు, డాక్టర్లు పాల్గొన్నారు.

# గురుకులాల్లోనే భవిత

### కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్





ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:గురుకులాల్లో చదివిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉంటారని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కోహన్స్ స్వచ్ఛంద సంస్థ 12 లక్షల రూపాయల విలువ చేసే 276 డ్యూయల్ డెస్క్ బెంచీలను చివ్వెంల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలకు వితరణ ఇవ్వగా ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటారని, అందరికన్నా చురుకుగా, బాధ్యతగా వ్యవహరిస్తారని, ఉదయం లేచిన దగ్గర నుండి మొదలు రాత్రి పడుకునే వరకు వారే తమ బాధ్యతలను స్వీకరిస్తారని అన్నారు. అందువల్ల భవిష్యత్‌లో వీర ఉన్నత స్థానంలో నిలుస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు. చివ్వెంల రెసిడెన్షియల్ పాఠశాలకు గత సంవత్సరం చిన్న చిన్న టాయిలెట్స్ పైప్‌లైన్ నిర్మాణం, ఇతర మరమ్మతులకై రాష్ట్ర ప్రభుత్వం కోటి 16 లక్షలు రూపాయల మంజూరు చేసిందని, టెక్నికల్ అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని ప్రిన్సిపాల్‌ను, ఆర్‌సివోలను అదేశించారు. పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేయాలన్న విద్యార్థుల కోరిక మేరకు ప్రణాళిక రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్‌సివోను అదేశించారు. రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ చివ్వెంల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను రాష్ట్రస్థాయిలో మోడల్‌గా నిలపాలన్నదే తమ ధ్యేయమన్నారు. కోహన్స్ సంస్థ 12 లక్షల రూపాయలతో 276 డ్యూయల్ డెస్క్ బెంచీలు ఇవ్వడం పట్ల ఆయన వారిని అభినందించారు. త్వరలో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు కానుందని, స్పోకెన్ ఇంగ్లీష్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.స్ప్రెడ్ ఇండియా పౌండర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌సివో విద్యారాణి, మాజీ కౌన్సిలర్, పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

# ‘భగీరథ’ నీళ్లు రాక బిందెలతో నిరసన



ప్రజాపక్షం/నూతన్‌కల్: మండల పరిధిలోని ఎర్రపహడ్ గ్రామానికి మిషన్ భగీరథ నుండి వచ్చే తాగునీరు గత కొన్ని రోజుల నుండి సరఫరా కాకపోవడంతో సోమవారం పంచాయతీ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో గ్రామస్తులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శుద్ధమైన తాగునీటిని అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వం హామీ ఒలికిపోతున్న నేపథ్యంలో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు తాగునీటి హామీలతో మా వద్దకు వచ్చే నాయకులు, ఇప్పుడు మాకు కనీసం తాగునీరు కూడా అందించలేకపోతున్నారని అన్నారు. మిషన్ భగీరథ కింద నీళ్లు రావాలి అంటే ఇలా ధర్నా చేయాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుందని వారు ప్రశ్నించారు. మహిళలు, వృద్ధులు చిన్న పిల్లలు సైతం నిరసనలో పాల్గొన్నారు. పంచాయతీ సిబ్బంది, అధికారులపై నిరసన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం మాత్ర శూన్యమని ఆగ్రహించారు. అధికారులు తక్షణమే స్పందించి మిషన్ భగీరథ నీటిని సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గాదుదుల రజిత లింగరాజు, ఇరుగు అంజయ్య,నారాయణ,అనిల్, లింగయ్య, ఎస్ఎంసి మాజీ చైర్మన్ అంజయ్య, రామస్వామి, సందీప్‌కుమార్, వెంకటయ్య, లింగయ్య, మహేష్, ఉపేంద్ర, సూరమ్మ, సైదమ్మ, గౌరమ్మ, పద్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

## ఒకేషనల్ కాలేజ్‌ను సీజ్ చేయాలి : ఎఐఎస్ఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/డిండి: డిండి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులను యాజమాన్యం స్కాలర్ షిప్ రాలేదని ఫీజులు కట్టాలని వేధిస్తున్నారని, విద్యార్థులు రోజు కళాశాల ముందుకు వచ్చి గేట్ పెట్టడంతో తిరిగి వెళుతున్నారని, కళాశాలలో 3 కోర్సులు ఉంటే 9 మంది అధ్యాపకులు ఉండాల్సిన చోట కేవలం ముగ్గురితోనే నడిపిస్తూ ప్రిన్సిపాల్ మాత్రం నెలలో ఒకటి రెండు సార్లు మాత్రమే కళాశాలకు వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధించకుండా నే వెళ్ళిపోతారని, విద్యార్థులు అడిగితే వారిని బెదిరిస్తున్నారని అన్నారు. కళాశాలలో కనీస సౌకర్యాలు లేవని, కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు ఇవ్వకుండా నెలల తరబడి వారిని ఇబ్బందులు పెడుతున్నారని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కళాశాలను సీజ్ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈధర్నా కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సూరిగి వినయ్, విద్యార్థులు కళ్యాణ్, పవన్, రాజు, సాయి, శిల్ప, శీరిష, శివాని తదితరులు పాల్గొన్నారు.

## బిసిల ఆరాధ్యదైవం బిపి మండల్



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: బిసిల ఆరాధ్యదైవం బిపి మండల్ అని బిసి జెఎసి జిల్లా అధ్యక్షులు భద్రబోయిన సైదులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలకు బిసిలకు స్పూర్తిగా అశాజ్యోతిగా నిలిచారని కొనియాడారు. చిన్న తరం నుండి రాజకీయాలకు ఆకర్షితులై వార్డు మెంబర్ స్థాయి నుండి ముఖ్యమంత్రి స్థాయి వరకు ఎదిగిన గొప్ప మహనీయుడు అని, బిసిల తొలి ముఖ్యమంత్రిగా ఎన్నిక కాబడిన గోప్ప యోధుడు అన్నారు. వారు కలలు గన్న సమాజ స్థాపనకై వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ వారి విశిష్ట సేవలను వారి చేసిన బిసి సిపార్సులను ముందు తరాలకు స్పూర్తి క లిగించే విధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పోరాటాలు చేయాలని అన్నారు. యాదవ రా జ్యాధికార సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడుగుల నాగార్జునయాదవ్, తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాగం రాజశేఖర్‌యాదవ్, బిజి జెఎసి నాయకులు మదనచారి, నాగేంద్రబాబు, శ్యామ్, ముత్యం నాగేంద్రబాబు, కిరణ్, కొమ్ము నాగయ్య, నరేష్ పాల్గొన్నారు.

## మట్టి గణపతులు మేలు



### భువనగిరి కలెక్టర్ హనుమంతరావు

ప్రజాపక్షం/యాదాద్రి : మట్టి గణపతులను ప్రతిష్ఠించడం వలన పర్యావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని, పర్యావరణ పరిరక్షణకు అందరం పాటుపడాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. సోమవారం ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పండగను పురస్కరించుకొని జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ సహకారంతో జిల్లాకు సరఫరా చేసిన 2000 వినాయక మట్టి ప్రతిమలను జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములు కావాలన్నారు. వివిధ రంగుల వినాయక ప్రతిమల ద్వారా వివిధ విష రసాయనాల వలన జలాన్ని శుద్ధి చేసే నీటిలోని క్రిమి కీటకాలు చనిపోయే ప్రమాదం ఉన్నందున్నారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానికసంస్థల అదనపు భాస్కరరావు, జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారినాగిరెడ్డి, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ వెంకన్న, బీసీ సంక్షేమ అధికారి సాహితి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



ప్రజాపక్షం/యాదాద్రిః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మినీ మీటింగ్ హాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనుల పురోగతి పై యంపిడిఓ, మున్సిపల్ కమిషనర్లు, యంపిఓలు, హౌసింగ్ సిబ్బందితో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రగతిని మండలాల వారీగా ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంత రావు సమీక్షించారు. రాష్ట్ర విప్ ఆలేరు శాసన సభ్యులు మాట్లడుతూ జిల్లాలో ప్రతి మండలంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబదించిన పురోగతి పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 9398 ఇండ్లు మంజూరు కాగా, 7719 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మార్కౌట్ చేపట్టడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద లబ్దిదారులకు నీడ కల్పించాలనే గొప్ప ఉద్దేశ్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే విధంగా లబ్దిదారులును ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. ఇప్పటి వరకు మంజూరు అయిన ఇళ్లన్ని 100 శాతం పనులు ప్రారంభం కావాలని తెలిపారు. చాలా మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులు పూర్తి చేసుకోవడానికి ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణపు పనులు బట్టి వారి ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, జెడ్పి సీఈవో శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయసింగ్, ఏఈ శ్రీరాములు, ఎంపీడీవోలు, కమిషనర్లు పాల్గొన్నారు.

## డిఎస్ రెడ్డికి ఘన నివాళి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి దండా సత్యనారాయణ రెడ్డి (డిఎస్ రెడ్డి) మరణం కార్మిక లోకానికి తీరని లోటని ఏఐటీయూసీ సినియర్ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు అన్నారు. డిఎస్‌రెడ్డి పార్థివ దేహం పై ఏఐటీయూసీ జెండా కప్పి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి సంస్థలో కండక్టర్ గా విధులు నిర్వహిస్తూ ఎంప్లాయిస్ యూనియన్‌లో డిపో కార్యదర్శిగా,రీజియన్ కార్యదర్శిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు గా కార్మిక వర్గానికి మంచి సేవలు అందించాలని కొనియాడారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ మరణించడం బాధాకరమని ఆయ న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కేస్ రెడ్డి,జంగమ్మ,జాబిర్, ఏడి రెడ్డి, సిహెచ్ గురవయ్య, ఎం నందం, బి వెంకటయ్య,పి వై రెడ్డి ,బి శంకరయ్య ,కే నారాయణ, ఎస్‌వి రెడ్డి,రామిశెట్టి ,ఎంకే రెడ్డి ,బాబు, టిఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పురాతన బంగారు నాణేల విక్రయ కేసు ఛేదన

### నలుగురు నిందితుల అరెస్టు
### రూ.13.25 లక్షల నగదు స్వాధీనం



ప్రజాపక్షం/చివ్వెంల: పురాతన నాణేలు అమ్ముతామని నమ్మబలికి రూ.20 లక్షలు మోసపూరితంగా దోచుకున్న నలుగురు నిందితులను మండల పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి రూ.13.25 లక్షల నగదును స్వాదీనం చేసుకున్నారు. సోమవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తుమ్మల పెన్‌పహడ్ గ్రామానికి చెందిన నిమ్మనగోటు వెంకటేశ్వర్లు అనే వ్యాపారి మండల పరిధిలోని దురాజ్‌పల్లి శివారులో హోటల్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తన హోటల్ వద్దకు అదే గ్రామానికి చెందిన పశుపుల గణేష్, ఓర్సు చంటి అనే ఇద్దరు నిందితులు తమ వద్ద పాత బంగారు నాణేలుఉన్నాయని, తక్కువ ధరకు అమ్ముతామని నమ్మబలికి రూ.20 లక్షల బేరం కుదుర్చుకున్నారు. ఈనెల 10వ తేదీన బయానరూపంలో రూ.5 లక్షలు ఇవ్వగా, మరుసటి రోజు రూ.15 లక్షలు ఇచ్చారు. ఆ డబ్బులు చెల్లించిన తర్వాత బంగారు నాణేలు ఇవ్వమని అడగ్గా విచిత్రమైన వీడియోలు పంపి గుర్తు తెలియని వ్యక్తులు మా వద్ద డబ్బు దోచుకున్నారని చెప్పారు. మరో పదివేలు ఫోన్ పే చేయాలని భయపెట్టడంతో ఆవి కూడా పంపడం జరిదింది. దీంతో తనకు జరిగిన మోసాన్ని హోటల్ యాజమాని పోలీసులకు పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన ఎస్‌ఐ మహేశ్వర్ డిఎస్‌పి ప్రసన్నకుమార్ అదేశాల మేరకు రూరల్ సిఐ రాజశేఖర్ ల పర్యవేక్షణలో కేసును విచారణ చేపట్టారు. ఇందులో మొత్తం 9 మంది ఉన్నట్లు గుర్తించి దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన పసుపుల గణేష్, ఓర్సు చంటి, ముద్దంగుల వెంకన్న, పసుపుల సత్యం లను అరెస్టు చేశారు. ఈ కేసులో సంబంధం ఉన్న పసుపుల నవీన్, ఓర్సు శ్రీను, ఓర్సు గోపమ్మ, పసుపుల లక్ష్మి , ముద్దంగుల అంజలిలు పరారీలో ఉన్నారు. వీరి నుండి 13.25 లక్షలను స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పురాతన నాణేలు, ఖజాన, త్వరలో డబ్బులు వస్తాయని ఎవరైనా నమ్మ బలికితే మోసపోవద్దని కోరారు. కేసును చేధించిన ఎస్‌ఐ మహేశ్వర్, అతని సిబ్బందిని అభినందించారు.

## ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణ దాతలుగా మారాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి సూచించారు. బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో సోమవారం నారాయణపేట శాఖ కార్యాలయ ఆవరణలో మహా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కె.రాజ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో మహా రక్తదానాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు. సంస్థ చేస్తున్న సేవలకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. అంతకుముందు జరిగిన పూజలో పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను రాజ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మ కుమారిస్ రాజ్ కుమార్ రెడ్డికి మిఠాయిలు తినిపించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో బీకే.జయ, బీకే, అనసూయ, ఆత్మీయులు బీకే.నరేందర్, బీకే. వెంకటేష్, రాఘునాథ్, ప్రభులింగం, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## చెరువు కట్ట తెగి దారి పొడవునా నీరు



**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పంచదేవ్ పహాడ్ గ్రామంలో వర్షాల కారణంగా చెరువు కట్ట తెగిపోయి డొంగు రోడ్డు మొత్తం నీరుతో నిండిపోయింది. చుట్టు పక్కల ఉన్న పొలాలు నీరు నిలిచిపోయిందని అటువైపు పంట పొలాలకు వెళ్తున్న రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున గ్రామ, మండల అధికారులు చెరువు కట్టని పరిష్కరించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.



## బిపి మండల్‌కు భారతరత్న ఇవ్వాలి

**ప్రజాపక్షం/జడ్చర్ల:** బిసి రిజర్వేషన్ ప్రదాత బిందేశ్వరి ప్రసాద్ మండల్ 107వ జయంతిని పురస్కరించుకుని సిగ్నల్ గడ్డ దగ్గర మండల్ కమిషన్ చైర్మన్ బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రజా సంఘాల నాయకులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్, ఎడ్ల బాలవర్ధన్ గౌడ్, నడిమింటి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ రాములు, ఎమ్మార్పీస్ నాయకులు జంగయ్య, వడ్లని శేఖర్ యాదవ్, జక్కా చంద్రమోహన్, జహంగీర్ పాష, రఘుపతి రెడ్డి, ఉమా శంకర్ గౌడ్, ఇంతియాజ్, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పార్లమెంటు సభ్యులు సంఘసంస్కర్త బీహార్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ బిందేశ్వర్ ప్రసాద్, మండల్ కమిషన్ నివేదిక ఆధారంగానే ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమలవుతున్నాయని మండల కమిషన్ నివేదికను సంపూర్ణంగా పార్లమెంటులో అమలు చేసి విద్యా, ఉద్యోగ, రాజకీయ ఆర్థిక, పారిశ్రామిక, రంగాలలో జనాభా దామాషా నిష్పత్తిని సమానవాట కల్పించాలని కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలను డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లెమోని నిరంజన్, గొడుగు నరసింహులు, సురభి విజయ్‌కుమార్, లింగంపేట్ శేఖర్, ఇంతియాజ్, పోలేపల్లి రాఘవేందర్, అంజి, నాగేష్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియాతో ప్రయోజనాలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** నానోయూరియా, ఎరువులు వాడటం ద్వారా రైతులకు అనేక లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నందివడ్డెమాన్ గ్రామంలో సోమవారం వివిధ రైతుల వ్యవసాయ పొలాలలో నానోయూరియాను పిచికారిచేశారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ నానో ఎరువులను ప్రవేశపెట్టడం ద్వారా రైతులకు ఖర్చు తగ్గించి పంట దిగుబడిని పెంచడమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చున్నారు. 500మిల్లీలీటర్ల నానో యూరి యా ఒకబస్తా 45కిలోల యూరియాతో సమానమన్నారు. నానో యూరి యా మొక్కకు నత్రజనిని అందించడం వలన యూరియా వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చున్నారు. నానో యూరియా వాడకంవల్ల పంటదిగుబడి 8శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. నేల, గాలి, నీరుకలుషిత వాతావరణాన్ని తగ్గిస్తుందన్నారు. రైతుకు శ్రమ తగ్గడంతోపాటు మొక్క అవసరం మేరకు మాత్రమే నత్రజని తీసుకుంటాయని సూచించారు. పంట విత్తిన 20రోజుల తర్వాత రెండు సార్లు పిచికారి (పంటపూత దశకంటే ముందు) సూచించడం జరిగింది. 2మిల్లీలీటర్ నీటికి కలిపి పంటపై పిచికారి చేయవచ్చన్నారు.

## కల్వకుర్తిలో టాస్క్‌బృందం పర్యటన



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి చొరవతో పట్టణంలో టాస్క్ బృందం సిఇఓ శ్రీకాంత్‌సిన్హా, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిలు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్కిల్ సెంటర్ ద్వారా స్థానిక యువతకు కంప్యూటర్‌శిక్షణ, టెక్నికల్ కోర్సులు, పరిశ్రమలకు సంబంధించిన ప్రత్యేక నైపుణ్యశిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఈసెంటర్‌ను ఏర్పాటు చేయనుందన్నారు. ముఖ్యంగా కంపెనీల అవసరాలు తెలుసుకొని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు మంచి అవకాశాలు కల్పించడమే కల్వకుర్తిలో ఏర్పాటు చేయబోయే స్కిల్‌సెంటర్ యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టాస్క్ రీజినల్ హెడ్ నవీన్‌రెడ్డి, 15వవార్డు మాజీకౌన్సిలర్ షానావాజ్‌ఖాన్, రజియాబేగం, ఐక్యతఫౌండేషన్ సభ్యులు జైపాల్‌రెడ్డి, శ్రీరాములు, నరేందర్‌గౌడ్, గణేష్, శ్రీపతి,శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలు వాడుదాం

### డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భరత్ కుమార్

**ప్రజాపక్షం/మద్దూర్ :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాబోయె వినాయక చవితి సందర్భంగా ప్రజలు మట్టి విగ్రహాలను మాత్రమే వినియెగించుకోవాలని సోమవారం రోజు డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భరత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏడాది ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) విగ్రహాల వల్ల జలమార్గాలు చెరువులు, వాగులు, నదులు తీవ్రంగా కలుషితం అవుతున్నాయి. ఆ రసాయనాల ప్రభావం వల్ల చేపలతో పాటు నీటి జీవ వ్యవస్థ మొత్తం నాశనమవుతుంది. భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడాలంటే మట్టి విగ్రహల వినియెగం తప్పనిసరి అని అన్నారు. విగ్రహాల రూపకల్పనలోనూ వాటి వినియోగంలోనూ స్థానిక కూలీలు, శిల్పులు, మట్టి కార్మికులు ఆధారపడతారని, మట్టి విగ్రహలు వాడటం వల్ల వారికి ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్బంలో యువతను పర్యావరణ పరిరక్షణలో ముందుండి అవగాహన కల్పించాలని, ప్రతి ఇంటా మట్టి విగ్రహలను ప్రతిష్టించాలని ఆయన పిలుపునిచ్చారు.

## బంగారు మైసమ్మ బోనాలు



**ప్రజాపక్షం/జడ్చర్ల:** శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ బోనాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత మరియు కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, కుమ్మరి రాజు, సుంకసారి రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుక్క వెంకటేశం, మాజీ వార్డు మెంబర్ భాస్కర్ రెడ్డి, బుక్క చెన్నయ్య, చిట్టమోని రమేశ్, భరత్, అంజి, చట్టమోని వెంకటయ్య, శివ, శ్రీకాంత్, చంద్రమౌళి, తుంగ రఘు, చాగంటి రఘు, రాజీవ్ నగర్ కాలనీ మహిళలు ఆలయ కమిటీ సభ్యులు బోనాల సందర్భంగా విచ్చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత కి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్చర్ల ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగింది.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

### కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా వ్యాధులు రాకుండా నివారించవచ్చని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా వాణి అనంతరం సీజనల్ వ్యాధులు వ్యాప్తి, ముందస్తు జాగ్రత్త చర్యలపై సమీక్షించారు. పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖలు వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో పారిశుద్ధ్య చర్యలు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదు కాకుండా ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఇండ్లల్లో నీరు నిల్వ ఉండడం వలన దోమలు లార్వా వృద్ధి చెంది దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా, మెదడు వాపు, చికెన్‌గున్యా వ్యాప్తి చెందుతున్నట్లు తెలిపారు. అందుకే దోమలు నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కె.కృష్ణ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 86 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగులో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తు పరిష్కరించాలని ఆదేశించారు. బేకరిలో శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలకు సర్టిఫికెట్‌లు ప్రధానం చేసిన కలెక్టర్ ఈ సందర్భంగా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ద్వారా స్వయం సహాయకమహిళలు బేకరిలో నాలుగు రోజులు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లను కలెక్టర్ అందజేశారు. ఈ శిక్షణలో బేకరి వస్తువులు బిస్కెట్‌లు కేకులు తదితర 16 రకాల వాటిలో శిక్షణ పొందారు. చేయూత పెన్షన్ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌లు ఫేషియల్ రికగ్నిషన్ అప్ ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఫోన్ ద్వారా యాప్‌లో క్యాప్చర్ చేసేందుకు ప్రభుత్వం ద్వారా సమకూర్చిన శాంసంగ్ మొబైల్ షోన్‌లు 167, ఫింగర్ క్యాప్చర్ మంత్ర డివైస్‌లు కలెక్టర్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ మంత్రి డివైస్‌లు కలెక్టర్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ లకు అందజేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్పిసి ఈఓ వెంకటరెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, ఆర్‌డిఓ నవీన్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, అదనపు పిడి శారద, డిపిఎం రాము తదితరులు పాల్గొన్నారు.



**కలెక్టరేట్‌లో మట్టి గణపతుల పంపిణీ**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో వినాయక చవితి వేడుకను పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు, ఉద్యోగులకు మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలకు కాలుష్య నియంత్రణ మండలి ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యత కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర రసాయనిక రంగులతో రూపొందించిన విగ్రహాల కారణంగా జల వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిని ఇందిర, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో రూ.26.60 లక్షలతో చేపట్టే గ్రౌండ్ లెవలింగ్/అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణ పనులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం పర్ణికా రెడ్డి శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులకు సంబంధించిన నిధులను యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో సిఎస్ఆర్ ఫండ్స్ నుంచి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి మాట్లాడుతూ నారాయణపేట క్రీడలకు, క్రీడాకారులకు నిలయమని, ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో తమ క్రీడా ప్రతిభను చాటారని తెలిపారు. క్రీడల శాఖ మంత్రిగా మన జిల్లాకు డాక్టర్‌॥ వాకిటి శ్రీహరి ఉన్నారని, రాబోయే రోజుల్లో క్రీడలకు మహర్దశ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, పీఆర్ఈ.ఈ హీర్యానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, డివైఎస్ఓ వెంకటేష్, పిడి సాయినాథ్ , బాలరాజ్, అక్తర్ పాషా, దత్తు రావు, కాంగ్రెస్ పార్టీ నగర ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



**ఖోఖో ఆడిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సోమవారం అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం పర్ణికా రెడ్డి మైదానంలో పాఠశాల విద్యార్థినులతో కలిసి ఆటవిదుపుగా సరదాగా కాసేపు ఖోఖో ఆట ఆడి విద్యార్థినిలలో ప్రోత్సాహాన్ని నింపారు. ఆట లో క్రీడా స్ఫూర్తిని చాటిన ఎమ్మెల్యే చివరి వరకు అవుట్ కాకపోవడం గమనార్హం.

# కూలీ రేట్ల పెంపునకు అంగీకారం




ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్


**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం ఆర్టీసీ ప్రధాన బస్టాండులోని కార్గో లాజిస్టిక్ కేంద్రంలో పనిచేస్తున్న హమాలి కార్మికుల కూలీరేట్ల పెంపుకై ఎఐటియుసి నేతలు ప్రైవేట్ గుత్తేదారు మధ్యలో జరిగిన చర్చలు సఫలం అయ్యి హమాలి కార్మికులు కూటీ రేట్లు 70 శాతం పెంపుకు అంగీకారం కుదిరిందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్ తెలిపారు. తెలంగాణ ఆర్టీసీ మహబూబ్‌నగర్ కార్గో లాజిస్టిక్ కేంద్రంలో పనిచేస్తున్న హమాలి కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని గత వారం రోజుల క్రితం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అందజేసిన నోటీసు నేపథ్యంలో సోమవారం ఆర్టీసి మహబూబ్‌నగర్ లాజిస్టిక్ కేంద్రంలో ఏఐటీయూసీ కార్యదర్శి పి.సురేష్ నేతృత్వంలో లాజిస్టిక్ కేంద్రంలో కార్గో కాంట్రాక్టర్ బాల్‌రాజు యాదవ్, ఏఐటీయూసీ జిల్లా నేతలు కార్గో హమాలి కార్మికులు మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో కార్గో కాంట్రాక్టర్ బాల్‌రాజు యాదవ్ 70 శాతం కూలి చెల్లించేందుకు అంగీకారం తెలిపి, పెంచిన కూలీరేట్లు కూడ నేటి నుండే అమల్లోకి తెస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఆర్టీసీ ప్రధాన బస్టాండులో హమాలి కార్మికులు దాదాపు 40 సంవత్సరాలుగా చాలీచాలని కూలీరేట్లతో పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మానవత దృక్పథంతో హమాలి కార్మిక చట్ట ప్రకారం కనీస వేతనాల అమలయ్యే విధంగా కూలీ రేట్లు ఐదు కిలోల పైబడిన వస్తువులన్నింటికి 15 రూపాయలకు పెంచాలని, హమాలి కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు చేశారు. కూలీరేట్ల పెంపుకు అంగీకరించిన కార్గో ఏజెన్సీ కాంట్రాక్టర్ బాలరాజు యాదవ్‌కి ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు వై.రంగన్న, శంకరయ్య, లాజిస్టిక్ కేంద్ర హమాలి కార్మికులు అంజి, రాములు, రవి, నరేష్,సతీష్, కృష్ణ, పాష , సుధీర్, గిరి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు లేక ఇక్కట్లు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మిషన్ భగీరథ పథకంలో కార్మికులుగా పని చేస్తున్న తమకు ఏడు నెలలుగా వేతనాలు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కాంట్రాక్టర్కు పలుమార్లు మొర పెట్టుకున్న పట్టించుకోవడం లేదని తమను ఆదుకోవాలని కోరుతూ కార్మికులు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం అందించి మొర పెట్టుకున్నారు. మిషన్ భగీరథ పథకం బాధ్యతలను నిర్వహిస్తున్న చల్లా కంపెనీ కాంట్రాక్టర్లతో ఎన్నిసార్లు అడిగిన ఏ మాత్రం స్పందించడం లేదని సిఐటియూ వనపర్తి జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, సిఐటియూ జిల్లా అధ్యక్షులు రమేష్ అన్నారు. జిల్లాలో ఉన్న మిషన్ భగీరథ స్కీమ్ కింద పని చేస్తే కార్మికులకు మెగా కంపెనీలో ఉన్నవారికి ప్రతి నెల మాత్రం ఏడు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ యూనియన్ సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రాములు, నాయకులు లోకనాయుడు, చంద్రాయుడు, రవి, హరీఫ్, వెంకటేష్, వెంకటయ్య, కురుమూర్తి, నర్సింహ, నరేష్ , భూపతి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



**ప్రజాపక్షం/అమరచింత :** అమరచింత మండల పరిధిలో రేషన్ డీలర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల కమిషన్ డబ్బులను చెల్లించాలని కోరుతూ సోమవారం మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పద్ధతిలోనే రేషన్ డీలర్లకు కమిషన్ డబ్బులు చెల్లించాలని ఆయన కోరారు. ఇప్పటికి పెండింగ్ లో ఉన్న ఐదు నెలల కమిషన్ డబ్బులను తక్షణమే చెల్లించాలని అన్నారు. చాలీ చాలని కమీషన్‌లతో కొనసాగుతున్న రేషన్ డీలర్లపై పాలక ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్లు రాములు, ఆదాం, వెంకటేష్, కృష్ణయ్యగౌడ్, శాంతన్న, భక్తరాజు, నరేష్, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూ మాఫియాకు పేద రైతులు బలి

**ప్రజాపక్షం/కృష్ణ:** నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని ప్రభుత్వ అసైన్డ్ భూములపై గతంలో జరిగిన అక్రమాల పట్ల తగు చర్యలు తీసుకోవాలని బీజేపీ కృష్ణ, మాగనూర్ ఉమ్మడి మండల శాఖ ఆధ్వర్యంలో కృష్ణ మండల తహసీల్దార్‌కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. కృష్ణ నదిపరివాహిక ప్రాంతం అయిన కృష్ణ మండలంలోని గురజాల గ్రామంలో గల SYనెం. 169 గల అసైన్డ్ భూములను 1988లో ఆయా గ్రామాలలో గల నిరుపేదలకు ప్రభుత్వం కేటాయించింది. ఈ ప్రభుత్వ భూమిని 1997లో అప్పటి రెవెన్యూ అధికారులతో డబ్బు పరపతిని ఉపయోగించుకుని ఉమ్మడి ఆంధ్రకు చెందిన మండవ లక్ష్మి నారాయణ అనే మాజీ ఐజి పోలీస్ అధికారి అక్రమదారులు ఉపయోగించుకుని రికార్డులు అని తారుమారు చేశారు. అసలు ఈ ప్రాంతానికి చెందని స్థానికేతరులైన తన బినామీల పేరిట పట్టా ఇప్పించారు. స్థానికేతరులైన వీరి బినామీలు అక్రమంగా యాజమాన్య హక్కును కల్పించుకోని చిట్ట విరుద్ధంగా ఈ ప్రభుత్వ భూమిని అనుభవిస్తూ, అసలైన నిరుపేద రైతుల పొట్ట కొట్టి కోట్లకు కోట్లు కూడగట్టుకుంటున్నారు. నిజమైన రైతులను కాస్తూ నుంచి తప్పించుటకు పోలీసులు, అధికారులు అట్టి అక్రమ వలసదారులకు వత్తాసు పలకడమే కాకుండా, తిరిగి అన్యాయానికి గురైన రైతుల పైనే అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిస్తున్నారు. కనుక ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోని విచారణ చేపట్టి నిజమైన అర్హులైన ఆ నిరుపేద రైతులకు యాజమాన్య హక్కు కల్పించి తగు న్యాయం చేకూర్చాలని ఉమ్మడి కృష్ణ మాగనూర్ మండలాల బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప, జిల్లా నాయకులు మజ్జిగ సురేష్, మండలం ప్రధాన కార్యదర్శులు దండు రాఘవేంద్ర, కరిమని తిమ్మప్ప ఉపాధ్యక్షులు డీకే కిష్టప్ప, వడ్ల మరెప్పు, గుంతల హన్మంత్రాయ, మండల కార్యదర్శులు గురువు మల్లేష్, సి.మహాదేవ్, కట్ల తాయప్ప, జెంసెర్ నర్సింగప్ప, ఖందొడ్డి ఆంజనేయులు, సీనియర్ నాయకులు శక్తి సింగ్, బి.శంకప్ప, చెట్టే సురేష్, బిలారం శశిధర్, బుర్ర తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

## మన పంటలకు మనమే ధరలు నిర్ణయించే రోజుల కోసం కొట్లాడాలి




మాజీ ఎంఎల్‌సి నాగేశ్వర్

**ప్రజాపక్షం/జడ్చర్ల:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలు సోమవారం రాష్ట్ర అధ్యక్షులు కెచ్చేల రంగారెడ్డి అధ్యక్షతన ప్రారంభం అయ్యాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రధాని ఆగస్టు పదిహేను నా ఎర్రకోట నుండి దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ ప్రజలకు అండగా ఉంటానని మాట ఇచ్చాడు. కాని మరుసటి రోజే పత్తి మీద విదేశాల నుండి దిగుమతి చేసుకునే పత్తి మీద దిగుమతి సుంకాలు రద్దు చేశాడు. ఇలా చేయడం ద్వారా మన పత్తి రేటు పడిపోయే విదేశాల నుండి వచ్చే పత్తి రేటు తక్కువ ఉంటుంది. కాబట్టి ఇక్కడి టెక్స్‌టైల్ మిల్లులు విదేశాల పత్తి కొనడంతో మన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారన్నారు. ఇతర దేశాల్లో రైతులు పండించిన పంటలకు పెట్టుబడికి పన్నెండు రేట్లు అధిక ధర ఇస్తున్నాయి అన్నారు. కాని మన దేశంలో పెట్టిన పెట్టుబడికి పన్నెండు రేట్లు అధిక ధర ఇస్తున్నాయి. కాని మన దేశంలో పెట్టిన పెట్టుబడి కూడా ధరలు రాకపోవడం రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వమంటే కార్పొరేట్లకు లక్షల కోట్లు బ్యాంకు రుణాలు రద్దు చేయలేదు. మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ మనం పండించిన పంటలకు మనమే ధరలు నిర్ణయించే రోజులు రావాలన్నారు. ఈ సభలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు టి.దామోదర్ రావు, ఏఐపికెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.కృష్ణ, టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.హన్మేశ్, ఏఐయుకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాము, సిహెచ్ రాంచందర్, సి.వెంకటేశ్, ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్మిక సంఘం విద్యార్థి యువజన సంఘాల నేతలు సాంబశివుడు, కాశీనాథ్, యాదగిరి, రాజన్న, కొండారెడ్డి, ఆర్‌ఆర్ మన్యం, రామకృష్ణ, అరుణ్ కుమార్, బాలు, నరసింహ, సీతారాం, మధు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతాని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం (డిఎచ్ఈడబ్ల్యూ) ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో బాల్య వివాహాలకు సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, ట్రైనింగ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ విడుదల చేశారు. బాలికలను రక్షిద్దాం బాలికలను చదివిద్దాం అనే నినాదంతో బాలికా విద్య పై ప్రత్యేక శ్రద్ధ, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలనకు బాధ్యతాయుతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, ట్రైనింగ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ అధికారులు శ్రీలత, కరిష్మ, సాయి, నర్సింహులు, అనిత, నరసింహ, లక్ష్మి కాంత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ**

దామరగిద్ద మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైరిస్క్, నాన్ ప్రైమీ, ప్రైమి, ప్రసవాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈడీడీ క్యాలెండర్ లో పూర్తి వివరాలు వాటి సంఖ్యలతో సహా నమోదు చేయాలన్నారు. ఆస్పత్రి లో జరిగే ప్రసవాల వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోజువారి ఓపి వివరాలను అడిగి ఎక్కువగా ఎలాంటి రుగ్మతలతో వస్తున్నారని డాక్టర్‌ను ప్రశ్నించగా రోజూ 100 నుంచి 120 మంది వివిధ రకాల రుగ్మతలతో వస్తారని కలెక్టర్‌కు తెలిపారు. ప్రస్తుతం ప్రజలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వృద్ధురాలికి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ సాయి లక్ష్మి , డాక్టర్॥ ఐశ్వర్య తదితరులు ఉన్నారు.



**కలెక్టరేట్ లో మట్టి గణపతుల పంపిణీ**

నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో వినాయక చవితి వేడుకను పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రజలకు, అధికారులకు, ఉద్యోగులకు మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను కాలుష్య నియంత్రణ మండలి ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్.శ్రీను, పి.భాస్కర్ రెడ్డి అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ బోర్డు ఆఫీస్ హైదరాబాద్ వారు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# కంబ్యాక్... అదిరింది




భారత స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చానూ మరో పతకంతో మెరిసింది. టోక్యో ఒలింపిక్స్‌లో కంచు మోత మోగించిన ఆమె ఈసారి కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్స్‌లో రికార్డు బ్రేకింగ్ ప్రదర్శనతో స్వర్ణం కొల్లగొట్టింది. అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన 48 కిలోల ఫైనల్లో మీరా తన పవర్ చూపిస్తూ.. 193 కిలోలు ఎత్తి పసిడి పతకం పట్టేసింది. వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో సత్తా చాటాలనుకుంటున్న మీరాకు ఈ విజయం వెయ్యి ఏనుగల బలాన్ని ఇవ్వనుందనడంలో అతిశయోక్తి లేదు. పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపరిచిన మీరాబాయి ఏడాది కాలంగా వెయిట్ లిఫ్టింగ్‌కు దూరంగా ఉంది. కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్స్ కోసం మళ్లీ బరువులు ఎత్తిన ఆమె తన శక్తికి మించిన ప్రదర్శన కనబరచాలనుకుంది. తొలి ప్రయత్నంలో 84 కిలోలు ఎత్తిన మీరా.. రెండోసారి ఏకంగా 109 కిలోలు ఎత్తి విజేతగా నిలిచింది. 'అహ్మదాబాద్‌లో స్వర్ణ పతకం గెలుపొందడం చాలా సంతోషంగా ఉంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత దాదాపు ఏడాదికి సొంతగడ్డపై గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది. ఇక్కడి ప్రేక్షకులు ఇచ్చిన మద్దతు నాకు కొండంత బలాన్ని ఇచ్చింది. నిరంతర శ్రమ వల్లనే ఈ విజయం సాధ్యమైంది. నా కోచ్ సూచనలు, దేశ ప్రజల మద్దతు నాకు ఎంతో ప్రేరణ ఇచ్చాయి. ఈ మెడల్‌తో వచ్చిన ఆత్మవిశ్వాసంతో అక్టోబర్‌లో జరుగబోయే ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ పోటీలకు రెట్టించిన ఉత్సాహంతో సన్నద్ధమవుతాను. అంతర్జాతీయ వేదికపై మనదేశం గర్వపడేలా చేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతాను' అని మీరాబాయి తెలిపింది.

### ఐదేళ్ల తర్వాత

ఐదేళ్ల తర్వాత మీరాబాయి 48 కిలోలకు మారింది. 2018 నుంచి 49 కిలోల విభాగంలో పోటీపడుతున్న ఆమె పారిస్ విశ్వక్రీడల్లో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. దాంతో, ఒక కిలో తగ్గించుకున్న మీరా.. కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్స్‌లో అంచనాలకు మించి రాణించి పసిడిని ముద్దాడింది. మలేషియాకు చెందిన ఇరెనే హెన్రీకి రజతం, నికోలే రాబర్ట్స్(వేల్స్)కు కాంస్యం లభించింది.

# డ్రీమ్ 11తో కటీఫ్

## అధికారికంగా ప్రకటించిన బిసిసిఐ

టీమిండియా స్పాన్సర్‌షిప్ నుంచి డ్రీమ్11 తప్పుకుంది. బిసిసిఐతో జరిగిన రూ.358కోట్ల ఒప్పందం నుంచి గడువుకు ముందు అర్ధాంతరంగా డ్రీమ్11 రద్దు చేసుకుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఒప్పందం నుంచి వైదొలగాలని ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీ నిర్ణయించుకుంది. బిసిసిఐతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్న విషయాన్ని బిసిసిఐ ధ్రువీకరించింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్ 2025 ఆమోదం నేపథ్యంలో ఒప్పందం ముగిసిందన్నారు. భవిష్యత్‌లో ఆ సంస్థతో బిసిసిఐకి ఒప్పందం ఉండదన్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల డ్రీమ్ 11 ప్రతినిధులు బిసిసిఐ కార్యాలయానికి చేరుకొని టీమిండియా ప్రధాన స్పాన్సర్‌గా ఇకపై కొనసాగలేమని సీఈవో హేమంగ్ అమీన్ అధికారికంగా బిసిసిఐకి వెల్లడించారు. ఒప్పందం రద్దయిన నేపథ్యంలో రాబోయే ఆసియా కప్‌లో భారత జట్టు డ్రీమ్ 11 లోగో లేకుండానే మైదానంలోకి దిగబోతున్నది. బిసిసిఐ త్వరలోనే కొత్త స్పాన్సర్ కోసం టెండర్ జారీ చేసే అవకాశం ఉంది. బైజు స్థానంలో 2023లో బిసిసిఐ స్పాన్సర్ హక్కులను డ్రీమ్ 11 సొంతం చేసుకుంది. ఈ స్పాన్సర్ ఒప్పందం విలువను రూ..358 కోట్లుగా నిర్ణయించారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ ఒప్పందం నుంచి వైదొలిగింది. ఈ నిర్ణయం భారతదేశంలో క్రికెట్ నియంత్రణ మండలిపై మాత్రమే కాకుండా క్రీడా ప్రపంచంపై ప్రభావం కనిపించనున్నది. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు స్పాన్సర్‌గా ఉంది. డ్రీమ్ 11కు పలువురు క్రికెటర్లు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్నారు. ఇందులో మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా వంటి అగ్ర క్రికెటర్లు ఈ జాబితాలో ఉన్నారు. 2020లో భారత్‌చైనా మధ్య ఉద్రిక్తతల సమయంలో వీవో ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను వదులుకున్న సమయంలో డ్రీమ్11 కొంతకాలం టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. తాజాగా డ్రీమ్11 అకస్మాత్తుగా స్పాన్సర్‌షిప్ నుంచి తప్పుకోవడం బిసిసిఐకి ఇబ్బందికరంగా మారింది. కొత్త స్పాన్సర్‌ను వెతికిపట్టుకోవడం సవాల్‌గా మారింది. అయితే, దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా అనేక లీగ్‌లు, ఆటగాళ్లపై కనిపించనున్నది. ఆసియా కప్ ఈ ఏడాది సెప్టెంబర్ రెండోవారం చివరలో మొదలుకానున్నది. దాంతో బిసిసిఐకి స్పాన్సర్‌ను తక్కువ సమయంలో వెతకాల్సి ఉంది. ప్రస్తుతానికి ఆటగాళ్ల జెర్సీలపై లోగో కనిపించదు. ఇది బ్రాండ్ విలువ, ఆదాయం రెండింటిని ప్రభావితం చేయనున్నది. 2020లో వివో వైదొలిగిన తర్వాత డ్రీమ్11 ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌గా వ్యవహరించిన సమయంలో ఇదే పరిస్థితి నెలకొంది. డ్రీమ్ 11 ఈ కంపెనీ అనేక ఐపీఎల్ ఫ్రాంచైజీలకు, అనేక మంది స్టార్ ఆటగాళ్లకు స్పాన్సర్‌గా ఉంది. కరేబియన్ ప్రీమియర్ లీగ్ భాగస్వామి. అదే సమయంలో న్యూజిలాండ్ దేశీయ లీగ్ 'సూపర్ స్మాష్' టైటిల్ స్పాన్సర్ కూడా. ఈ చిన్న టోర్నమెంట్‌లకు ఐపీఎల్ తరహాలో బలమైన ఆర్థిక మద్దతు లేదు. ఈ క్రమంలో డ్రీమ్11 ఒప్పందాలను రద్దు చేసుకున్న నేపథ్యంలో ఆయా జట్లు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకునే అవకాశాలున్నాయి.

# యువతరంగం

## ఫోకస్

# ఎఐతో ఉద్యోగాలకు ఎసరు ?



కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ ఎఐ)తో ఉద్యోగాలకు ఎసరు వస్తోంది. దేశంలో 2030 నాటికి 1.80 కోట్ల ఉద్యోగాలు గల్లంతవుతాయని 'సర్వీస్ నౌ' తాజా నివేదిక అంచనా వేసింది. తయారీ, రిటైల్, విద్య రంగాల్లో భారీ మార్పులు రాబోతున్నాయని, ఏకంగా కోట్ల ఉద్యోగాలు గల్లంతవుతాయని పేర్కొంది. నివేదికను అనుసరించి, విజ్ఞానశాస్త్రం, సాంకేతిక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి యుగంలో, భారతదేశంలోని ఉద్యోగ రంగాలను ఎఐ గణనీయంగా మార్చనుంది. ఎఐ ప్రధానంగా తయారీ రంగంపై తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ రంగంలో సుమారుగా 80 లక్షల మంది ఉద్యోగులు అనేక ఒడిదుడుకులకు లోనవుతారు. అలాగే రిటైల్ రంగంలో 76 లక్షల ఉద్యోగాలు డేంజర్ జోన్‌లో ఉంటాయి. ఇక విద్యా రంగంలో 25 లక్షల ఉద్యోగాలు ఎఐ వలన ప్రమాదం అంచులోకి చేరుతాయి. ఎఐ వృద్ధి అమిత వేగంగా పయనిస్తుండటంతో, అన్ని రంగాల్లోనూ సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అత్యధిక ఆటోమేషన్‌కు లోనయ్యే ఉద్యోగాలైన నిర్వాహకులు, పేరోల్ క్లర్క్స్ తదితరాలు ప్రమాదంలో పడనున్నాయి. అదే సమయంలో కన్సల్టెంట్లు, సిస్టమ్ అడ్మిన్‌లు వంటి హైగ్రోత్ ఉద్యోగాలు ఎఐతో కలిసి పనిచేసే కొత్త విధానాలకు రూపకల్పన జరిగే అవకాశం ఉంది. తాజాగా చూసుకున్నట్లయితే దేశంలో టాప్ ఐటి దిగ్గజం టిసిఎస్ 12 వేల ఉద్యోగాలను ఎఐ రాకతో తీసేస్తున్నట్లు ప్రకటించింది. ఇది మొత్తం శ్రామికశక్తిలో సుమారు 2 శాతానికి సమానం. ఈ నేపథ్యంలో, కృత్రిమ మేధ భవిష్యత్తులో మరెన్ని ఉద్యోగాలను ప్రభావితం చేస్తుందనే ఆందోళనలు పెరిగిపోతున్నాయి. అయితే, భారత్‌కు ఇప్పట్లో ఎఐ వల్ల ముంచుకొచ్చే భారీ ప్రమాదం ఏమీ ఉండదన్న వాదన కూడా వినిపిస్తుంది. ఎఐ రాకవల్ల ఉద్యోగులు చేసే పని లేదా సంస్థలో వారి పాత్రలు మారిపోతాయే తప్ప, పూర్తిగా నిరుద్యోగులుగా మారే అవకాశం లేదని వారి అభిప్రాయం. సంక్షోభంలో కూడా కొత్త అవకాశాలు తలుపుతడతాయని ఆశావహులు అంటున్నారు. మరో నాలుగేళ్లలో 1.35 కోట్ల మంది ఉద్యోగుల పనితీరు మారుతుందని, అదే సమయంలో 30 లక్షల కొత్త టెక్ ఉద్యోగాలు పుట్టుకొస్తాయని అంచనా వేస్తున్నారు. ఇలావుంటే, టెక్ కంపెనీలు బడ్జెట్‌లో 13.5 శాతం మొత్తాన్ని ఎఐ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నది. ఈ రంగంలోని నాలుగో వంతు సంస్థలు ఇప్పటికే డిజిటల్ మార్పు దశలో ఉన్నాయి. 41.67 శాతం ఈ మార్పులకు డేటా భద్రత ఒక్కటే ప్రధాన అడ్డంకిగాఉన్నట్లు సర్వేలో వెల్లడయింది. ఇక డేటా సెక్యూరిటీ విషయంలో 30 శాతం సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. 26 శాతం సంస్థలు భవిష్యత్తులో అవసరమయ్యే నైపుణ్యాలపై స్పష్టత లేదన్నాయి. ఈ సర్వే దేశానికి వ్యూహాత్మక దూరదృష్టితో కూడిన స్కిల్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ అవసరం ఉందని చెబుతోంది. మొత్తానికి ఎఐ ఓవైపు ఉద్యోగాలకు ఎసరు పెడుతూ మరోవైపు కొత్త ఉద్యోగాలకు తలుపులు తెరుస్తోంది.

## గణాంకాల్లో నిరుద్యోగం

భారతదేశ యువ నిరుద్యోగ రేటు గత దశాబ్దంలో గణనీయంగా మార్పులు చూపింది. మిగిలిన దేశాల్లా, భారతదేశం కూడా యువతలో నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోంది,

ప్రస్తుత నిరుద్యోగ శ్రేణులు యువ నిరుద్యోగ రేటు (వయస్సు 15–29): 2023–24లో సుమారు 10.2 శాతంగా ఉంది, ఇది ప్రపంచ సగటు 13.3 శాతం కంటే తక్కువ. 15–24 ఏళ్ల యువతలో నిరుద్యోగ రేటు 2024లో 16.03 శాతం గా నమోదైంది, ఇది 2023లో 15.7 శాతం. మొత్తం నిరుద్యోగ రేటు 2025 మధ్య కాలంలో 5.1 శాతం–5.6 శాతం మధ్యలో ఉంది, కానీ యువద లో ఇది ఎక్కువగా ఉంది. గత దశాబ్దపు ధోరణులు యావత్తుకు యువ నిరుద్యోగ రేటు గత 10 సంవత్సరాలలో సగటున 22 శాతం వద్ద ఉంది. కొవిడ్19 సమయంలో అత్యధికంగా 20 శాతం దాకా చేరింది.

ఆర్థిక వ్యవస్థ తిరిగి తెరుచుకున్న తరువాత నిరుద్యోగ రేటు కొంత తగ్గింది, కానీ నగరాల్లో మాత్రం అత్యధికంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో (8.5 శాతం) నిరుద్యోగం తక్కువగా ఉంది; నగరాల్లో (14.7 శాతం) అధికంగా ఉంది. మహిళల్లో నిరుద్యోగం మరింత ఎక్కువగా ఉంటుంది. కేరళ, లక్షద్వీప్ వంటి ప్రదేశాల్లో 30 శాతం కి పైగా నిరుద్యోగ రేటు ఉంది, ముఖ్యంగా మహిళల్లో నిరుద్యోగ రేటు ఎక్కువ. మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఎంతో తక్కువగా (3.2 శాతం) ఉంది. పట్టభద్రుల నిరుద్యోగం అత్యధికంగా ఉంది; 20–24 ఏళ్లలో సగం మంది ఉపాధి లేకుండా ఉన్నారు.

## వీడియో గేమ్ డెవలపర్ సిమర్



కెనడాలోని అంటారియోలో నివసిస్తున్న సిమర్ ఖురానా వీడియో గేమ్ డెవలపర్. ఆమె కేవలం 6 ఏళ్ల 335 రోజుల వయసులోదె తన మొదటి వీడియో గేమ్ 'హెల్తీ ఫుడ్ చాలెంజ్' అనే గేమ్‌ను తయారుచేసి, 'ప్రపంచంలోనే అత్యంత చిన్న వయస్కుడైన వీడియో గేమ్ డెవలపర్'గా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. ఆ గేమ్ పిల్లలకు ఆరోగ్యకరమైన, అనారోగ్యకరమైన ఆహారాల మధ్య తేడా తెలపడానికి, ఆరోగ్యకరమైన ఆహారం ఎందుకు ముఖ్యమైందో వివరించడానికి ఉపయోగపడుతుంది. సిమర్ ఒకసారి అనారోగ్యానికి గురైనప్పుడు, జంక్ ఫుడ్ తినకూడదని డాక్టర్ చెప్పిన తర్వాత ఆమెకు ఈ గేమ్ ఐడియా వచ్చింది. తన తండ్రి పరాస్ ఖురానా నుంచి కోడింగ్‌పై మూడు సార్లు తరగతులు తీసుకొని, అతి చిన్న వయసులోనే కోడింగ్ నేర్చుకుంది. ఆమెకు గణితంలోనూ మంచి పట్టు ఉంది. స్వయంగా యూట్యూబ్ ట్రైల్స్ ద్వారా గణితం నేర్చుకొని, అందులో ప్రావీణ్యతను సంతపాదించింది. ప్రస్తుతం ఆమె తన వీడియో గేమ్ అభివృద్ధిని మరింత అభివృద్ధి పరచాలన్న పట్టుదలతో వివిధ రకాల ప్రయోగాలు చేస్తున్నది. ఆరోగ్యకరమైన ఆహారం వంటి అంశాలను తన వీడియో గేమ్స్‌లో చేర్చాలని అనుకుంటున్నది. ఫిట్నెస్‌పైన కూడా ఆమె దృష్టి పెడుతున్నది. ప్రజలకు, ప్రత్యేకించి పిల్లలకు అత్యవసరమైన వివిధ అంశాలతో కూడిన వీడియో గేమ్స్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నది.

## యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

---

# ప్రభుత్వ ఉద్యోగులుగా ఆశాలు

## ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగులుగా ఆశావర్కర్లను గుర్తించాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పేందర్ మాట్లాడుతూ ఆశావర్కర్లు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ బడుగు బలహీనవర్గాలకు ముఖ్యంగా గర్భిణీలకు వైద్యం అందించి ప్రాణాలను కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా ఆశాల సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండు సంవత్సరాలు గడిచినా వాగ్దానాలు నెరవేరలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించడంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, హెల్త్ కార్డులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సాయికుమార్, ఎఐటిuc/సి జిల్లా ఉపాధ్యాక్షుడు, ఆత్మకూరి చిరంజీవి, బోయిరే ప్రకాష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

## ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

ప్రజాపక్షం/పెద్దపల్లి : గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలని కళాశాల ఎదుట సోమవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలోనే ఉస్మానియా యూనివర్సిటీని తలపించే విధంగా డిగ్రీ కళాశాల ఉందని, అలాంటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంను మెడికల్ కళాశాలకు కేటాయించి, డిగ్రీ కళాశాలకు మైదానం లేకుండా గత ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎంతోమంది విద్యార్థులు పోలీస్, ఆర్మీ ఉద్యోగాలకు సాధించారని, గ్రౌండ్ లేకపోవడం వల్ల ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంటనే ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్‌కు పెట్టింది పేరన్నారు. రామగుండం ఎమ్మెల్యే ప్రభుత్వ డిగ్రీ కళాశాల పై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత విద్యాధికారులు స్పందించి వెంటనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌ను చదును చేసి విద్యార్థులకు వినియోగంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు గోడిసెల ప్రణీత్, జస్వంత్ ,అభిషేక్, సజన్, సాయి చరణ్, రేహాన్, రామ్ చరణ్, రతిక్ ,భరత్, ఆర్య, అజయ్, అవినాష్, నిరీక్షిత, చైత్ర, సింధుజ, వైశాలి, చైతన్య, సిరివెన్నెల, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి కార్మికుల సంక్షేమానికి కృషి

## సింగరేణి కార్మిక సంఘం (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

## సింగరేణి ఏరియా హాస్పిటల్ సిబ్బంది ఎఐటియుసిలో చేరిక



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో అన్నిరంగాల కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని సింగరేణి కార్మిక సంఘం(ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. సోమవారం సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న పలువురు సిబ్బంది ఎఐటియుసిలో చేరారు. గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో జరిగిన చేరికల కార్యక్రమంలో సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి ఏరియా హాస్పిటల్ లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసికెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సింగరేణి హాస్పిటల్‌లో పని చేస్తున్న కార్మికులు, పారా మెడికల్ సిబ్బందికి పదోన్నతులు రాక ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. దీనిపై గుర్తింపు సంఘం ఎఐటియుసి యాజమాన్యంతో ఇటీవల జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో హాస్పిటల్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. యాజమాన్యం వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సింగరేణి హాస్పిటల్‌లో వివిధ విభాగాలలో పని చేస్తున్న సిబ్బంది ఐక్యంగా ఉంటే ఏ సమస్య అయిన పరిష్కారంలో ఏఐటియుసి ముందుండి పోరాడుతుందని ఆయన అన్నారు. ఎఐటియుసిలో చేరిన మెడికల్ సిబ్బంది సీనియర్ స్టాఫ్ నర్స్ విజయలక్ష్మి , శ్రీకాంత్, గోపి క్రిష్ణ, రమేశ్, శశికాంత్, కిరణ్, సరిత, స్వరూప రాణిలకు వాసిరెడ్డి సీతారామయ్య కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఏరియా హాస్పిటల్ ఎఐటియుసి ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఐటియుసి ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, నాయకులు దాసరి అనిల్, భాస్కర్, సత్యనారాయణ , విద్యాసాగర్, దాసరి శ్రీనివాస్, అటికేటి రాజు, ఉప్పులేటి తిరుపతి, ఎవిఎస్. ప్రకాశ్, కె.జగదీశ్, చెప్యాల మహేందర్ రావు, ఎర్రగొల్ల చేరాలు, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి నలినిరెడ్డి

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** పెండింగ్‌లో ఉన్న రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నలిని రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నలినిరెడ్డి మాట్లాడుతూ రిమ్స్ కాంట్రాక్టర్లు మారినా కార్మికుల సమస్యలు తీరడంలేదని ఆరోపించారు. 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, దాయ కార్మికుల వేతనాలు పెంచి, ఐఎస్ఐ కార్డులు అందజేయాలని, వయస్సు పైబడిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిలా ప్రధాన కార్యదర్శి అమీనాఖాన్, రిమ్స్ మహిళా సంఘం అధ్యక్షురాలు ఎ.అనసూయ కార్యదర్శి షాహిన, రిమ్స్ కార్మికులు ఉమా, రాధ, పోసాని, కె. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కేంద్రం నుంచి పల్లెలకు

# రవాణా సౌకర్యం కల్పించాలి



సిపిఐ ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి సాయికుమార్ డిమాండ్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రం నుండి పల్లెలకు రోడ్ కనెక్టివిటీ పెంచి రవాణా సౌకర్యం కల్పించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. రోడ్ కనెక్టివిటీ పెంచి రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి భద్రి సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని రోడ్లు, భవనాలకు సంబంధించిన శాఖల అధికారుల నిర్లక్ష్యంతో జిల్లా కేంద్రం నుండి పల్లెటూరుకు రోడ్ కనెక్టివిటి ఏర్పాటు చేయడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత వారం రవాణా సౌకర్యం లేకపోవడంతో వాంకిడి మండలానికి చెందిన ఒక మహిళను సకాలంలో ఆసుపత్రికి తరలించలేక పరిస్థితుల్లో ఒక పాపకు జన్మనిచ్చి తల్లి మృతిచెందడం జరిగిందని ఆరోపించారు. ఈ సంఘటనతో జిల్లాలోని ఎన్‌హెచ్‌ఎ, ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్, ఐటిడిఎ ఇంజనీర్ల ఉన్నాధికారుల యొక్క నిర్లక్ష్యం కనబడుతుందన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు, వంతెన నిర్మాణ పనులను త్వరగా చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిరె ప్రకాష్, సిపిఐ మండల కార్యదర్శి నాయికిని వెంకటేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు అజయ్, రాజేష్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేనెంబర్ 1041లో వ్యవసాయ భూములు

# సాగు చేస్తున్న రైతులను ఆదుకోండి

## జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి మల్లీశ్వరి

## సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సూర్యానారాయణ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సర్వే నెంబర్ 1041లో భూములు కోల్పోతున్న రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొప్పోజు సూర్యానారాయణ, మహిళ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి మాట్లాడుతూ హుజూర్‌నగర్ మద్దులనగర్ ఎర్రగట్టు గ్రామాల మధ్య ఉన్న 1041 సర్వే నెంబర్‌లో 300 మంది రైతులు సాగు చేస్తూ జీవిస్తున్నారని, వారందరు చిన్న, సన్నకారు రైతులు అర ఎకరం, ఎకరం, రెండు ఎకరాలు తాతల, తండ్రుల కాలం నుంచి నేటి వరకు ఆ భూములలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఈభూములను గతంలో ఇందిరగాంధీ హయాంలో ఈ రైతులకు పట్టాలు ఇచ్చారన్నారు. సాగర్ ఆయకట్టు టెయిలెండ్ భూములైనందున బావులు, బోర్లు కరెంట్ మోటార్లు పెట్టుకుని వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. తాత ద్వారా తండ్రికి, తండ్రి ద్వారా కొడుకుకి ఈ విధంగా జీవిస్తున్నారన్నారు. ఇప్పుడు నెత్తిమీద పిడుగు పడినట్లు ప్రభుత్వం అగ్రికల్చర్ కళాశాల కట్టడానికి వ్యవసాయ అధికారులు ఈ భూములను చూసి వెళ్లారని, వారం రోజులకు సర్వే కూడా మొదలు పెట్టారన్నారు. ప్రభుత్వం స్పందించి సర్వేను నిలిపివేసి సర్వే నెంబర్ 1041లో భూములను భూములు కోల్పోతున్న రైతులు సాగు యోగ్యం అయ్యే విధంగా చూడాలని వారు కోరారు. ఈ భూములను కోల్పోతే ఆ రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ఆడపిల్లలను వదిలేసే పరిస్థితి దాపురించవచ్చని, భూములకు రైతుబంధు, రైతు బీమా వస్తనే ఉన్నాయని, ఈ భూములకు బ్యాంకులలో క్రాప్‌లోన్స్ తీసుకున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల భూములను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చనగాని సైదులు, ఇందిరాల నారాయణ, కటారి లింగయ్య, ఎర్ర వెంకటరెడ్డి, కంచర్ల అరవిందరెడ్డి, కృష్ణమూర్తి, పశలక్ష్మి , రామనర్సమ్మ, గోసుల నర్సింహరావు, పుల్లెందుల ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## మణికొండ రవాణాశాఖ కార్యాలయంలో స్తంభించిన ఆన్‌లైన్ సేవలు

**ప్రజాపక్షం/గండిపేట :** గండిపేట్ మండలం మణికొండ మున్సిపల్ పరిధిలో ఉన్న రవాణా శాఖ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు స్తంభించాయి. విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐదు కిలోమీటర్ల మేర విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను జిహెచ్ఎంసి అధికారులు తొలగించారు. దీంతో కేబుల్ వైర్ల తొలగింపుతో ఆర్టిఏ కార్యాలయానికి ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. వైర్ల తొలగింపుతో సోమవారం ఆర్టీవో కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి, దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వందల సంఖ్యలో కార్యాలయానికి చేరుకున్న దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలాసేపు కార్యాలయం ఆవరణలోనే వేచి ఉన్నారు. వాహనదారులకు మంగళవారం నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** బాలాపూర్ గణనాథున్ని దర్శించుకోవడానికి రావాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కళ్ళెం నిరంజన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, బోయపల్లి రాఘవేందర్, పన్నాల రాజేందర్‌రెడ్డి, చిగిరింత దయ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారం కోసం పోరాడాలి

బిసి ఇంటలెక్చువల్ కన్వీనర్ చిరంజీవులు



**ప్రజాపక్షం /హయత్ నగర్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసి లను మోసం చేస్తున్నాయని,బి సిలు రాజ్య అధికారం కోసం ఐక్యం గా పోరాడాలనిబి సి ఇంటలెక్చువల్ కన్వీనర్,రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు పిలుపునిచ్చారు. సోమవారం మన్సూరాబాద్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బిసి ఇంటలెక్షువల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు కు రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బిసి లను మోసం చేస్తున్నాయని తెలిపారు. ఇంటలెక్చువల్స్ ఫోరం కోర్ కమిటీ సభ్యులు ఒంటెద్దు నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ ఫోరం అధ్యక్షులు బాలరాజ్ గౌడ్, బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి ఆలేటి శ్రీనివాస్ గౌడ్, చామకూర రాజు,కె వి గౌడ్,క ర్నాటి మనోహర్ నేత,నక్క మహేష్ యాదవ్ ,చెన్నా శ్రీకాంత్, బొల్లం ఆంజనేయులు, కర్నాటి మనోహర్ నేత, మవిండ్ల లింగేష్ యాదవ్, నక్క శ్రీనివాస్ యాదవ్, కడారి రమేష్ యాదవ్, పాలకూరి అశోక్ గౌడ్, దాసోజు లలిత అవ్వరు వేణు, గౌడ్ కొండల్ గౌడ్, బైరు శేఖర్, ఘోర శ్యాంసుందర్ గౌడ్ దుర్గయ్య గౌడ్, ఐలి వెంకన్న గౌడ్, గోరా శ్యాంసుందర్, నకరేకంటి శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం సరూర్‌నగర్ డివిజన్ పంజాల అనిల్‌కుమార్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ విజయదుర్గ సమేత ఉమమహేశ్వర దేవాలయ వార్షికోత్సవ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ ఫౌండర్స్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షులు ఇంటూరి అంకిరెడ్డి దంపతులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త, నాయకులు రిషీ, కట్ట ప్రవీణ్ పాల్గొన్నారు.

## బాబా రాందేవ్ యాత్ర ప్రారంభం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** అధ్యాత్మిక ఉత్సాహంతో, భక్తిశ్రద్ధలతో మార్వాడి సమాజం పెద్ద సంఖ్యలో బాబా రాందేవ్ దేవాయానికి బయలు దేరుతున్న యాత్రను తాను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌కె పురం డివిజన్ పరిధిలోని అమర్‌చాంద్, కమల ఆధ్వర్యంలో అల్కాపురికాలనీ పార్కు నుండి శివరాంపల్లిలోని బాబా రాందేవ్ దేవాలయం వరకు పాదయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వంశీ, భీంసింగ్, పగడాల ఎల్లన్న, మెగారాజ్, సంసార రామ్, దినేష్, గోపాల్‌రెడ్డి, రాంస్వరూప్, మనీష్, సతమాల్ తదితరులు పాల్గొన్నారు.
ఫోటోరైటప్3ః యాత్రను ప్రారంభిస్తున్న ఉపేందర్‌రెడ్డి

## హామీలు అమలు చేయాలి : అందెల



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. మండల బిజెపి అధ్యక్షులు టి.యదీష్ ఆధ్వర్యంలో మండల కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ నిసరన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తుందే కాని ప్రజలకు చేసేదేమి లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా సభ్యులు పాపయ్యగౌడ్. అనంతయ్యగౌడ్, విద్దె సుదర్శన్‌రెడ్డి, మాదవాచారి, పోతల సుదర్శన్‌యాదవ్, కుండేకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 'హైడ్రా ప్రజావాణి'లో 48 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని.. చట్టాలను ఉల్లంఘిస్తున్నారని... నిబంధనలను పట్టించుకోవడం లేదని పలువురు 'హైడ్రా ప్రజావాణి' సోమవారం ఫిర్యాదు చేశారు. ప్లాట్లకు పక్కనే ఉన్న రోడ్లను, పార్కులను కలిపేస్తున్నారని, కోర్టు స్టేటస్ కో ఉన్నప్పటికీ గచ్చిబౌలిలో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు పలు నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. కాప్రా జవహర్‌నగర్ సరిహద్దులలో లే ఔట్ వేసి 33 అడుగుల రోడ్డును ఆక్రమించారని ఇలా ప్రజావాణికి 48 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్ గా వెంటనే తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు ఇవే...

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని గోపన్నపల్లి గ్రామంలో సర్వే నంబర్ 178లో ఉన్న ప్రభుత్వ భూమి, చిన్నపెద్ద చెరువు పరిధిలో భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రభుత్వం నిర్మించిన ప్రహరీని కూల్చేసి, చెట్లను నరికి చదును చేసి ఆక్రమించారు. మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని నాగారం మునిసిపాలిటీ పరిధిలో ఉన్న అన్నారాయన్ చెరువు ఆక్రమణలకు గురవుతుంది. నిర్మాణ వ్యర్థాలతో ఆ చెరువును మట్టితో నింపేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని ఎంఎల్‌ఎ కాలనీలో రెండు ప్లాట్ల మధ్య ఉన్న సుమారు 100 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఇరువైపుల వారు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. షేక్‌పేటలోని నక్షత్రాయ నగర్ లే ఔట్ మొత్తం 25 ఎకరాలు. ఇందులో మొత్తం 249 ప్లాట్లు ఉన్నాయి. 16,158 గజాలను ప్రజా అవసరాల కోసం కేటాయించారు. 2022లో ఇష్టానుసారంగా పార్కును, రహదారులను కబ్జాచేసేసి ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ప్లాట్లుగా మార్చేశారు. అలాగే బేగంపేట, భగవంత్పురం ప్రాంతంలోని విమానాశ్రయం నుంచి వస్తున్న వరద కాలువను ఆక్రమించి మట్టితో నింపుతున్నారు.

## ప్రజావాణి వినతులు పరిష్కరించండి

జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజావాణిలో అందే వినతులను తక్షణమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే ఫిర్యాదు చేయకుండా, హెచ్ఓడిలు ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పలువురు వివిధ సమస్యలపై జిహెచ్ఎంసి కమిషనర్‌కు వినతులను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పంకజ, గీతారాధిక వేణుగోపాల్, మంగతాయారు, సిఇ రత్నాకర్, హౌసింగ్ సిఇ నిత్యానంద, అడిషనల్ అదనపు చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, గంగాధర్, వెంకన్న, డిప్యూటీ సిఇలు సంపత్, పరసరెడ్డి, హౌసింగ్ ఇఇ వివి రవీందర్, రాజేశ్వర్‌రావు, ఎలక్ట్రికల్ ఇఇ మమత, అసిస్టెంట్ అడ్వర్టైజ్మెంట్ అధికారి భాను పాల్గొన్నారు.



## వినాయక మంటపాల వద్ద వీధి దీపాలు

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** మండల వ్యాపితంగా వినాయక మంటపాల వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేయాలని శంకర్ పల్లి ఇంచార్జ్ ఎంపిడిఒ గోపాల కృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపి డి ఒ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వినాయక మంటపాల వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, మంటపాల వద్ద పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రసాదాలు పంపిణీ చేసిన తర్వాత ఆ వ్యర్థాలు మట్టపాల చుట్టూ ఉండకుండా చూడాలని ఆదేశించారు. గణేష్ నిమజ్జనాలు జరిగే చోట్లను పరిశీలించి,తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.గణేష్ నిమజ్జనానికి ముందుగానే కుంటలు, చెరువులు,వాగులను పరిశీలించి బారికేట్లు అవసరం ఉంటే ఏర్పాటు చేయాలని చెప్పారు. గ్రామాలలో వరమహోత్సవం కార్యక్రమాలు ఆగస్టు 31వ తేదీ వరకు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల పనులు గడువులోగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒ గిరిరాజు,ఎపిఒ నాగభూషణం,అన్ని గ్రామల గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజా అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, డిఆర్ఒ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా అధికారులు సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా, సమస్యలను పరిష్కరించాలని అధికారులను నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 74 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా పాటించండి

ఉద్యోగుల జెఎసి రంగారెడ్డి జిల్లా కన్వీనర్ రామారావు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినాన్ని నల్ల బ్యాడ్జెస్ తో నిరసన విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగుల జెఏసి రంగారెడ్డి జిల్లా కన్వీనర్ డాక్టర్ కె రామారావు తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారుల, కార్మిక, పెన్షనర్ పెండింగ్ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంలో భాగంగా (జంగ్ సైరన్)కు జెఎసి రంగారెడ్డి జిల్లా కన్వీనర్ డాక్టర్ కె.రామారావు ఆధ్వర్యంలో సనాహక సమావేశంతో పాటు వివిధ డిమాండ్లతో వేసిన పోస్టర్ ఆవిష్కరించారు. నిరసన కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం, అక్టోబర్ 12న టిజిఇజెఎసి చేపట్టనున్న చలో హైదరాబాద్ విజయవంతానికి సెప్టెంబర్ 15న రంగారెడ్డి జిల్లా బస్సుయాత్ర ప్రారంభించనున్న కార్యక్రమాల కోసం తెలంగాణ ఉద్యోగుల జెఏసి సమావేశంలో కన్వీనర్ డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ లో జరిగె కార్యక్రమానికి జిల్లా నుండి పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు. సెప్టెంబర్ 15న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా లో జరిగే ఉద్యోగుల జెఎ సి బస్సు యాత్రలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు జెఎసి ప్రతినిధులు కార్యాచరణ నోటీస్ అందజేశారు. అనంతరం సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినం, తెలుగు లలితకళా తోరణంలో జరిగే సభకు సంబందించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు శ్రీనేష్ కుమార్ నోరి, ఎశ్వంత్, వెంకటేష్, నూతనకంటి వెంకట్, శాంతి శ్రీ, రంగయ్య, అనిత, మహేష్, ఈశ్వర్, బాలరాజ్ గౌడ్, లక్ష్మణ స్వామి, అలివేలు, శ్రీను, రేవతి, సుజాత, సైదమ్మ, సుధాకర్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఉత్సవాలకు సహకరించాలి

హయత్‌నగర్ సర్కిల్ కమిషనర్ వంశీకృష్ణ.

**ప్రజాపక్షం/హయత్ నగర్:** నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ కోరారు. పండగ నిర్వాహణకు సంబందించిన ఏర్పాట్లపై సోమవారం మన్సూరాబాద్, హయత్ నగర్, నాగోల్ డివిజన్‌లోని కాలనీ సంక్షేమ సంఘలతో డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ సమావేశమయ్యారు. మన్సూరాబాద్, నాగోల్ హయత్ నగర్ డివిజన్ల కార్పొరేటర్ల పోలీస్ రెవిన్యూ మున్సిపల్ సిబందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతలఅరుణ సురేందర్ యాదవ్, కళ్లెం నవజీవన్‌రెడ్డి సిఐలు మహేష్, మక్బూల్ జాని పాల్గొన్నారు.




## ఫిర్యాదుదారుల మన్నన పొందాలి

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు




**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** ఫిర్యాదు దారుల పట్ల గౌరవ మర్యాదలతో మసలు కోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ జిసుధీర్‌బాబు అన్నారు. సోమవారం ఆదిభట్ల పోలీసుస్టేషన్‌ను సిపి జి.సుధీర్‌బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని డిడి , ఎఫ్ఐఆర్, నేరాల ఇండెక్స్ పరిశీలించారు. అనంతరం సిపి సుధీర్ బాబు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల పోలీసు అధికారులు, సిబ్బంది గౌరవ మర్యాదలతో మసలు కోవాలని, వారి ఫిర్యాదులకు తక్షణ న్యాయం చేయాలని, పోలీసు స్టాఫ్ విధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. పోలీస్ ఇమేజ్ ని సమాజంలో పెంచే విధంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. గణేశ్ నవరాత్రుల సంధర్భంగా పటిష్ట మైన బందోబస్త్ ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా విధులు నిర్వర్తించి నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అన్నీ చర్యలు తీసుకోవాలని సిపి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం డి.సునీత రెడ్డి, ఇబ్రహీం పట్నం ఎసిపి కెపివి రాజు, ఆదిభట్ల ఎస్‌హెచ్ఒ బి.రవి కుమార్, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు,పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్ నిర్మాణాలతో సమస్య పరిష్కరిస్తా

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** బైపాస్ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం కొత్తూరు–నందిగామ మండలాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతోపాటు వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఉమ్మడి కొత్తూరు మండలంలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బైపాస్ రహదారిపై ఫ్లై ఓవర్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే స్థలాలను పరిశీలించారని, త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహులు, నేతలు రవీందర్ గౌడ్, ఇరమోని దేవేందర్, తోట శివకుమార్, జింకల జంగయ్య, నాగేష్, సుదర్శన్ గౌడ్, రాజు నాయక్, శ్రీనునాయక్, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారుల ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయం

**షాద్‌నగర్:** క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ.2లక్షలు ఆర్థిక సహాయం చేశారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో చెస్, వాలీబాల్ క్రీడాకారులకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు క్రికెట్ కిట్ల కోసం రూ.1లక్ష నగదును క్రీడాకారులకు అందించారు. చెస్ అకాడమీ నిర్వాహకుడు వానరాసి జగన్‌కు చేగూరు అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో బోట్స్ టైమర్స్ మెటిరియల్‌కు ఎమ్మెల్యే రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు. వాలీబాల్ అసోసియేషన్ నిర్వాహకులు ఉస్మాన్‌కు చేగూరు అంజయ్యగౌడ్ సహకారంతో వాలీబాల్ కిట్లు, సామాగ్రి కొనుగోలు చేసేందుకు రూ.25వేలు అంజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్‌లో మినీ స్టేడియం నిర్మించేందుకు రూ.2.75కోట్లు మంజూరు అయ్యాయని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, నేతలు మహ్మద్ ఇబ్రహీం, జమృద్‌ఖాన్, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు మెరుగైన వైద్యం అందివ్వడానికి కృషి

భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వం గ్రామీణా ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు మెరుగైన వైద్యం అందివ్వడానికి కృషి చేస్తుందని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రిలో లక్షా 50 వేల రూపాయల వ్యయంతో 750 లీటర్ల (అర్‌ఓ ప్లాంటు) మంచినీటి శుద్ధి కేంద్రాన్ని వారు ప్రాంభించారు. ఈ సంధర్బంగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అసుపత్రికి నిరుపేదలే అధికంగా వస్తారని, వారికి వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అసుపత్రికి వచ్చే రోగుల తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి ఈ ప్లాంటును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసుపత్రి వైద్యాధికారులు పేదలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అసుపత్రిలో దయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. అక్టిమస్ డ్రగ్స్ ప్రైవేటు లిమిటేడ్ వారి సహకారంతో ప్లాంటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసుపత్రిలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఇబ్రహింపట్నం సబ్ రిజిస్టార్ కార్యాలయం ఎక్కడా నిర్మించాలనే విషయాన్ని అధికారులతో చర్చించి నిర్ణయం తీసకుంటామని అన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సబ్ రిజిస్టార్ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో గడ్డన్నారం మార్కెటు కమిటీ చైర్మన్, యాచారం అసుపత్రి సూపరిండేంట్ నవీన్, వైద్యాధికారి ప్రియాంక, మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, రమావత్ జ్యోతి శ్రీనివాస్ నాయక్, మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెటు కమిటీ డైరెక్టర్ మస్కు నర్సింహ్మా, బిఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి, అమృతాసాగర్, మోటే శ్రీశైలం, వరికుప్పల సుధాకర్, వెంకట్‌రెడ్డి, మాజీ సహకార సంఘం చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్ , పాశం జయప్రకాశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నాలా పనులు పరిశీలించిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్:** మన్సూరాబాద్ డివిజన్ లో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా జిహెచ్‌ఎం డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి సహారా స్టేట్స్ కాలనీలోని నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ నాలాని స్థానిక కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఎటువంటి నీటి నిల్వలు లేకుండా కాలనీ వాసులు ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని అన్నారు .డ్రైయినేజి మురుగునీరు,వర్షపు నీరు వేరువేరుగుండా సాఫీగా వెళ్లేటట్లుగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సయ్యద్ జానీ,సుదర్శన్ రెడ్డి ఆదినారాయణ రెడ్డి, రాఘవేందర్, విజయలక్ష్మి,తృప్తి అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి



**ప్రజాపక్షం /బంట్వారం :** బంట్వారం మండల కేంద్రంలో స్థానిక ఎస్ఐ విమల ఆధ్వర్యంలో వినాయక చవితి,మిలాద్ ఉల్ నబి పండుగల ఉత్సవాలపై కమిటీ సభ్యులకు సోమవారం అవగాహనకల్పించారు. ఈ కార్యక్రమానికి దారూర్ సర్కిల్ సిఐ రఘురాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐ రఘురాములు మాట్లాడుతూ గణేష్‌మండపాలకు తప్పనిసరిగా ఆన్‌లైన్ అనుమతులు ఉండాలని, వీధుల్లో ఎక్కడారోడ్డులు బ్లాక్ చేయకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ఆడపడుచులకు అండ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతగానో ఆదుకొంటాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. అల్వాల్ మండల కార్యాలయం వద్ద ఆయన సోమవారం వెంకటాపురం, అల్వాల్ కార్పొరేటర్లు సబితా కిషోర్‌గౌడ్, శాంతి శ్రీనివాసరెడ్డిలతో అల్వాల్ తహసీల్దార్ రాములు, డిప్యుటి తహసీల్దార్ పృథ్వీల సమక్షంలో 59 మంది కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు అనిల్, డోలి రమేష్, వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## ట్రాక్టర్‌పై నుండి నేలకొరిగిన భారీ వినాయకుడు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మరో రెండు రోజుల్లో జరుగనున్న గణేశ్ పండుగ సందర్భంగా మండపానికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న భారీ వినాయక విగ్రహం ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుండి నేలకొరిగింది. అదృష్టవశాత్తు సమీపంలో ఎవరూ లేకపోవటం, ట్రాక్టర్‌పైనా, పక్కనా ఉన్న వారంతా అప్రమత్తమవటంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు. రాంమంతాపూర్ ప్రాంతంలో జరిగిన ఈ సంఘటన విషయం తెలియగానే అక్కడికి చేరుకొన్న పోలీసులు స్థానికులు సహాయకచర్యలు చేపట్టి కిందపడబోయిన వినాయకవిగ్రహాన్ని క్రేన్ సాయంతో పైకి తీసి మండపానికి తరలించే ఏర్పాటు చేసారు

## అందుబాటులోకి నల్లచెరువు సమీప కొలను

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఉప్పల్ నల్లచెరువు సమీపంలోని కొలనును వెంటనే అందుబాటులోకి తేవాలని స్థానిక కార్పొరేటర్ రజిత కోరారు. కొలను శుభ్రం చేయటంతో పాటు కొత్త నీటితో నింపి ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. సోమవారం జిహెచ్‌ఎంసి అధికారులతో కల్సి కొలను సందర్శించారు. జిహెచ్‌ఎంసి ఉప్పల్ డిఇ వెన్నెలా గౌడ్, ఏఈ రాజ్‌కుమార్, ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్, సిఐ నాగరాజు, శానిటేషన్ విభాగ డిఈ చందనలతో పాటు కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



## పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మెరుగైన ఆరోగ్యం కొరకు పౌష్టికాహారం తీసుకోవాలని దీంతో శరీరంలో హిమగ్లోబిన్ స్థాయిలు మెరుగుపడతాయని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ అనిత అన్నారు. సోమవారం తూంకుంట మున్సిపాలిటి శామీర్‌పేటలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (జగద్గిరిగుట్ట) డిగ్రి కళాశాలలో మహిళల కోసం హిమగ్లోబిన్(హెచ్‌బి) పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి నాణ్యమైన పౌష్టికాహారం తీసుకోవాలని దీంతో రక్త హీనత తగ్గి హిమగ్లోబిన్ స్థాయిలు, పెరగడంతో పాటు సమగ్ర ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చేతన, ఎన్ఎస్ఎస్ సభ్యురాలు ధనవేణి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆలయ స్థలాన్ని కాపాడాలని నిరసన

**ప్రజాపక్షం/నాగారం:** దేవాలయ స్థలంను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు రామకృష్ణ కాలనీలోని బీరప్ప దేవాలయం 529 గజాల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాయలం ముందు ధర్నా నిర్వహించారు. ఈ విషయంపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా మేం ఏమీ చేయలేమని సమాధానం ఇస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కౌకుట్ల రాహుల్‌రెడ్డి,నరేందర్‌రెడ్డి,రామకృష్ణయాదవ్,యాదగిరి,సంతోష్ గౌడ్,నాగరాజుతదితరులు పాల్గొన్నారు.

**పార్కు స్థలాన్ని కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు...** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 93లోని సాయికృష్ణ కాలనీలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని కాపాడాలని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఇందులో ప్రెసిడెంట్ రవినాయక్,గణేష్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కూతురు మృతి

**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** వికారాబాద్ జిల్లా పరిధిలోని కోట్‌పల్లి మండల పరిధిలోని బీరెల్లి గ్రామానికి చెందిన తాండ్ర రవీందర్, కూతురు కృప, మోయినాబాద్ మండలంలోని తోల్కట్ట గ్రామ శివరు లో గురుకుల పాఠశాలలో ఎడవరతగతి చదువుతుంది. ఇంటికి వచ్చిన కుతురును హాస్టల్‌లో దింపడానికి వెళ్లిన సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణంలో సమెంట్ ట్యాంకర్ కింద పడ్డ తండ్రి, చిన్న కుతురు ఇక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మహిళా సాధికారతే లక్ష్యం

* మహిళా సంఘాలకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.5కోట్ల రుణాల పంపిణీ
* సైబర్ నేరాలపై ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి అవగాహన



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కేంద్ర భారత ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పోరేట్ జనరల్ మేనెజర్ ఎడి శ్రీనివాస్ అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటిలోని ఎన్‌పిఆర్ గార్డెన్‌లో మూడు నెలల ఆర్థిక సమగ్రత సాంద్రికరణ ప్రచారంలో బాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని అలియాబాద్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం హైద్రాబాద్ ఆద్వర్యంలో మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పోరేట్ జనరల్ మెనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతిలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై బ్యాంక్ సిబ్బందితో అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ఈ సమావేశానికి వచ్చిన మహిళలు ఇక్కడ జరిగిన విషయాలను మరి కొంత మందికి చేరవేయాలని సూచించారు. ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరికి బ్యాంక్ ఖాతా ఉండాలని గత పదిహేను సంవత్సరాల నుంచి బారత ప్రభుత్వం జనధన్ ఖాతలను ప్రారంబించిందన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు యుపిఐ నుంచి డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని చెప్పారు. ఎద్దైనా బ్యాంక్‌లో ప్రతి ఒక్కరు తమ బ్యాంక్ ఖాతాలకు సంబందించి రీకేవైసిని తప్పకుండా చేయించుకోవాలని చెప్పారు. ఖాతాదారుడు తమ బ్యాంక్ అకౌంట్‌లో రూ. 256 లను ఉంచుకోవాలని ఈ డబ్బులు బీమాకు దోహదపడుతాయని సూచించారు. ఎల్‌డిఎం శివప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పలు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

సైబర్ నేరాల బారిన పడకుండా సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు రూ. 5,36 లక్షల చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో హైద్రాబాద్ జోనల్ హెడ్ ధారాసింగ్‌నాయక్, రీజినల్ హెడ్ దిలీప్‌కుమార్ బనర్వాల్, ఆర్‌బిఐ ఎజిఎం రెహ్మాన్, మున్సిపల్ మేనెజర్ శ్రీనివాస్, అలియాబాద్ బ్యాంక్ బ్రాంచ్ మెనెజర్ మాధురి, రీజినల్ మార్కెటింగ్ చీఫ్ మేనెజర్ ఉమాజానకి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమం టియుడబ్ల్యుజె(ఐజెయు)తోనే సాధ్యం

వచ్చేనెల ఐదు వరకు సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి

మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు



**ప్రజాపక్షం/దుండిగల్ :** జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ లిస్టు సంఘం (టియుడబ్ల్యుజె ) నిరంతరం పాటుపడుతుందని సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అన్నారు. సోమవారం సూరారంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు కుత్బుల్లాపూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కోటగడ్డ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం పటిష్టత కోసం సభ్యులు పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 5వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రెండు సంవత్సరాలుగా పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ సభ్యులుగా నమోదు చేయాలని సూచిం చారు. సంఘం లో సభ్యులైన వారి వివరాలు కార్మిక శాఖలో నమోదు చేయించబడతాయని తెలిపారు. తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఐక్యమత్యంతో ఉంటేనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలు గడుస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై చొరవ చూపకపోవడం దారుణం అన్నారు. ఇకనైనా ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, సాయిబాబాలు మాట్లాడుతూ జిల్లా కమిటీ పిలుపుమేరకు కార్యవర్గ సభ్యులంతా సభ్యత నమోదులను చేపట్టాలని కోరారు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదుకు బాధ్యులను వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు నాగేంద్రాచారి, దయాకర్ రెడ్డి, ప్రెస్ క్లబ్ కోశాధికారి శేషారెడ్డి, స్థానిక సభ్యులు గ్రంధాలు, రాజేందర్, కృష్ణ గౌడ్, శాంతన్ కుమార్, శ్రీనివాస్, పాషా తదితరులు పాల్గొన్నారు.





## అక్రమ నిర్మాణాలు తొలగించాలి

సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ బ్లాక్ నెంబర్ 21,22 వెనక వున్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 233/15లో వున్న స్థలం కబ్జాచేసి నిర్మించిన రెండు విల్లల అక్రమ నిర్మాణాలపై సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాఅడిషనల్ కలెక్టర్ విజేయందర్ రెడ్డికు పిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, బాచుపల్లి మండల పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్ 3 బ్లాక్ నెంబర్ 21,22 వెనక వున్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 233/15 ను కబ్జా చేసి సర్వే నెంబర్ 274 లో పత్రాలతో పర్మిషన్ తీసుకొని అక్రమ నిర్మాణలను చేపడుతున్నారని అన్నారు. నిజాంపేట్లో ప్రవేటు స్థలం పత్రాలు చూపెడుతూ, ప్రభుత్వ స్థలలను కబ్జా చేయడం సర్వసాధారణంగా మారిందని బాచుపల్లి తహసీల్దార్ ఫుల్ సింగ్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ భాను చందర్ మున్సిపల్ కమిషనర్ షబ్బీర్ అలీ, టౌన్ ప్లానింగ్ సరితకు అనేక సార్లు పిర్యాదు చేశామని అన్నారు. కబ్జా దారులకు స్థానిక అధికారులే సహకరిస్తున్నారని కనుక వెంటనే పై కబ్జా, అక్రమ నిర్మాణాలు తొలిగించి వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున రెవిన్యూ, మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించరు. ఈ కార్యక్రమంలో ఆశి యాదయ్య, పీ. దాస్తగిరి, బి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా సప్లై చేయడంలో బిజెపి ప్రభుత్వం విఫలం

సిపిఐ వికారాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు గోపాల్ రెడ్డి


**ప్రజాపక్షం/నవాబుపేట్ :** కేంద్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు యూరియా సరఫరా చేసినట్టు అబద్ధాలు చెబుతుందని సిపిఐ వికారాబాద్ జిల్లా కమిటీ సభ్యులు ఇందురుపాటి గోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి కేటాయించిన మొత్తం యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర బిజెపి నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు సరిపడా యూరియా సప్లై చేయడంలో బిజెపి కేంద్రంలో మోడీ, అమిత్ షా, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని అన్నారు.

సొమ్మొకరిది సోకొకరిది అన్నట్టు దక్షిణ భారతదేశ జీఎస్టీ రెవెన్యూ వసూలు చేసి ఉత్తర భారతదేశంకు నిధులు అన్ని ఖర్చు చేస్తూ మతం పేరుతో ప్రజలను మోసం చేస్తూ, యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతుంటే తెలంగాణ నుండి ఎనిమిది మంది బిజెపి ఎంపీలు కేంద్రాన్ని అడిగే దమ్ము లేక రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డిని బదులాం చేస్తున్నారు. యూరియా సప్లై మొత్తం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిది ఇప్పటికైనా తెలంగాణ రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని రాష్ట్రానికి సరిపడా యూరియా అందించాలని కోరినారు.

## ప్రజావాణిలో 95 అర్జీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 95 అర్జీలను ధరఖాస్తుదారులు అధికారులకు సమర్పించారు. వీటిని





స్వీక్రరించిన జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి లు వారితో పాటు ఉన్న వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియ చేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు.

**వికారాబాద్‌లో:** ప్రజావాణి కార్యక్రమానికి 130 ఫర్యాదులను అదనపు కలెక్టర్లు లింగ్యానయక్ , సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్ చౌదరి తో కలిసి స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా లోని వివిధ ప్రాంతల నుండి వచ్చిన ప్రజలనుండి దరఖాస్తులు స్వీకరంచడం జరిగింది అని అన్నారు. వచ్చిన ప్రతి పిర్యాదుపై సంబంధిత అధికారులకు తెలియజేయా లని అన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని అన్నారు. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా పెన్షన్ దారులకు ముఖచిత్రం ద్వారా పెన్షన్ అందించడం జరుగు తుంది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 194మంది బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లను ఎంపిక చేయడం జరిగిందని వీరికి ముబైల్‌ఫోన్‌లు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఆర్‌డిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

## భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యుడిగా సతీష్‌బాబు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** భాగ్యనగర్ ఉత్స వ కమిటీ ఎఎస్ రావు నగర్ సభ్యునిగా టిడిపి రాష్ట్ర నాయకులు నీరుగొండ సతీష్‌బాబును అఖిల పక్ష కమిటీ, ఉప్పల్ నియోజక వర్గ గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, మర్రి మోహన్‌రెడ్డి,రాఘవరెడ్డి, రమేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని నీరుగొండ సతీష్ బాబుకు కమిటీ సభ్యులు అందజేసి అభినందనలు తెలిపారు. ఇందులో కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## 2 బిహెచ్‌కె నివాస ప్రాంతాల్లో సమస్యలు లేకుండా చూడాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ జిల్లాలోని 2 బిహెచ్‌కె నివాస ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలంటూ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. సోమవారం ఆయన శామీర్‌పేట మండలంలోని మురహరపల్లి గ్రామం, రాంపల్లి సమీపంలో ఉన్న 2 బిహెచ్‌కె ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నివాసితులతో ఆయన మాట్లాడి ఏమైనా సమస్యలుంటే అడగటంతో తమకు ప్రహరీ గోడ అవసరం ఉందని కోరటంతో వెంటనే దీనికి సంబంధించి కావాల్సిన నివేదికలు వెంటనే సమర్పించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఈ ప్రాంత నివాసితులకు సరిపడే విధంగా నీటి సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించగా దీనికోసం అటవీ శాఖ అనుమతుల విషయంలో ఏర్పడుతున్న జాప్యం కలుగుతున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లటంతో ఉన్నతాధికారులను సంప్రదించి పరిపాలనా అనుమతులు తీసుకోవాలని సూచించా రు. ఇకపై 2 బిహెచ్‌కె ప్రాంతాల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ బోర్డు పిడి రమణమూర్తి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, అటవీ, విద్యుత్ ఆర్ అండ్ బి తదితర శాఖాధికారులఆదేశించారు.



## బిజెపితోనే దేశ ప్రగతి : ఎంపి ఈటల

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దేశ ప్రగతి బిజెపితోనే సాధ్యమని, కార్యకర్తలందరూ సమిష్టిగా కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందుంచాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పిలుపిచ్చారు. సోమవారం ఉప్పల్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు ఫణీందర్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని న్యూశాంతినగర్, సత్యనగర్, గాంధీనగర్ ప్రాంతాలకు చెందిన 54 మంది యువకులు ఆయన సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఎంపి వారికి పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా శిల్పారెడ్డి, ధర్మారెడ్డి, విఠల్‌రావు, రమేష్, అంజిరెడ్డి, వెంకట్, నవీన్‌లు పాల్గొన్నారు.

**చర్లపల్లిలో :** మన సంస్కృతిని,సనాతన భారతీయ ధర్మాన్ని పరిరక్షించుకోవడానికి ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు.శ్రీ రామనూజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో హెచ్‌సిఎల్ చౌరస్తాలో 54 అడుగుల శ్రీ విశ్వరూపా అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సుందరీకరణ పనులకు ఎంపి రాజేందర్‌తో పాటు ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డిలు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా అతిథిలను ట్రస్టు చైర్మన్ డాక్టర్ ధనంజయ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్,కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి,ప్రభుదాస్,శాంతి,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు

మోమిన్‌పేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్ సూచన

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని మోమిన్ పేట్ సీఐ జి.వెంకట్ సూచించారు. గురువారం మండల కేంద్రం లోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్ లో నిర్వహహించిన వినాయక ఉత్సవాల అవగాహన కార్యక్రమాన్ని నవాబుపేట ఎస్సై జి.పుండ్లిక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గణేష్ ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోమిన్ పేట్ సీఐ జి.వెంకట్ ఎస్సై పుండ్లిక్ మాట్లాడుతూ, ప్రతి గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. కొత్త కొత్త సాంప్రదాయాలు కాకుండా



మన హాజర సాంప్రదాయాలను పాటించాలని అన్నారు. నిమజ్జనం రోజు పోలీసులకు సహకరించాలన్నారు. పరిమితికి మించి డీజే సౌండ్లను పెట్టుకోవద్దని,ఎలాంటి గొడవలకు తావులేకుండా శోభాయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగాలని సూచించారు. కేబుల్ వైర్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. సూచించిన ప్రదేశాల్లో నిమజ్జనం చేయాలన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, గణేష్ మండపాల దగ్గర చెట్ల కొమ్మలు తీయమని, తాగునీటి సరఫరా కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, విగ్రహాలు వచ్చే దారిలో వాహన దారులకు సహకరిస్తామని అన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఫిర్యాదులను అనుసరించి అధికారులు తగిన చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలం లోని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామాల యువజన సంఘ నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్స్ జీరో దందాలను అరికట్టండి

రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్



**ప్రజాపక్షం / కొడంగల్ :** యూరియా అమ్మకం పేరుతో ఫర్టీలైజర్ షాపుల వారు రైతన్నలను నిలువున దోచుకుంటున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ ఆరోపిస్తు సోమవారం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతు ఓ వైపు యూరియా కొరత రైతన్నలను ఆందోళనకు గురి చేస్తుండగా ఫర్టీలైజర్ షాపుల వారు దీనిని ఆసరగా చేసుకుని అధిక ధరలు, జిరో దందాలతో చేలరేగిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫర్టీలైజర్ షాపుల వారి నిలువుదోపిడి వ్యవహారాలు తెలిసినప్పటికి అధికారులు కనీసం స్పందించకపోవడం లేదని ఆరోపించారు. పలు షాపుల్లో యూరియా బస్తా కొనే రైతులు తప్పని సరిగ్గా మరో ఎరువు లేదా మందులు కొనాలని షరతులు విధించి దందా చేస్తున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. డిఎపి యూరియాలకు అధిక ధరలకు విధించి రైతులను దోచుకుంటున్నారని అన్నారు. దీనిని వెంటనే అరికట్టి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. ఇందులో ఆశమ్మ,హూసేన్ తదితరులున్నారు.

# రీల్

## మిత్ర మండలి పోస్టర్ విడుదల




బలగం ఫేం ప్రియదర్శి హీరోగా వైరా ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై నిర్మిస్తున్న మిత్ర మండలి సినిమా నుంచి పోస్టర్ విడుదల చేశారు. హీరో ప్రియదర్శి బర్త్ డే సందర్భంగా ఈ సినిమా నుంచి ప్రియదర్శి పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సినిమా టీం అందరూ హీరోకు విషెష్ చెప్తూ ఈ పోస్టర్ రూపొందించారు. సప్తస్వర మీడియా, ఫిలిం వర్క్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విష్ణు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం పాటలను ఆదిత్య మ్యూజిక్ విడుదల చేయనుంది. బన్ని వాసు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ మధ్య కాలంలో వచ్చిన వినోదాత్మక చిత్రాలకు ఇది పూర్తిగా భిన్నంగా ఉంటుందని బన్ని వాసు తెలిపారు.

## దివ్య ఖోస్లా ఫస్ట్ లుక్



నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్ హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సితారగా దివ్య ఖోస్లాను పరిచయం చేశారు. బ్యూటీఫుల్ అండ్ క్లాసిక్ గా కనిపించిన దివ్య ఖోస్లా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు.
జీ స్టూడియోస్, ప్రేర్ణా అరోరా ప్రెజెంట్ చేస్తున్న ఈ సినిమాను ఉమేష్ కుమార్ బన్సాల్, ప్రేర్ణా అరోరా ప్రొడ్యూస్ చేస్తున్నారు. మ్యూజిక్ జీ మ్యూజిక్ కో. క్రియేటివ్ డైరెక్షన్ దివ్య విజయ్. జీ స్టూడియోస్ స్ట్రాటజిక్ విజనరీ ఉమేష్ కుమార్ బన్సాల్ మద్దతుతో, ప్రొడ్యూసర్స్ శివిన్ నారంగ్, నిఖిల్ నందా, అరుణ అగర్వాల్, శిల్ప సింగాల్, కోప్రొడ్యూసర్స్ అక్షయ్ కేజ్రివాల్, కుస్సుం అరోరా ఈ ప్రాజెక్ట్ కు మద్దత్తు ఇస్తున్నారు. టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ, ప్యాడ్ మాన్, పరి వంటి హిట్స్ ఇచ్చిన ప్రేర్ణా అరోరా మళ్లీ సినిమాను రూపొంది స్తున్నారు.

## కానిస్టేబుల్ కనకం సక్సెస్ మీట్

'ఈటీవీ విన్'లో విడుదలైన కానిస్టేబుల్ కనకం, ఆల్ ఇండియా ర్యాంకర్స్, అనగనగా చిత్రాలు అద్భుతమైన విజయంతో హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ అందుకున్నాయి. ప్రతి చిత్రం రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌తో టాప్ ట్రెండింగ్‌లో స్ట్రీమ్ అవుతున్నాయి. ఈ సందర్భంగా హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ సక్సెస్ మీట్‌లో హీరోయిన్ వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ..కానిస్టేబుల్ కనకంతో ఈటీవీ విన్ లో భాగం కావడం ఆనందంగా వుంది.
ఒక ట్రూ ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్ తీశారు. సురేష్ బొబ్బిలి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. డైరెక్టర్ ప్రశాంత్ గారికి థాంక్ యూ. సిరిస్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. పార్ట్ 2 కూడా రాబోతుంది అని అన్నారు.



## ఫ్యామిలీతో కలిసి చూసే సినిమా

### డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి



హీరో నారా రోహిత్ మైల్ స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. నాకు ఫ్యామిలీ కథలు ఇష్టం. కలిసుందాం రా నా ఫేవరెట్ సినిమా. అలాంటి ఒక క్యూట్ ఫ్యామిలీ స్టోరీ చేయాలని ఉండేది. రోహిత్‌తో నాకు ఎనిమిదేళ్ల జర్నీ వుంది. నా ఫస్ట్ సినిమాని క్యూట్ ఫ్యామిలీ లవ్ స్టోరీగా చేద్దాం అనుకున్నాను. అప్పుడు ఈ ఆలోచన వచ్చింది. రోహిత్ కి చెప్పాను. కథ రాసి పంపించాను. ఆయన చదివి ఇంప్రెస్ అయ్యారు. అలా ప్రాజెక్టు మొదలైంది. 30 దాటాక పెళ్లి కాకపోవడమే పెద్ద పంచాయతీ అనుకుంటే, ప్రత్యేకమైన క్వాలిటీలు వెతుక్కోనే పర్సన్ ఉంటే ఎలా ఉంటుంది, వాళ్ళ ఇంట్లో పరిస్థితి ఎలా ఉంటుందనేదనే ఆలోచన నుంచి వచ్చింది.
పవన్ సాధినేని దగ్గర ఒక వెబ్ సిరీస్ చేశాను. సాగర్ కే చంద్ర, పల్నాటి సూర్య ప్రతాప్ దగ్గర రైటింగ్ లో చేశాను. వీర భోగ వసంత రాయులు సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్ గాపని చేశాను. అలాగే నేల టికెట్ సినిమాకి అప్రెంటిస్‌గా చేశాను.
రామాయణంలో హనుమంతుడు సీతమ్మ వారి దగ్గరికి వెళ్లి రాముల వారిచ్చిన ఉంగరాన్ని చూపించే ఘట్టం సుందరకాండ. అదొక సెలబ్రేషన్. అయితే సెలబ్రేషన్ కి ముందు ఎన్నో సవాళ్లు వున్నాయి. హనుమంతులవారు ఎన్నో ఎఫరట్స్ పెట్టారు. అలా మా హీరో కూడా ఒక విషయాన్ని ఎచీవ్ చేయాలనుకుంటారు. దానికి ఆయన పెట్టే ఎఫెరట్స్ ఎమిటనేది కథ. అలా సుందరకాండ అనే టైటిల్ పెట్టడం జరిగింది. ఇది పాజిటివ్ టైటిల్. రామాయణం నాకు చాలా ఇష్టం. ఆ టైటిల్ కూడా అలా కలిసి రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. రెండు డిఫరెంట్ ఏజ్ గ్రూపున్న లవ్ స్టోరీ ఇది. రోహిత్ కంటే ఏజ్‌గా కనిపించాలి అదే సమయంలో బ్యూటిఫుల్‌గా ఉండాలి. అలాంటి అమ్మాయి కోసం వెతుకుతున్నప్పుడు శ్రీదేవి విజయ్ కుమార్ ను అనుకున్నాను. శ్రీదేవి రోహిత్ కు తెలుసు. అయితే ఆమెని ఈ క్యారెక్టర్ లో ఒప్పించే బాధ్యత మాత్రం రోహిత్ నా మీద పెట్టారు. నేను వెళ్లి కథ చెప్పాను. కథ నచ్చి వెంటనే ఓకే చేశారు. ఈ సినిమా కోసం ఆవిడ చాలా ఎఫర్ట్ పెట్టారు. స్కూల్ అమ్మాయిగా కనిపించడానికి డైట్ కూడా చేశారు. నాకు కామెడీ చాలా ఇష్టం. అయితే రాయడం అంత ఈజీ కాదు. వీటన్నిటికంటే కామెడీ చేసే నటులు దొరకడం ఇంకా కష్టం. లక్కీగా మాకు చాలా అద్భుతమైన నటులు దొరికారు.

## 'మదరాసి' ట్రైలర్ రిలీజ్



అమరన్ బ్లాక్ బస్టర్ విజయం తర్వాత శివకార్తికేయన్ హై యాక్షన్ ఎంటర్టైనర్ 'మదరాసి'తో రాబోతున్నారు. ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో శ్రీ లక్ష్మీ మూవీస్ నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక వెంచర్ ఇప్పటికే టైటిల్ టీజర్ రెండు చార్ట్‌బస్టర్ సింగిల్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఇప్పుడు మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నీలాగే ఇతరులను ప్రేమించు. అందరూ నీ కుటుంబమే అనుకో. అదే అన్ని రిలీజియన్స్ అందరూ దేవుళ్ళు చెప్పేది' అనే హీరోయిన్ డైలాగ్ తో ట్రైలర్ ప్రారంభమౌతుంది. అక్కడి నుంచి కథ వేగంగా మలుపు తిరుగుతుంది. సిటీ వైపు ఆరు ట్రక్కుల్లో అక్రమంగా తయారు చేసిన గన్స్ బయలుదేరుతాయి. వీటిని అడ్డుకోవడానికి పోలీసులు రంగంలో దిగుతారు. అన్నింటికీ సెంట్రల్ పాయింట్‌గా వుండే శివకార్తికేయన్ పాత్ర అరుదైన మానసిక స్థితి కలిగిన వ్యక్తిగా పరిచయం కావడం, తన స్థితి ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీయడం క్యురియాసిటీని మరింత పెంచుతుంది. తన గర్ల్‌ఫ్రెండ్‌ని రక్షించడానికి జీవితాన్నే మార్చేసే నిర్ణయం తీసుకుంటాడు.




విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ దర్శకత్వంలో వచ్చిన కింగ్ డమ్ సినిమా ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. అన్నదమ్ముల కథకు మాఫియా ఇతివృత్తం జోడించి తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పుడు ఈనెల 27 నుంచి నెట్ ఫ్లిక్స్‌లో ప్రసారం కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళంలో కింగ్ డమ్ పేరుతో, సామ్రాజ్య పేరుతో హిందిలో ప్రసారం అవుతోంది. థియేటర్స్‌లో రిలీజ్ అయి సక్సెస్ ఫుల్ రన్ అయిన ఈ సినిమా ఓటిటి ప్లాట్ ఫామ్‌లో హిట్ అవుతుందని దర్శకుడు గౌతమ్ చెప్పారు.

## కట్టలన్ షూటింగ్ షురూ



క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మాస్ యాక్షన్ థ్రిల్లర్ మార్కో పాన్ ఇండియా హిట్ అయ్యింది. ఇప్పుడు అదే బ్యానర్‌పై ప్రొడ్యూసర్ షరీఫ్ మహమ్మద్ మరో భారీ ప్రాజెక్ట్ కట్టలన్ ను లాంచ్ చేశారు. మలయాళం, తెలుగు భాషల్లో పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ మూవీ పూజా కార్యక్రమం కొచ్చిలో జరిగింది. బాహుబలిలో కనిపించి ఫేమస్ అయిన చిరక్కల్ కలీదాసన్ ఏనుగు పూజా కార్యక్రమంలో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లగ్జరీ కార్లు, బైక్‌లు కూడా ఈవెంట్‌ను మరింత స్పెషల్ చేశాయి. సినిమాలోని కథలైన్‌ను దృష్టిలో పెట్టుకుని పూజా ప్రెజెంటేషన్ కూడా డిజైన్ చేశారు. ఈవెంట్‌లో యాంటోని వర్గీస్, కబీర్ దూహన్ సింగ్, రాజిషా విజయన్, హనన్ షా, జగదీష్, సిద్దిక్, పార్థ్ తివారీ లాంటి స్టార్‌లు హాజరయ్యారు.

## గర్వపడుతున్నా

### సక్సెస్ మీట్‌లో అనుపమ పరమేశ్వరన్



అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్ చేసిన సినిమా 'పరదా'. ఇటీవల విడుదలైన ఈ సినిమా సక్సెస్ మీట్ సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ తెలుగు సినిమాలో పరదా ఒక డేరింగ్ స్టెప్. ఇలాంటి కథని బిలీవ్ చేసి ప్రొడ్యూస్ చేసిన మా నిర్మాత విజయ్‌కి ముందుగా ధన్యవాదాలు. ఇలాంటి సినిమాని చేసినందుకు గర్వపడుతున్నాను. పరదా నా కెరీర్‌లో మోస్ట్ ఫేవరెట్ ఫిలిం అని అన్నారు. డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ఇందులో కొన్ని తప్పులు గురించి కూడా రాశారు. వాటిని కూడా నేను యాక్సెప్ట్ చేస్తున్నాను. అయితే ఇందులో చాలా అద్భుతమైన కంటెంట్ ఉంది. సినిమా చూసిన వాళ్ళు చాలా మంది అప్రిషియేట్ చేశారు.

# వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు

**ఓటు చోరీతో 8 మంది బిజెపి ఎంపిలు గెలిచారు**
**రాష్ట్రంలో ప్రతిపక్షమే లేదు**
**బిఆర్‌ఎస్ ఖేల్ ఖతం**
**వర్ధన్నపేట జనహిత పాదయాత్రలో టిపిసిసి ఛీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్**



ప్రజాపక్షం/వర్ధన్నపేట/వరంగల్ : బిజెపి నేతలు ఎంపీలుగా గెలవడానికి, ప్రధాని మోదీ మూడవసారి అధికారంలోకి రావడానికి దొంగ ఓట్లు( ఓట్ చోరీ)కారణమని, మోసం చేసి కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిందని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. వరంగల్ ఖిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని, వర్ధన్నపేట సాక్షిగా చెబుతున్నా రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని, 100 సీట్లతో మరోసారి అధికారంలోకి వస్తామని ప్రకటించారు. ఆ తరువాత విజయోత్సవ సభ వర్ధన్నపేటలో నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలో సోమవారం సాయంత్రం చేపట్టిన జనహిత పాదయాత్రకు అడుగడుగునా కాంగ్రెస్ శ్రేణులు, నాయకుల, కార్యకర్తల ఘన స్వాగతం పలికారు. పాదయాత్రలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, బి.మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొని శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. పాదయాత్రలో వారు కార్యకర్తలను పలకరిస్తూ, అభివాదాలు చేస్తూ ముందుకు సాగారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద మార్కెట్ యార్డ్ నుండి వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర కొనసాగింది. అనంతరం అంబేద్కర్ సెంటర్లో కార్నర్ మీటింగ్‌లో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రసంగిస్తూ తెలంగాణలో 8 మంది బిజెపి ఎంపిల గెలుపుపై అనుమానం ఉందని, ఓట్ల చోరీ గురించి మాట్లాడితే బిజెపి ఎంపిలు భుజాలు తడుముకుంటున్నారని అన్నారు. ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతమని విమర్శించారు. బిసిల మీద అక్కసు ఎందుకని కిషన్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్ల గురించి మాట్లాడటానికి బిజెపి బిసి నేతలు భయపడుతున్నారని అన్నారు. బిసిలుగా చెప్పుకోడానికి హక్కు ఎక్కడిది అని బిజెపికి చెందిన బిసి ఎంపిలను నిలదీశారు. సిఎం రేవంత్‌రెడ్డి టిపిసిసి అధ్యక్షులుగా ఉన్నపుడు పాదయాత్రలో భాగంగా నాటి వర్ధన్నపేట ఎమ్మెల్యేను ఓడగొడతమని చెప్పి మరీ ఓడించామని గుర్తు చేశారు. మేధావి అనుకునే ఎర్రబెల్లి దయాకర్ ను ఆయన కంటే వయసులో చిన్న అయిన యశస్వినీ రెడ్డి ఓడించారని అన్నారు. పదేళ్లు కెసిఆర్ మోసం చేశాడు కాబట్టే ఫాం హౌస్‌కి పరిమితమయ్యారని, దోచుకున్న సొమ్మును కాపాడుకోవడానికి కోర్టును ఆశ్రయించారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల నాటికి బిఆర్‌ఎస్ ఉండబోదన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఉందా అని అనుమానం వస్తోందని, చెల్లి పంచాయతీ తీర్చలేని కెటిఆర్ ప్రజలను ఏం ఉద్ధరిస్తారని అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి బిఆర్ ఎస్ ఖేల్ ఖతమవుతుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పాదయాత్రలో వరంగల్ డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యేలు సత్యనారాయణ, నాయిని రాజేందర్ రెడ్డి రామచంద్రనాయక్, యశస్విని రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే మురళి నాయక్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ పాల్గొన్నారు. కాగా ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గంలో సోమవారం జరుగుతున్న రెండో విడత జనహిత పాదయాత్రలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ కొండ మురళీధర్ రావు పాల్గొన్నారు.

## పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### రైల్వే జనరల్ మేనేజర్‌కు ఎంపి చామల వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాస్తవను సోమవారం భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల్ కిరణ్ కుమార్ రెడ్డి కలిసారు. ఘట్‌కేసర్ నుండి యాదాద్రి భువనగిరి వరకు ఎంఎంటిఎస్ రైలు భూ సేకరణ కోసం యాదాద్రి కలెక్టర్, మేడ్చల్ కలెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. భువనగిరి నుండి యాదాద్రి(రాయిగిరీ) పనులు మొదలయ్యాయి, వీటిని త్వరితగతిన పనులు పూర్తి చేసి యాదాద్రికీ వచ్చే భక్తులకు అప్ అండ్ డౌన్ కార్మికుల కష్టాలు తీరుతాయన్నారు. రామన్నపేటలో ఫలక్‌నుమా, శబరి, నారాయణాద్రి ఎక్స్ప్రెస్‌లో హాల్టింగ్ గురించి కూడా చర్చించారు. దినికి రైల్వే మేనేజర్ సనుకూలంగా స్పందించారు. వీరితోపాటు సౌత్ సెంట్రల్ రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయనాథ్ కోట్ల, ఎంఎంటిఎస్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సాయిప్రసాద్‌లు ఉన్నారు

## సర్కార్‌కు చింతలేదు (మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు పొందడం వరకు పేపర్ లీక్ మాఫియాలకు అప్పగించిందని, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ విద్యా వ్యవస్థను నాశనం చేసిందని దుయ్యబట్టారు. దేశంలోని యువత ఆగ్రహంతో ఉన్నారని, ఈ అన్యాయాన్ని సహించదని ఖర్గే పేర్కొన్నారు. రాంలీలా మైదానంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌సి అభ్యర్థులు, ఉపాధ్యాయులపై దారుణమైన లాఠీచార్జి సిగ్గుచేటు మాత్రమే కాదు, పిరికి ప్రభుత్వ లక్షణమని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. యువత తమ హక్కులు, ఉపాధి, న్యాయం మాత్రమే డిమాండ్ చేశారని, కాయినా వారిపై లాఠీచార్జ్ జారిగిందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వానికి దేశంలోని యువత గురించి లేదా వారి భవిష్యత్తు గురించి ఆందోళన లేదని స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల ఓట్లతో కాదు, ఓట్లను దొంగిలించడం ద్వారా అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. 'ముందుగా ఓట్లను దొంగిలిస్తారు. తర్వాత పరీక్షలను దొంగిలిస్తారు. తర్వాత ఉద్యోగాలను దొంగిలిస్తారు. తర్వాత హక్కులను, గొంతును నలిపివేస్తారు! యువత, రైతులు, పేదలు, బహుజనులు, మైనారిటీల ఓట్లు అవసరం లేదు, అందువల్ల డిమాండ్లు ఎప్పటికీ వారి ప్రాధాన్యత కావు అని అన్నారు. ఇప్పుడు భయపడకుండా ధైర్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని రాహుల్ ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఈ అంశంపై కేంద్రాన్ని విమర్శించారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌సి విద్యార్థులపై పోలీసు బలగాలను ఉపయోగించడం 'అమానవీయం, సిగ్గుచేటు' అని ఆమె ఎక్స్‌లో హిందీలో పోస్ట్ చేశారు. ప్రతి పరీక్షలో రిగ్గింగ్, ప్రతి రిక్రూట్‌మెంట్‌లో స్కామ్, పేపర్ లీక్‌ల ద్వారా మొత్తం దేశంలోని యువత ఇబ్బంది పడుతున్నారని, బిజెపి పాలనలో నియామక ప్రక్రియ, పరీక్షలలో అవినీతి యువత భవిష్యత్తును నాశనం అవుతోందని అని ప్రియాంక గాంధీ అన్నారు. దాన్ని సరిదిద్దడానికి, యువత మాట వినడానికి బదులుగా, వారిపై లాఠీఛార్జ్ చేయడం దురదృష్టకరమన్నారు. ఢిల్లీ పోలీసు సీనియర్ అధికారి ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, రాంలీలా మైదానంలో దాదాపు 1,500 మంది నిరసనకారులు సమావేశమయ్యారు. 100 మంది అనుమతి సమయం తర్వాత కూడా అక్కడి నుండి బయటకు వెళ్లడానికి నిరాకరించారు. వెళ్లని వారిలో 44 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి లాఠీ ఛార్జ్ జరగలేదని తెలిపారు.

## ఐదుగురు జర్నలిస్టులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

చెందిన మరో కాంట్రాక్టు ఫోటో జర్నలిస్టు హాతెమ్ ఖాలిద్ దాడుల్లో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. 33 ఏళ్ళు వయసుగల అసోసియేటెడ్ ప్రెస్ ఫ్రీలాన్సర్, విజువల్ జర్నలిస్టు మరియం దగ్గా, అమెరికా టివి నెట్ వర్క్ ఎన్‌బిసి విజువల్ జర్నలిస్టు మోయెజ్ అబూతహా, అల్‌జజీరా ఫొటో జర్నలిస్టు మహ్మద్ సలామా అక్కడికక్కడే మరణించారు. మరో జర్నలిస్టు అహ్మద్ అబూ అజీజ్ గాయాలతో చికిత్సపొందుతూ మరణించారు. వీరితో పాటు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది కూడా మరణించారు. ఐతే ఈ మరణాలను ఐడిఎఫ్ ఇంత వరకూ ధృవీకరించలేదు.ఈ దాడులను ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఆసుపత్రి భవనంపై ఎందుకు దాడి చేసిందనే విషయాన్ని చెప్పలేదు. కానీ దాడిపై ప్రాథమిక దర్యాప్తుకు ఆదేశించినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. సోమవారం తెల్లారుజామున మొదటిసారి నస్సెర్ ఆసుపత్రిపై జరిగిన గగనతల దాడుల్లో ఏడుగురు మరణించారు. దీంతో జర్నలిస్టులు హుటాహుటిన అక్కడికి వెళ్ళారు. ఆ తర్వాత మళ్ళీ రెండోసారి కూడా నస్సెర్ ఆసుపత్రిపై ఐడిఎఫ్ దాడులు చేయడంతో జర్నలిస్టులు సహా 12 మంది మరణించారు. మొదటిసారి దాడులు జరిగిన వెంటనే తమ ఫోటో జర్నలిస్టు నస్సెర్ ఆసుపత్రికి వెళ్ళి లైవ్ వీడియో షూటింగ్ చేస్తుండగా రెండోసారి దాడులు జరిగాయనీ, దీంతో ఈ లైవ్ వీడియో షూటింగ్ అర్థాంతరంగా మధ్యలోనే ఆగిపోయిందని రాయిటర్స్ తెలియజేసింది.
15 రోజులక్రితం ఆగస్టు పదో తేదీన గాజా సిటీ అల్–షిఫా ఆసుపత్రి సమీపంలో ఆరుగురు జర్నలిస్టులను హత్యచేసింది. ఆనాటి దాడుల్లో నలుగురు జర్నలిస్టులు మరణించారు. ఇలా ఈ ఒక్కనెలలోనే ఎనిమిదిమంది జర్నలిస్టులు ఐడిఎఫ్ దాడుల్లోమరణించినట్లయింది. 2023 అక్టోబరు ఏడో తేదీ నుండి గాజాలో ఐ డి ఎఫ్ కొనసాగిస్తున్న దాడుల్లో సోమవారం నాటికి 689 రోజులుగా మొత్తం 244 మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించగా, 22 నెలల యుద్ధంలో 192 మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు కమిటీ టూ ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సిపిజె) ప్రకటించింది. ప్రధానంగా అల్ జజీరా న్యూస్ ఛానల్‌కు చెందిన జర్నలిస్టులకు, హమాస్ ఉగ్రవాదులకు సంబంధం ఉందని, హమాస్ ఉగ్రవాదులకు అల్ జజీరా జర్నలిస్టులు ఏజంట్లుగా వ్యవహరిస్తున్నారని ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆరోపిస్తూ ఉద్దేశపూర్వకంగా జర్నలిస్టులను, జర్నలిస్టు కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసి హతమారుస్తున్నది. ఇప్పటివరకూ ఆరుగురు అల్‌జజీరా జర్నలిస్టులను గురిచూసి ఐడిఎఫ్ హత్యచేసింది.
రాయిటర్స్ వార్తాసంస్థ, నేషనల్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ఎన్‌బిసి) రెండు అనుసంధానమై ఉమ్మడిగా పనిచేస్తున్నాయి. ఈ ఒప్పందం కింద రాయిటర్స్ వార్తాసంస్థ ఇంటర్నెట్ సహా ఇతర హార్డ్‌వేర్ సదుపాయాలను సమకూరిస్తే, ఎన్‌బిసి సంస్థ డిజిటల్ సేవలను అందిస్తూ మధ్యప్రాచ్యంలో వార్తలను ప్రపంచానికి అందిస్తున్నాయి. దక్షిణ గాజా ఖాన్‌యూనిస్‌లో నజీర్ ఆసుపత్రిపై ఐడిఎఫ్ దాడుల సందర్భంగా తమ ఇద్దరు జర్నలిస్టులు మరణించినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ ప్రకటించింది.

## రిటైర్డ్ జడ్జీల ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

లేకపోతే 2020 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమై ఉండేదని ఆయన పేర్కొన్నారు. 'సల్వా జుడుం కేసులో సుప్రీంకోర్టు తీర్పును బహిరంగంగా తప్పుగా అర్థం చేసుకుంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటన దురదృష్టకరం. ఈ తీర్పు ఎక్కడా, స్పష్టంగా లేదా బలవంతంగా దాని పాఠ్యాంశం, నక్సలిజం లేదా దాని భావజాలాన్ని బలపరచడం లేదు' అని 18 మంది మాజీ న్యాయమూర్తులు సంతకం చేసిన ప్రకటన పేర్కొంది. ఈ ప్రకటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు ఎ.కె. పట్నాయక్, అభయ్ ఓకా, గోపాల గౌడ, విక్రమ్‌జిత్ సేన్, కురియన్ జోసెఫ్, మదన్ బి.లోకూర్, జె.చలమేశ్వర్ సంతకం చేశారు. భారత ఉపరాష్ట్రపతి పదవికి ప్రచారం సైద్ధాంతికంగా ఉండవచ్చు, కానీ దానిని నాగరికంగా, గౌరవంగా ఎదుర్కోవాలి, ఒక అభ్యర్థి భావజాలాన్ని విమర్శించడాన్ని మానుకోవాలని రిటైర్డ్ న్యాయమూర్తులు స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును ఉన్నత రాజకీయ అధికారి పక్షపాతపూరితంగా తప్పుగా అర్థం చేసుకోవడం సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కుదిపేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భారత ఉపరాష్ట్రపతి పదవి పట్ల గౌరవంతో 'అపకీర్తికి దూరంగా ఉండటం తెలివైన పని అని రిటైర్డ్ న్యాయమూర్తులు అన్నారు. సుప్రీంకోర్టుకు చెందిన ఏడుగురు రిటైర్డ్ న్యాయమూర్తులతో పాటు, ముగ్గురు హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తులు గోవింద్ మాథుర్, ఎస్.మురళీధర్, సంజీబ్ బ్యానర్జీ కూడా ఈ ప్రకటనపై సంతకం చేశారు. లేఖపై సంతకం చేసిన ఇతర వ్యక్తులలో హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు అంజనా ప్రకాష్, సి.ప్రవీణ్ కుమార్, ఎ.గోపాల్ రెడ్డి, జి రఘురామ్, కె.కన్నన్, కె.చంద్రు, బి.చంద్రకుమార్, కైలాష్ గంభీర్ ఉన్నారు. ప్రొఫెసర్ మోహన్ గోపాల్, సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కూడా ఈ ప్రకటనపై సంతకం చేశారు. కాగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'మన దేశానికి ఉన్న గొప్ప దురదృష్టం టూఇన్‌వన్ డబ్ల్యుఎండి–హానికరమైన పరువు నష్టం, దుర్మార్గపు వక్రీకరణ ఆయుధం అని అన్నారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులు సహా భారతదేశంలోని అత్యంత ప్రముఖ న్యాయవాదులు 20 మంది జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై అమిత్ చేసిన అబద్ధాలను బయటపెట్టారన్నారు. శుక్రవారం కేరళలో షా మాట్లాడుతూ, 'సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి సహాయం చేసిన వ్యక్తి. ఆయన సల్వా జుడుం తీర్పు ఇచ్చారు. సల్వా జుడుం తీర్పు ఇవ్వకపోతే, 2020 నాటికి నక్సల్ ఉగ్రవాదం అంతమై ఉండేది. సల్వా జుడుం తీర్పు ఇచ్చిన భావజాలంతో ప్రేరణ పొందిన వ్యక్తి ఆయన' అని అన్నారు. శనివారం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, హోంమంత్రితో సమస్యలపై చర్చించడం తనకు ఇష్టం లేదని, ఆ తీర్పు తనది కాదని, సుప్రీంకోర్టు తీర్పు అని నొక్కి చెప్పారు. పూర్తి తీర్పును చదివి ఉంటే షా ఆ వ్యాఖ్యలు చేసి ఉండేవారు కాదని కూడా ఆయన అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com